ఆంధ్రజ్యోతి

....సచిత్ర మాస [illegible]

సంపాదకుడు : [illegible]

సంపుటి 7] 1 మార్చి 1947 [సంచిక 3

# ఆంధ్రరాష్ట్రము

ఏ యత్నమైనా మొట్టమొదట ఎవరి మెదడులోనో ఏదో ఒక వెఱ్ఱిగా మొలకెత్తుతుంది. తరువాత అది వ్యాపకమై బ్రహ్మజెముడువలె అల్లుకుంటుంది. వరుస వారిలేదు. దోవతెన్ను కనుపించదు. ఒకరువచ్చి 'ఇదిగోచూడు, మన తెనుగువాళ్లు సెక్రటేరియట్‌లో 409 ఉద్యోగస్థులలో 9 గురే ఉన్నారు' అంటారు. మరొకరు వచ్చి — 'డైరక్టరు ఆఫ్ ఇండస్ట్రీసు శాఖలో 104 మందికి 4 గురే వున్నా'రని చెపుతారు. ఇంకోరు వచ్చి - '60 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లలోను, ఒక్క అక్టింగుని ఇంజినీరుతప్ప లెక్కకైనా రెండోవారు లే' రంటారు. 1913 లో ఆంధ్రరాష్ట్రము కావాలన్నప్పుడు ఈపాటిమందైనా లేనేలేరు. అప్పటిలెక్కలు— చిన్న చిన్న కచేరీలకు సంబంధించి వుండేవి. అప్పటికి తెలుగుదేశములో హైస్కూలు మాష్టర్లు—చాలమంది అరవవారే. నారాయణస్వామి అయ్యరు, శ్రీనివాస అయ్యరు, సుందరేశ అయ్యరు, వైద్యనాథ అయ్యరు, తిరుమలై—కొళందుపిళ్లె, శాంటీయాగో—మున్నగువారు, నాకు యేలూరు హైస్కూలులో. 1892—1895 లో మాష్టర్లు. తక్కిన ఊళ్ళలోకూడా అదేపద్ధతి. ఇంక పి. డబ్ల్యు. డి. లో చెప్పనే అక్కరలేదు. క్రిందనుంచి మీదివరకు అరవలే - అంతేనా పెద్దపెద్ద వకీళ్లు - అరవవారు. బందరులో పబ్లిక్ ప్రాసిక్యూటరు రంగాచారిగారు అరవవారు. కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం, చిత్తూరు, నెల్లూరుజిల్లాల సంగతి వేరుగ చెప్పాలా ? రావుబహదూరు C. S. సుబ్రహ్మణ్యం, శేషయ్యశాస్త్రి, అరవ కుట్టి అయ్యంగారు, దొరసామి అయ్యంగారు, పార్థసారథి అయ్యంగారు, కేశవపిళ్లె, జంబులింగ మొదలియారు, కె. శ్రీనివాసరావు మున్నగువారు ఆకాలంలో ప్రసిద్ధ

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య

షురుషులు. ఇంతేకాదు ఆంధ్రదేశమునుండి చెన్నపురి శాసనసభకు ఎన్నిక ప్రతినిధులుగ పంపబడువారిలో, పై పట్టీలో చివరి ముగ్గురు లోకవిదితులు. చివరి ఇద్దరు, ఉద్యోగములలోకి వెళ్ళారు. జిల్లా మునసబులలో సగంమంది అరవలే. సబుజడ్జీలసంగతి ఎత్తడం అనావశ్యకము.

వ్యవహారాలు ఇల్లావుంటూండగా 1911 సం. ఆగష్టు 17 వ తేదీనాడు సెక్రటరీ ఆఫ్ స్టేటుగారు ప్రచురించిన ఒక దస్తావేజులో - అదివరకు విభజింపబడిన బంగాళా రాజధానికి - పునర్విభజన గావించి, సవరించుచు, బీహారునువిడదీసి, కలకత్తానుండి ముఖ్యపట్టణమును ఢిల్లీకి మార్చివేయు సందర్భములో, బీహారును గూర్చి ప్రసంగవశమున భాషాప్రయుక్తరాష్ట్ర విభజననుగూర్చి సూచించుట తటస్థించింది. ఇదే మన ఆంధ్రరాష్ట్రానికి పునాది అనుకోండి. పై దస్తావేజు 1912 తో బహిరంగమైంది.

1913 మేలో బాపట్లలో ప్రథమ ఆంధ్రమహాసభ జరిగింది. బయ్యా నృసింహేశ్వరశర్మగారు అధ్యక్షులు. అప్పట్లో—వీరు శాసనసభ్యులు అగుటచే—నాయకులగుటయేగాక, అప్పటి నాయకులలో ముందంజవేయుచు, జాతీయవాదులుగ పరిగణింపబడేవారు. అప్పటి రాచకీయ విభజనలు అతివాదులు, మితవాదులు. మధ్యవారు జాతీయవాదులు. ఈ విభజనలు ఇంకనూ తరువాత అమలులోనికి వచ్చిన పేర్లవల్ల పిలువబడేవికావు. తరువాత నామకరణము శరీర అవయవములనుబట్టి యేర్పడ్డది. వామహస్తులు, దక్షిణహస్తులు, మధ్యస్తులు, లెఫ్టిస్టులు, రైటిస్టులు, సెంటరుపార్టీ అను ఇంగ్లీషు పదములకు తర్జుమాలు.

హా "శర్మ" ఎంతపనిచేశాడు. ఎంతటికైనా తగినవాడే అని ముక్కుమీద వేలువేసికొని గుడ్లు పెద్దవిచేసి ఆశ్చర్యమును వెలువరిచేవారు మితవాదులు. 1914 లో ఆంధ్రరాష్ట్రముకొరకు "లీగ్సు" సమాజములు ఏర్పరుపవలెనని శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారిచేత అనిపించటానికీ, ఆయనను అసలు వేదికపై తీసికొనిరావటానికి కృత్యాద్యవస్థ అయింది.

ఇది బెజవాడలో జరిగింది. 1915 లో పానుగల్లు రాజాగారు (అప్పటికి జస్టిసు పార్టీ పుట్టలేదు) వ్రాసిన ఉపన్యాసముమీద చీటీ అతికించి ఆంధ్రరాష్ట్రానుకూల వాక్యమును, విశాఖపట్నంలో చేర్పించారు. 1916 లో శ్రీ మోచర్ల రామచంద్ర రావుగారు—"ఫెస్టినలెంటీ" అను ఇంగ్లీషుపదమునకు సరియైన "మెల్లిగా తొందరించు" అనుభవమును వెల్లడిచేశారు కాకినాడలో. అప్పటికి ఒకదశ గడిచింది. 'ఆంధ్రులంటే ఎవరు ?' అని అడిగిన మోచర్ల రామచంద్రరావు పంతులుగారు

అధ్యక్షులయారు. "ఎవరు ఆంధ్రులమని చెప్పుకోడానికి భయపడక, సిగ్గుచెందక, గర్వపడుదురో వారు ఆంధ్రులు" అని నేను బదులు చెప్పాను. దానివల్ల ఆయనకు సంతృప్తి గలుగుతుందా? అయితేనేమి కాలప్రవాహము అప్రతిహతంగదా. 1916 మేకి - కాకినాడలో ఆంధ్రరాష్ట్రి కాంగ్రెసు కమిటీని చెన్నపట్టణపు కమిటీనుండి విడదీయమని తీర్మానముపెట్టి, నెగ్గించాము. 1916 డిశెంబరులో జరిగిన లక్నో కాంగ్రెసు సమక్షమున నేనువ్రాసిన "భాషాప్రయుక్త రాష్ట్రిములు" అన్న చిన్న పొత్తము ఆంధ్రమహాసభ పక్షమున అర్పింపబడ్డది. అప్పటికి పూర్వమే 1914 లో 6 వ్యాసములు ఆంధ్రోద్యమముమీద హిందూపత్రికకు వ్రాసివున్నాను. ఒక్కొక్క వ్యాసమును ప్రచురింపచేయించడానికి నాలుగేశి ఉత్తరములు వ్రాయవలసి వచ్చేది. హిందూసంపాదకులతో చెండాడి అచ్చువేయించుకోవలసి వచ్చింది. కేశవపిళ్ళగారు ఉద్యమమును విరోధించారు. సీడడ్ డిస్ట్రిక్టువారు దీనికి వ్యతిరేకులు అనిరి. శ్రీ బొన్నవిత్తుల గుర్నాధంగారు 'ఆంధ్ర' అను ఇంగ్లీషు పత్రికద్వారా గుంటూరు నుండి వెదజల్లిన విత్తనములు మొలకెత్తసాగినా ఆంధ్రోద్యమము నౌకరీల కొట్లాటకాదు. జాతీయోద్యమమునకు శాఖ అయిన ఉపజాతీయోద్యమము అని నావాదుకు దేశముయొక్క పరిపాలన ఫెడరల్ పద్ధతిమీద జరుగవలెననియు, అందుకు ఆధారప్రాంతములు భాషాప్రయుక్త రాష్ట్రిములయి యుండవలెననియు, అప్పటి రాష్ట్రిములు 14 రాష్ట్రిములకు మించవనియు, ప్రతిరాష్ట్రిమూ వారి విజ్ఞానమును - భారతదేశపు విజ్ఞానమునకు శాఖలు అయియున్న కొంత ప్రత్యేకత కలిగియుండెననియు - పరభాషలో విద్య, న్యాయనిర్ణయము, శాసనసభల చర్యలు జరుపుటవలన దేశమునందు మౌలికశక్తులు నశించుటయేకాక, జనసామాన్య మునకును ఆంగ్లవిద్యాధికులకును మధ్య ఒకవిధమగు అంతరము ఏర్పడెననియు, రాజ్యము స్వరాజ్యము అగుటకు - గ్రామమును గ్రామస్థులు నాయకత్వమువహింప వలెననియు, ఇందుకు విద్యాపద్ధతి న్యాయపరిపాలనా శాసనవిధానము భాషైక్యతమీద ఆధారపడి యుండవలెననియు, ఒక రాజధానియందు ఒక్కభాషే ఉండవలెననియు, ఒక్కభాష రెండు రాజధానులలో నుండవచ్చుననియు - ఈవిధముగ నావాదమును నేను సల్పుచు ఆ గ్రంథము కీర్తిశేషులగు శ్రీ కోపల్లె హనుమంతరావుగారి సహాయముతో 1916 లో వ్రాస్తిని. అంతకుపూర్వము ఆంధ్రరాష్ట్రిము—పూర్వపక్ష సిద్ధాంతములు అను గ్రంథమును ఆంధ్రమహాసభ తరపున ప్రచురించితిమి.

1913–1914 లోనే శ్రీ వెంకటప్పయ్య పంతులు, ముట్నూరి కృష్ణారావు మున్నగు ఆరుగురు పెద్దలు దత్తమండలములలో (అప్పటికి రాయలసీమ అను పేరు వాడుకలో లేదు) సంచారముచేసి, అచ్చటి ప్రజలకు ప్రబోధముగావించిరి.

1917 లో ఆంధ్ర కాంగ్రెసు కమిటీని, బీసెంటమ్మగారితో కలకత్తాలో 24 గంటలుసేపు వాదించి, ఖాయము చేయగలిగితిని. తత్పూర్వము గాంధిగారు

ఈవిషయమును అప్పట్లో ఆపమని చెప్పిరి. సంస్కరణలు వచ్చినతరువాత అమలు పెట్టవచ్చుననిరి. అప్పుడుపెట్టినవరవడి ఇప్పటికీ మనలను ఏడిపిస్తున్నది. అయితే తిలకుగారు నాపక్షమువహించి A I C C లో నన్ను సమర్థించిరి. అప్పటికి మితవాదులు కానివారు A I C C లో నేను ఒక్కడినే మెంబరుగా నుంటిని. 1916 లో అతికష్టముమీద ప్రవేశించి ఇప్పటికి 32 సంవత్సరములు A I C C మెంబరుగ వుండడము తటస్థించినది.

1918 లో మన కాంగ్రెసు కమిటీ విడదీయబడెను. అప్పుడుమొదలు 1937 లో కాంగ్రెసు గవర్నమెంట్లు అమలులోనికి వచ్చేవరకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీలో నేనెట్టిపదవి ఆశించలేదు. పొందాలేదు. 1925 లో మాత్రము నన్ను కాంగ్రెసు ఖజానీగావేశారు. దీనిమాటకేమి ? ఆనాడు మన మూహించిన ప్రత్యేక కాంగ్రెసుకమిటీని అనుసరించి 1918 లో సింధురాజ్యమునకున్ను 1921 లో అన్ని భాషాప్రయుక్తరాష్ట్రములకును ప్రత్యేక కాంగ్రెసు కమిటీలు లభించెను. అప్పటి నుంచి ఆంధ్రసభ వెనుకకుతగ్గి కాంగ్రెసుకమిటీయే ప్రాముఖ్యమును వహించెను. కాని ఆంధ్రమహాసభలు జరుగుతునేయుండెను. యావత్తు తెలుగుజిల్లాలలో ఒక అవృతము తిరిగినతరువాత కొంత ఉపేక్షపాలై తిరిగి 36–37 నుండి ఆంధ్ర మహాసభ చురుకుగ పనిచేయసాగించింది.

1927–28 ప్రాంతములో రాష్ట్రవిషయము మద్రాసు శాసనసభలోనికి తేబడి అంగీకరింపబడ్డది. అంతకుపూర్వము 1912 లో మాంటాగ్యూ వచ్చినపుడు వారివద్దకు రాయబారము వెళ్ళితిమి. ఆయన దీనితత్వమును అంగీకరించి 1918 జూలైలో ప్రచురింపబడ్డ తమ రిపోర్టులో ఏభాషాప్రయుక్త ప్రాంతమునుండి శాసన సభలకేగు ప్రతినిధులలో అధిక సంఖ్యచే ప్రత్యేకరాష్ట్రము కోరబడినచో ఆ శాసనసభ వెంటనే దీనిని యోచింపవలెనని వ్రాసిరి. ఈవిషయమే జాయింటు పార్లమెంటరీ కమిటీ (1919)–15 వ పేరాలో తిరిగి సూచించబడ్డది. పిమ్మట మద్రాసు శాసనభకెక్కింది కాని ఆలకించువారు లేకపోయిరి.

1935–36 లో ఈ ఉద్యమము తిరిగి పునరుద్ధారుణపొంది కాంగ్రెసు గవర్నమెంట్లు వచ్చినపిదప 1938 లో కాంగ్రెసు వర్కింగుకమిటీ యెదుటకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీవారి రాయబారము వెళ్ళినపుడు, సకాలములో దీనినిగూర్చి యోచింపవచ్చును, అని వెనుకటిపాటే వర్కింగు కమిటీవారు పాడిరి. ఆపాటే, ఇప్పుడున్ను పాడబడుచున్నది.

కాంగ్రెసు గవర్నమెంటు కాలములో 1938 మార్చిలో ఈవిషయము చెన్నపురి శాసనసభచే నంగీకరింపబడినమీదట శెక్రటరీ ఆఫ్‌స్టేటుగారికి తెలియపరచగా, అది ఆయనచే నిరాకరింపబడెను. అప్పుడు క్యాబినెటులో జరిగిన వివరములు సర్. రాధాకృష్ణగారు చెన్నపురిలో జరిగిన ఆంధ్రసభకు అధ్యక్షులుగానుండి, గాంధిగారి నుండి ఉత్తరములు తీసుకొని (Secretary of State) ఇంగ్లండు ప్రభుత్వ

1938 లో ముచ్చటించడము. ఆయన తనకు గోషెనుప్రభువువ్రాసిన ఉత్తరము సంగతి సర్ కూర్మాగారికి తెలియపరచడము (చెన్నపట్నంగనుక ఆంధ్రులకు ఇస్తే వీధులలో రక్తపుకాలువలు ప్రవహించునని ఆ ఉత్తరములో ఉన్నదట). 1941 లో విజయనగరము ఆంధ్ర కాన్ఫరెన్సునందు శ్రీ ప్రకాశం పంతులుగారు వెనుకటిసంగతులు వెల్లడిచేయడము దానిమీద జరిగిన రాద్ధాంతములు లోకవిదితములే.

అందువల్లనే శ్రీ ప్రకాశంపంతులుగారి ప్రధానత్వముక్రింద ఆంధ్రరాష్ట్రము సత్వరముగా సిద్ధించునని ఆశగలిగింది. కాని పార్టీలోనో, చెన్నపురి శాసనసభలోనో ఈవిషయము వచ్చినపుడు 1946 లో శ్రీ ప్రకాశం పంతులుగారు Canstituent Assembly (కాంస్టిట్యుయెంట్ ఎస్సెంబ్లీ) లో ఈవిషయము నిర్ణయించబడునని తెల్పిరి. మీరటు కాంగ్రెసులో తిరిగి ఈవిషయము తీవ్రచర్చకు పాలయ్యెను. వర్కింగుకమిటీ నాయకత్రయపు నిరోధమువలన చర్చ వ్యర్థముకాగా, గత్యంతరము లేక శ్రీ కళా వెంకట్రావుగారితో చెప్పి 25 మంది A I C C మెంబర్లచే ఈతీర్మానపు నోటీసు ఇప్పించితిని. అందు 9 గురు అరవలు (శ్రీ సుబ్బరాయన్, కామరాజ నాడారుగారి సమేతు) సంతకములు చేసిరిగాని, శ్రీ ప్రకాశం పంతులుగారు చేయరైరి. అయినప్పటికి చర్చకు తప్పనిసరిగ వచ్చినమీదట, ఒకవిధముగ అంగీకరింతుమని యీపదముల సవరణ తాము వర్కింగుకమిటీలో చేతుమనియు కృపాలానీగారు చెప్పిరేకాని, ఎన్నిసార్లు అడిగినా వర్కింగుకమిటీ లోకి తేరైరి.

తరువాత ఢిల్లీలో 18 డిశెంబరు (1946) లో జరిగిన అఖిలభారత భాషాప్రయుక్తరాష్ట్ర మహాసభ అప్పుడుజరిగిన తీర్మానములు అసెంబ్లీ కి ఈవిషయమునుగూర్చి ఇవ్వబడిన నోటీసులు ఇక్కడజరిగిన ముచ్చట్లు కృపలానీ, నెహ్రూ, సర్దారుల నిరోధమూ పార్టీయొక్క Consultative Committee లో నాకూ వారికీ జరిగిన వివాదములు, Drafting Committee నిర్ణయము, దీని నిష్ఫలత, పిమ్మట C. A కు ఈవిషయమై శాస్త్రప్రకారము ఇవ్వబడిన నోటీసులు, ఈసమయములో జవహరులాలుగారివద్దకు శ్రీ రంగాగారు ఏర్పాటుచేసిన రాయబారము, పిమ్మట Drafting Committee వారితీర్మానము, వాటిఫలితముగ స్టీరింగుకమిటీ ఎదుట ఈవిషయము రావడమూ, వారు తమకులేని అధికారమును దెచ్చుకుని దీనిని నిరోధించడమూ, అనంతశయనం దుర్గాబాయమ్మగార్ల dessent, కట్టకడపట 1947 మార్చి, ఏప్రిలులో జరుగు C. A party యొక్క Consultative Committee లో దీనిని చర్చింపవలెనను ఆపుదల తీర్మానాంగీకారము ఇవన్నియు ఆధునిక చరిత్రలోని ఘట్టములు. వీటినిగూర్చిన వివరములు నేనిప్పుడు వ్రాయుట అనుచితముగా నుండును. రానున్న విషయములనుగూర్చి మనము ఏమియు చెప్పజాలము కానీ చెన్నపురి శాసనసభలో ఈతీర్మానము తిరిగి ఏల గావింపలేదని ప్రశ్నించుచుండిరి.

# కల్లోల ప్రపంచం

ద్వితీయ ప్రపంచమహా సంగ్రామంలో జర్మనీ, ఇటలీ, జపానులు ఓడిపోయినమాట నిజం. కాని, బ్రిటన్, ఫ్రాన్సులు గెలిచిన వనలేము.

ఆ సంగ్రామానికి పూర్వం ప్రపంచంలో ఏడు మహారాజ్యా లుండేవి. బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, జపాను, సోవియెట్ రష్యా, యునైటెడ్ స్టేట్సులు—ఇవే ఆ ఏడు మహారాజ్యాలు.

ఇక, ఈనాడు మహారాజ్యాలుగా పరిగణించదగినవి కేవలం రెండే. వీటిలో మొదటిది,—యునైటెడ్ స్టేట్సు. రెండవది,—సోవియెట్ రష్యా.

దీన్నిబట్టి గత యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్సులు పేరుకు గెలిచినా, నిజానికి ఓడిపోయినవనే అనుకోవచ్చు.

ప్రపంచం మొత్తంపై పెద్దసైన్యం, పెద్ద నౌకాదళం, పెద్ద వైమానికబలం నేడు యునైటెడ్‌స్టేట్సుకు వున్నాయి. ప్రపంచం మొత్తంపై అధిక పారిశ్రామికశక్తి దానిదే; హెచ్చు గోల్డురిజర్వు దానిదే. తన సరిహద్దుల వెలపల నేడు దానికున్నన్ని సైనిక, నౌకా, వైమానిక స్థావరాలు మరి దేనికీలేవు. పసిఫిక్‌పై, అట్లాంటిక్‌పై ఈనాడు దాని ప్రాబల్యం అపూర్వం; అప్రతిహతం. దూరప్రాచ్యమేమి, దక్షిణ అమెరికా ఖండమేమి దాని ఆర్థిక ప్రాబల్యంకిందికి అధికంగా వచ్చినవి. పశ్చిమ యూరప్‌ఖండం సయితం దాని ఆర్థిక ప్రాబల్యానికి లోనుకావలసి వస్తున్నది. ఆఫ్రికా ఖండాన్ని, మధ్యప్రాచ్యాన్ని తన ఆర్థిక బలసంపత్తితో జయించడానికి అది ప్రయత్నిస్తున్నది కూడా.

నాజీ దండయాత్ర కారణంగా సోవియెట్ రష్యా అపార నష్టాలను పొందివుండవచ్చు. దాని పల్లె లెన్నో రూపుమాసి పోయినవి; పట్టణాలెన్నో అస్థిపంజరాలవలె మిగిలినవి; పారిశ్రామిక కేంద్రాలెన్నో శిథిలమై పోయినవి; దానిపంటలు, దాని పశువులు గట్టిదెబ్బ తిన్నవి. ఈ ఆస్తినష్టాన్నికూడా మించినట్టిది దాని జననష్టం. ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికలద్వారా అది నిర్మించుకున్న ఆర్థికసౌధం — పూర్తిగా కాకపోయినా - చాలావరకు కూలిపోయింది; ఆ ఆర్థిక సౌధంలో నివసించవలసిన కొత్తతరంవారిలో పెక్కుమంది దాని రక్షణకై ప్రాణ బలిదానాన్నిచేయవలసి వచ్చింది. అయితే, ఇంతగా సోవియెట్ రష్యా కష్ట నష్టాలకు పాల్పడినా, యుద్ధాత్పూర్వంకంటె నేడు దానిశక్తి అధికం; పరిహద్దులు అధికం; పలుకుబడి అధికం; ప్రాబల్యం అధికం. బాల్టిక్ రాజ్యాలు నేడు సోవియెట్‌లో అంతర్భాగాలు; ఫిన్లాండ్, రుమేనియాలనుంచి కొన్ని భూభాగాలు దానికి సంక్రమించాయి; మొత్తం తూర్పు యూరప్‌పై, కొంతవరకు దక్షిణ యూరప్‌పైకూడా, దాని పలుకుబడి హెచ్చింది; దాని సరిహద్దులను ఆనివున్న అన్ని యూరోపియన్ రాజ్యాలలో దానిపట్ల భక్తి ప్రేమలను

ప్రదర్శించగల ప్రభుత్వా లేర్పడినవి. నెపోలియన్, హిట్లర్ తమ మహోచ్ఛస్థితిలోకూడా సాధించివుండనంతటి ప్రాబల్యం నేడు సోవియెట్ రష్యాకు నిస్సందేహంగా కలదు.

కాగా, బ్రిటన్, ఫ్రాన్సులు యుద్ధాత్పూర్వపు పాటవంలో, ప్రాబల్యంలో శతాంశమైనా నేడు ప్రదర్శించక పోతున్నవి. ఫ్రాన్సు చరిత్రలో పెక్కు నిమ్నోన్నతాలు కానవస్తాయిగాని, బ్రిటన్‌మాత్రం గడిచిన నాలుగు శతాబ్దాలలో అవిచ్ఛిన్న శక్తినే ప్రదర్శించింది; సంపత్తినే అనుభవించింది; బలదర్పాలనే ప్రదర్శించింది. ఈ శక్తివల్లనే, ఈ సంపత్తివల్లనే, ఈ బలదర్పాలవల్లనే ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలోని ఒక ఘట్టంలో మహోద్ధతితో మున్న—చండ ప్రచండంగామున్న—హిట్లరుకు ప్రత్యర్థిగా బ్రిటన్ ఒంటిరిగా నిలబడగలిగింది. అయితే, ఈ పూనికతోనే—ఈ పరీక్షతోనే - బ్రిటన్ శక్తులన్నీ ఉడిగిపోయినట్టున్నాయి. యుద్ధానికిపూర్వం అది శ్రీమంతరాజ్యం; ప్రస్తుతం ఋణగ్రస్తరాజ్యం; యుద్ధానికిపూర్వం యూరప్‌లో దానిదే అగ్రస్థానం; నేడు ఆస్థానం సోవియెట్ రష్యాది; యుద్ధానికిపూర్వం ప్రపంచ సముద్రాధిపత్యం దానిదే; ఈనాడు అపాటవం యునైటెడ్‌స్టేట్సుది; యుద్ధానికి పూర్వం అంతర్జాతీయరంగంలో దాని కనుసైగలకోసం ఎదురుచూచేవారే ఇప్పుడు దాని మొత్తుకోళ్ళను సయితం పెడచెవిని పెడుతున్నారు.

ద్వితీయప్రపంచ మహాసంగ్రామంలో బ్రిటన్‌కంటె పదిరెట్లు ఫ్రాన్సు దెబ్బతినిందని చెబితేచాలు,—నేడు అదియెంత నీరసస్థితిలోకలదో తెలిసిపోతుంది.

పేరుకు గెలిచినా, నిజానికి యుద్ధంలో ఓడిపోయిన బ్రిటన్, ఫ్రాన్సులు తమ కొత్తస్థితికి—తమ నూతన ప్రతిపత్తికి - అనుగుణంగా తమను సరిదిద్దుకొనడానికి విశేషంగా ప్రయత్నిస్తున్నాయి. తమ పూర్వ ప్రాబల్యంగాని, ప్రతిభగాని, వైభవంగాని ఇక తాము సాధించలేమని వాటికి తెలుసు. కాని, ఒక్కసారిగా సామాన్యరాజ్యాలుగా—శక్తిహీన రాజ్యాలుగా—దిగజారిపోవడం నేటికి మహా కంటకంగా వున్నది. అందువల్ల ఆసలే కిందిమెట్టుమీదకాక, రెండు, మూడు పైమెట్లమీదనైనా నిలబడ్డానికి అవి పెనగులాడుతున్నాయి. ఈ పెనగులాటనే ఈనాడు మనం ఇండియాలో, బర్మాలో, ఇండోచైనాలో, ఈజిప్టులో, పాలస్తీనాలో చూస్తున్నాము.

* * *

ఇదివరలోవలె ఇక ఇండియాను తను పరిపాలించలేనని బ్రిటన్‌కు స్పష్టపడిపోయింది.

ఇరవైయేళ్ళనాడు ఒక బ్రిటిష్ టోరీ "మనం ఇండియాను కత్తితో జయించాము. కత్తితోనే పరిపాలించగలము" అని అన్నాడు. ఈ మాట అబద్ధం.

ఇండియాను బ్రిటిష్‌వారు కత్తితో జయించలేదు. వర్తకంకోసం వారిక్కడికి వచ్చారు. వర్తక సౌకర్యాలకోసం ఇక్కడి రాజులను, మహారాజులను, నవాబులను, పాదుషాలను ఆశ్రయించారు. "ఏలినవారు చిత్తగించాలి" అన్నారు; "దేవరవారు కటాక్షించాలి" అన్నారు; "ప్రభువులవారి సేవకులము" అన్నారు. "పాదుషావారికి గులాములము" అన్నారు. ఇంత వినయంతో వచ్చినవారికి ఈదేశపరిపాలకుల మౌఢ్యమేమి, ఈ దేశప్రజల ఔదాసీన్యమేమి ఈ దేశాన్ని జయించడానికి ఒక మహదవకాశంగా కనబడింది.

మొగల్‌సామ్రాజ్యం నామమాత్రావశిష్టంగా నిలిచిన రోజు లవి. పేరుకు మొగల్ పాదుషా సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నవారు కొందరు; ఆ లాంఛనాన్ని సయితం పాటించనివారు

కొందరు. ప్రాంతాని కొకరు చొప్పున పరగణా కొకరు చొప్పున పరిపాలన సాగిస్తున్న రోజులవి. ఈ పరిపాలకులలో ఒకరినిచూస్తే ఒకరికి ఈర్ష్య; ఒకరిపై ఒకరికి పగ. వారు ఒండొరులతో యుద్ధాన్నిచేయని సమయంలో భోగ లాలసత్వంతో పొద్దుపుచ్చుతుండేవారు. వీరు తమనుపెడుతున్న అష్టకష్టాల కారణంగా నాటి ప్రజాసామాన్యంతో ప్రభువు ఎవడైనా మనకు బాధలు తప్పనప్పుడు ప్రభువు ఎవడైతే మనకేమి అనే ఔదాసీన్యం పెచ్చుపెరిగి వున్నదికూడా.

అయితే, నాడు ఇట్టి పరిస్థితు లేర్పడడంలో వింతలేదు; విశేషంలేదు. ఒక మహా సామ్రాజ్యం శక్తివిహీనమైనప్పుడు, కేంద్రప్రభుత్వం బలహీనమై పోయినప్పుడు ఇట్టి పరిస్థితులు ఏదేశంలోనైనా, ఏకాలంలోనైనా ఏర్పడతాయి. ప్రపంచ చరిత్రను పరికిస్తే, ఏ సామ్రాజ్యంకూడా మూడు, నాలుగువందల సంవత్సరాలకు మించి అవిచ్ఛిన్నంగా నిలిచినట్టుకానరాదు; అవిచ్ఛిన్నంగా నిలిచినా, శక్తివంతంగా నిలిచినట్టు కానరాదు. మూడు, నాలుగువందల సంవత్సరాలే ఏ సామ్రాజ్యానికైనా ఆయుః పరిమాణమని భావిస్తే, మొగల్ సామ్రాజ్యం దాదాపు పూర్ణాయుర్దాయాన్ని అనుభవించిందనే చెప్పవచ్చు. ఆలంగీర్ పాదుషా అనంతరం అది వృద్ధాప్య చిహ్నాలను ప్రదర్శించ నారంభించింది. అట్టిసమయంలో రాజ్యాధికార వికేంద్రీకరణ జరగడమేమి, ప్రాంతానికొక పరిపాలకుడు తలయెత్తడమేమి, అశాంతి ప్రజ్వరిల్లడమేమి, అంతఃకలహాలు పెచ్చుపెరగడమేమి, దేశం అల్లకల్లోలమై పోవడమేమి సహజమే. కాని, విదేశాలజోక్యం లేకపోతే, ఒక శతాబ్దంలోపల ఈ అశాంతినుంచీ, ఈ అంతఃకలహాలనుంచీ, ఈ అల్లకల్లోలంనుంచీ ఒక నూతన సామ్రాజ్యం, ఒక కొత్త కేంద్రప్రభుత్వం అవతరించి తీరుతుంది. మొగల్ సామ్రాజ్యవిచ్ఛిత్తి తర్వాత దానిస్థానంలో అట్టి సామ్రాజ్యం మరొకటి, అట్టి కేంద్రప్రభుత్వం మరొకటి, మనదేశంలో కూడా రూపొంది వుండేదే; వాస్తవానికి అట్టిదాన్ని మహారాష్ట్రులు సృష్టించ నారంభించారు కూడా. కాని, ఇంతలోనే బ్రిటిష్‌వారు అతివినయంతో మనదేశంలో కాలుపెట్టారు. పరిపాలకుల మౌఢ్యాన్ని, ప్రజాసామాన్యం ఔదాసీన్యాన్ని వినియోగించుకుని, అతిసులభంగా తన సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నారు. సరిగా సమయానికి బ్రిటిష్‌వారు వచ్చినందువల్ల త్రాసుతోవచ్చినవారికి రాచదండం లభించిందిగాని, ఒక శతాబ్దం ముందువచ్చినా, ఒకశతాబ్దం వెనకవచ్చినా, వర్తకులుగా వచ్చినవారు వర్తకులుగా పోయేవారే!

భారతచరిత్రలో యుగసంధినిపోలిన సమయంలో ఆగమనమే కాకుండా మరికొన్ని పరిస్థితులుకూడా బ్రిటిష్‌వారికి అనుకూలించినవి. హానిబాల్, అలెగ్జాండర్, జూలియస్ సీజర్, జెంఘిస్‌ఖాన్, నెపోలియన్ మొదలైన సేనానులు విదేశాలలోనేమి, బాబర్, శివాజీ మొదలైనవారు మనదేశంలోనేమి తమ బలాలకు రెట్టింపు, మూడురెట్లు శత్రుబలాలపై విజయాలను సాధించారు. వారి ఈ విజయాలకు కారణం,—వారు అవలంబించిన పద్ధతులే. కొందరు తమ శత్రువులకు లేని ఆయుధాలను వినియోగించారు, కొందరు తమ శత్రువులకు లేని వాహనాలను వినియోగించారు; కొందరు తమ శత్రువులకున్న ఆయుధాలనే, వాహనాలనే కొత్తపద్ధతులపై ఉపయోగించారు; కొందరు కొత్తసైనిక శిక్షణపై, కొత్తసైనిక విధానాలపై ఆధారపడ్డారు. సైనికబలంలో లోపాన్ని వారు ఈపద్ధతులలో ఏదో ఒకదానిద్వారా, లేదా, వాటిలో కొన్నింటిద్వారా, తీర్చుకున్నారు. కొద్దిమంది బ్రిటిష్‌వారు—వారైనా సేనానులుగా పిలిపించుకొనడానికి అర్హతలేనివారు—విశాల భారతదేశాన్ని జయించడానికి వారు అవలంబించిన యూరోపియన్ సైనికశిక్షణపద్ధతులే, యూరోపియన్ యుద్ధవ్యూహ రచనావిధానాలే ముఖ్యంగా కారణం, చతురంగ బలాలపై ఆధారపడిన యుద్ధపద్ధతులు పాతబడి పోయినవని

మనదేశ పరిపాలకులలో పెక్కుమంది గుర్తించలేదు. గుర్తించిన కొద్దిమందీ కొత్త పద్ధతులను అనుసరించలేదు. అనుసరించిన కొద్దిమందీ యూరోపియన్ ఆఫీసర్లపై పూర్తిగా ఆధారపడినందున వారు నమ్మకద్రోహం చెయ్యడంలో నిస్సహాయులైనారు. మేజర్ బి. డి. వసు వ్రాసిన "ది రైజ్ ఆఫ్ ది క్రిస్టియన్ పవర్ ఇన్ ఇండియా" అనే చారిత్రక గ్రంథాన్ని చదివితే, బ్రిటిష్‌వారు భారతదేశాన్ని జయించడంలో సాధించిన ప్రతి విజయానికి భారతీయులపట్ల భారతీయుల భాతృద్రోహం కారణం కాకపోతే, భారతీయులు నమ్ముకున్న యూరోపియన్ ఆఫీసర్ల స్వామిద్రోహం కారణమని స్పష్టపడుతుంది. "మీరు క్రైస్తవులు; మేము క్రైస్తవులము. మాకు వ్యతిరేకంగా మీరు పోరాడతారా?" అనే ప్రచారంతో అనేక ముఖ్యయుద్ధాల సందర్భంలో బ్రిటిష్‌వారు ప్రచారంచేశారు. ఆప్రచారంతో భారతీయ పరిపాలకుల కొలువులోని యూరోపియన్ ఆఫీసర్లను తిరగదీసుకున్నారు. "మీదీ, మాదీ ఒకే క్రైస్తవమతంకాదా?" అనే ప్రచారం భారతదేశాన్ని జయించుకొనడంలో బ్రిటిష్‌వారికి ఇంతగా ఉపకరించినందువల్లనే మేజర్. బి. డి. వసు తన చారిత్రక గ్రంథానికి "భారతదేశంలో క్రైస్తవ రాజ్యసంస్థాపన" అని నామకరణంచేశాడు.

కొత్త యుద్ధపద్ధతులు, కొత్త స్వామిద్రోహ పద్ధతులుమాత్రమే కాకుండా మరొక ముఖ్య పరిస్థితికూడా బ్రిటిష్‌వారికి అనుకూలించింది. ఎక్కడో ఆరువేల మైళ్ళదూరంలోగల చిన్ని చిన్ని దీవులనుంచి బ్రిటిష్‌వారు వర్తకంకోసం ఇండియావరకు ఏవిధంగా రాగలిగారు? కేవలం వారి నౌకాయానపాటవంవల్లనేగదా ఇది సాధ్యమైంది? అయితే, తాముకూడా నౌకాదళాన్ని—యుద్ధనౌకలనేమి, వాణిజ్య నౌకలనేమి - ఎందుకు సమకూర్చుకొనగూడదు? ఈవిషయం ఒక మహారాష్ట్రులుతప్ప నాటి భారతదేశ పరిపాలకులలో ఎవ్వరు గుర్తించనేలేదు. మహారాష్ట్రులైనా ఈవిషయాన్ని గుర్తించేసరికే, కాలం మించిపోయింది; అప్పటి కప్పుడే బ్రిటిష్‌వారు మనదేశంలో బాగా పాతుకుపోయారు.

ఇలాగే మరొక విషయంలోకూడా నాటి భారతదేశ పరిపాలకులు హ్రస్వదృష్టినే ప్రదర్శించారు. బ్రిటిష్‌వారు పద్దెనిమిదవ శతాబ్దంలో మనదేశంలో కాలూనగలిగినా, పంధొమ్మిదవ శతాబ్దంలో వారు మరింత త్వరితంగా పాదుకుపోవడానికి యంత్రయుగం అవతరణే కారణం. స్టీమ్ యింజన్ కనిపెట్టడంతో యూరప్‌ఖండం మొత్తంపై ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థ ప్రాతిపదికలే మారిపోయినదనే విషయాన్ని గుర్తించగల విజ్ఞత మన వారికి లేకపోయింది.

అసలు బ్రిటిష్‌వారు మనదేశానికి చేరేసమయానికి మనదేశంలో కులాలు ఘనీభవించి, ఆచార వ్యవహారాల ప్రాబల్యం అత్యధికమైపోయి, మొత్తంజాతికే ఒక కొత్తభావాన్ని అర్థంచేసుకోగల, ఒక కొత్తఉద్యమాన్ని హర్షించగల శక్తి ఉడిగిపోయినట్లు కనబడుతుంది.

ఈ వివిధ మానసిక, నైతిక కారణాలను పురస్కరించుకుని, భారతీయ సైనికుల్ని వినియోగించుకుని, భారతీయ ధనాన్ని వ్యయపరచి బ్రిటన్ భారతదేశాన్ని జయించిందే గాని, తన కత్తిబలంతో కాదు.

కాగా, బ్రిటన్ భారతదేశాన్ని పరిపాలించడంకూడా కత్తిబలంవల్ల కానేకాదు. భారతీయుల మానసిక, నైతిక పతనాన్నే తమసామ్రాజ్య రక్షణకు సాధనంగా చేసుకొని, ఒకప్పుడు హిందువులపట్ల, మరొకప్పుడు మహ్మదీయులపట్ల, సర్వదా సంస్థానాధీశులపట్ల, పక్షపాతాన్ని చూపుతూ, భారతీయ సైనికదళాలతో, భారతీయ ప్రభుత్వోద్యోగులతో భారతదేశాన్ని వారు పరిపాలించ గలిగారు.

భారత రాజకీయరంగంలో గాంధీజీ ప్రవేశంతో భారతీయులు తమ నైతిక పతనాన్ని తాము తెలుసుకో గలిగారు. దానితో వారిలో దాస్యంపట్ల ఏహ్యాభావం రేకెత్తింది; స్వాతంత్ర్యం కోసం తృష్ణ ప్రబలింది. ఇటీవల ఈ పరివర్తనం పెక్కుమంది భారతసైనికులలో, నావికులలో, వైమానికులలో ఉద్యోగులలో ద్యోతకం కాసాగిందికూడా. అంచేతనే బ్రిటిష్ వారు ఈనాటికి తామిక వైదొలగక తప్పదని గుర్తించారు; ఇండియామంత్రి లార్డ్ పెథిక్ లారెన్స్ మొన్నను ప్రభువులసభలో ప్రసంగిస్తూ, "1949 జూన్ తర్వాత మనం భారత దేశంలో మన ప్రభుత్వ వ్యవస్థను ఇప్పటివలె నిలుపుకొనలేము" అని చెప్పవలసివచ్చింది; భారతజాతీయ విప్లవశక్తులను ఇక మనం ప్రతిఘటించలేమని ఒప్పుకొనవలసి వచ్చింది.

* * *


ఇక తాము భారతీయుల అభిమతానికి భిన్నంగా భారతీయులను పరిపాలించలేమని నిజానికి 1942 లోనే బ్రిటిష్‌వారు గుర్తించారు. అందువల్లనే నాడు క్రిప్స్ ప్రణాళిక సందర్భంలో భారతదేశం పూర్ణస్వాతంత్ర్యాధికారాన్ని, భారతజాతి స్వయంనిర్ణయాధికారాన్ని తాము గుర్తిస్తున్నామని ప్రకటించారు. ఈ క్రిప్స్ ప్రణాళిక భారతీయులను సంతృప్తి పరచనందున 1946 లో ఆ యుద్ధప్రణాళిక ప్రకటించబడింది. అది నెరవేరగల అవకాశం అంతగా కానరా నందున తిరిగి 1947 లో — మొన్ననే - 1948 జూన్‌లోపుగా భారతదేశంనుంచి బ్రిటన్ వైదొలగ నున్నదని అట్లీ ప్రధాని ప్రకటించవలసి వచ్చింది.

తన పరిపాలన ఇదివరకువలె ఇకమీదట కొనసాగబోదని తెలుసుకున్నప్పటికీ భారతదేశంపై తన ప్రాబల్యాన్ని - దానిపై తనకు పలుకుబడిని పూర్తిగా పోగొట్టుకొనడాని బ్రిటన్ సంసిద్ధ పడలేకున్నది. అందువల్లనే మొన్నచూపిన ప్రతిపాదలలో సయితం అది కొన్ని మెలికలు పెట్టింది.

"1948 జూన్‌లోగా వైదొలగిపోయే సందర్భంలో రాజ్యాధికారాన్ని ఎవరికి అప్పగించి వెళ్ళడం ?" అనే విషయంలో ఒక మెలిక వున్నది. సంస్థానాధీసుల విషయంలో మరొక మెలిక వుంది. ఈ రెండింటిని జాగ్రత్తగా పరిశీలించడం అవసరం.

1948 జూన్‌లోగా భారతీయులలో భారతీయులకు ఒక ఒడంబడిక కుదరనిపక్షంలో రాజ్యాధికారాన్ని ఏదో ఒక రూపంలో అప్పటికివుండగల కేంద్రప్రభుత్వానికి అప్పగించడమా, లేక, కొన్ని రాష్ట్రాలలో ఆ రాష్ట్రీయ ప్రభుత్వాలకుకూడా అప్పగించడమా అని ఆలోచించ వలసి వుంటుందని అట్లీ ప్రధాని ప్రకటించాడు. "కొన్నికొన్నిచోట్ల రాష్ట్రాలకు రాజ్యాధి కారాన్ని అప్పగిస్తా" మనడం పాకిస్థాన్ సంస్థాపనకు కొంత అవకాశాన్ని చూపించక పోవడంలేదు. పంజాబ్, సింధు, సరిహద్దు, బెంగాల్, అస్సాంరాష్ట్రాలు చేరగా, పాకిస్థాన్ ఏర్పడాలని ముస్లింలీగ్ అభిమతం.

రాష్ట్రీయ ప్రభుత్వాలకు రాజ్యాధికారాన్ని అప్పగించిపోవడమే సంభవిస్తే, ముస్లింలీగ్‌కు అది లభ్యమయ్యేది—పంజాబ్‌లోగాని, సరిహద్దురాష్ట్రంలోగాని, అస్సాములోగాని ప్రస్తుతం దాని మంత్రివర్గాలు లేనందున — కేవలం, సింధు, బెంగాల్ రాష్ట్రాలలోనే. పైగా, కొన్నిసందర్భాలలో రాజ్యాధికారాన్ని రాష్ట్రీయ ప్రభుత్వాలకు అప్పగించడమే కాకుండా, ఆయాప్రాంతాల యోగక్షేమాల రక్షణదృష్ట్యా వేరే ఏదైనా ఏర్పాటుచేయవలసి రావచ్చుననే సూచనకూడా ప్రధాని అట్లీప్రకటనలోకలదు. ఈసూచన అంతర్య మిది: బెంగాల్‌లో రాజ్యాధికారాన్ని ముస్లింలీగ్ ప్రభుత్వానికి అప్పగించవలసి వచ్చినా, హిందువులే అత్యధిక సంఖ్యాకులుగల పశ్చిమ బెంగాల్‌ను పోగొట్టడం అవసరంకావచ్చు, ఇదేవిధంగా ఒకవేళ పంజాబ్‌లోకూడా రాజ్యాధికారం ముస్లింలీగ్‌కే అప్పగించబడినా, శిఖులు, హిందువులు అత్యధిక సంఖ్యాకులుగాగల కొన్ని పరగణాలను దానినుంచి పోగొట్టవలసిన అగత్యం



రావచ్చు. అంచేత ఏవిధంగాచూచినా ముస్లింలీగ్ కోరుతున్న పాకిస్థాను ముస్లింలీగ్ కోరుతున్న రూపంలోగాని, విస్తృతిలోగాని ఏర్పడబోదు. ఈమేరకు అమాత్యప్రణాళికంటె అట్లీప్రకటన ఉత్తమమైనదే. అయితే, ఏదో ఒకవిధంగా పంజాబ్, సరిహద్దు రాష్ట్రాలలోని ప్రస్తుత ప్రభుత్వాలను తొలగించి, 1948 జూన్‌లోగా తామే అధికారంలోకి రాగలిగితే, ఆరెండు రాష్ట్రాలను సింధు, బెంగాల్ రాష్ట్రాలలో కలుపుకుని పాకిస్థాన్ స్వతంత్రరాజ్య పంస్థాపనను సాధించవచ్చుననే ఆశను ముస్లింలీగ్‌లో రేకెత్తించే అవకాశం సయితం అట్లీ ప్రకటనలో లేకపోలేదు. ఈ అనుమానాన్ని పంజాబ్, సరిహద్దురాష్ట్రాలలో ముస్లింలీగ్ ప్రస్తుతం కొనసాగిస్తున్న ఆందోళన బలపరస్తున్నదికూడా.

ఇండియా విభజనకు అవకాశమిచ్చే మేరకు అట్లీప్రకటన నిరసించదగిందే. అయితే, తాను ఎంతకాలం కాంగ్రెసుతో రాజీకిరాకుండావుంటుందో, అంతకాలం తమకు ఒక అండగా బ్రిటన్ ఇండియాలో నిలవగలదనే నమ్మకాన్ని అప్రకటన తొలగిస్తున్నందున, లీగ్ తన ప్రస్తుతపు కొరకరాని కొయ్యధోరణిని మార్చుకొనగలదనే ఆశకూడా లేకపోలేదు. ఢిల్లీ అసెంబ్లీలో 1947–48 వ సంవత్సరపు బడ్జెట్టును ప్రవేశపెడుతూ ఉపోద్ఘాతంగా మిష్టర్ లియాకత్ అలీఖాన్ పలికిన పలుకులలో ద్యోతకమౌతున్న భావాలను ముస్లింలీగ్ ప్రస్తుత మనఃప్రవృత్తికి తార్కాణాలుగా యెంచుకొనవచ్చునంటే, మనదేశ భవితవ్యం విషయమై కాంగ్రెస్ ముస్లింలీగులకు ఒక ఒడంబడిక అసాధ్యం కాకపోవచ్చు.

ఇదివరలో హిందువులపై మహమ్మదీయులను, మహమ్మదీయులపై హిందువులను వురికొల్పి, భారతజాతిని శక్తివిహీనంగా చెయ్యడమే బ్రిటన్ లక్ష్యంగా వుండి వున్నప్పటికీ, ఇప్పుడు స్వార్థాన్నికోరే అది భిన్నలక్ష్యాన్ని పెట్టుకుంటున్నదేమోనని ఆశించడానికి కొన్ని తార్కాణాలు కానవస్తున్నాయికూడా.

అటు యునైటెడ్‌స్టేట్సు ఆర్థిక ప్రాబల్యాన్ని, ఇటు సోవియెట్ రష్యా రాజకీయతత్వ ప్రాబల్యాన్ని చూడగా, శక్తివంతమైన భారతదేశం తనతో మైత్రినెరపినప్పుడే తాను ప్రపంచంలో నిలబడగలనని బ్రిటన్ భావిస్తున్నట్టుంది. నిజానికి బ్రిటిష్ విదేశాంగమంత్రి మిస్టర్ బెవిన్ ఈవిషయాన్ని ఈమధ్య లండన్‌లో మిస్టర్ అసఫాలీ గౌరవార్థం (ఆయన ఇండియా రాయబారిగా యునైటెడ్‌స్టేట్సుకు పోతున్నసందర్భంలో, జరిగిన విందులో బయటపెట్టాడు కూడా. దీన్నిబట్టి ఇండియా విభజన బ్రిటన్‌కు నేడు అంతగా మనస్కరించదేమోననీ అనుకోవచ్చునేమో?

అయితే, భావిప్రపంచంలో తన ప్రతిపత్తి రక్షణకే భారతదేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించి, దానిస్నేహాన్ని సంపాదించడం బ్రిటన్ ఆశయమైతే, రష్యా, అమెరికాలకు విరుద్ధమైన విధానలలోకి అవసరమైతే ఇండియాను ఈడ్వటానికి ఇండో - బ్రిటిష్ సంధిలో ఏ సైనిక, నావిక, వైమానిక దళాలకు సంబంధించిన షరతులలోనో కొంత అవకాశం పెట్టుకొనడానికి అది (బ్రిటన్) ప్రయత్నిస్తుంది. ఈ ప్రమాదం తొలగడమేమి, ఇండియా నామమాత్రంగా కాకుండా, నిజంగా పూర్ణస్వతంత్రరాజ్యం కావడమేమి, భారతీయులు అట్లీ ప్రకటన కల్పిస్తున్న మహదవకాశాన్ని పురస్కరించుకొని, తమ విభేదాలను సమయింపచేసుకొని సమైక్యతను ప్రదర్శించగలిగినప్పుడే.

కాగా, ప్రధాని అట్లీ ప్రకటన స్వదేశ సంస్థానాలు కోరితే ఒక్కొక్కటి ఒక్కొక స్వతంత్ర రాజ్యం కాగల అవకాశాన్ని చూపిస్తున్నది. ఈ వీలునుచూసుకొని అప్పుడే ఒక హైదరాబాద్ ముస్లిం రాజకీయవేత్త నిజాం స్వతంత్రరాజ్యం కాగలదని ప్రకటించాడుకూడా! స్వదేశ సంస్థానాలలో తాము యథాప్రకారం కాలూని నిలవడంద్వారా ఇండియాపై తమ పలుకుబడి నిలుపుకొనడమే బ్రిటన్ ఉద్దేశమైతే, భారతప్రజలు దాన్ని విఫలంచేయవలసి వున్నదికూడా.

* * *

ఇండియాలోవలెనే పాలస్తీనాలోనేమి, ఈజిప్టులోనేమి తన పెత్తనం ఇక సాగబోదని తెలిసినందునే, ఆదేశాల సమస్యలనుకూడా ఏదో ఒకవిధంగా పరిష్కరించాలని బ్రిటన్ ప్రస్తుతం తాపత్రయపడుతున్నది. ఆదేశాలతో తనకిక నిమిత్తంలేదనుకుంటే, అవి తమదారి తాము పోవచ్చుననుకుంటే, వాటిసమస్యల పరిష్కారం సులభమే. కాని, తన అధికారాన్ని నిలుపుకోవాలని – అదేసమయంలో దాన్ని కాపాడుకోలేనిస్థితిలో బ్రిటన్ పడినందువల్లనే ఏసమస్యా పరిష్కారం కావడంలేదు. పాలస్తీనా, ఈజిప్టు సమస్యలు త్వరలో మిత్రరాజ్య సమితిలో చర్చకు రాబోతున్నది. ఇండియా సమస్యకూడా బ్రిటన్ తగు విజ్ఞతను ప్రదర్శించలేకపోతే, మిత్రరాజ్యసమితికి పోవచ్చు.

* * *

కాగా, ఫ్రాన్సు ఇండోచైనాలో తన పశుబలాన్ని ప్రయోగించి, రక్తస్రవంతుల్ని ప్రవహింపజేసి, తన అధికారాన్ని కొంతవరకైనా కాపాడుకోడానికి ప్రయత్నంచేస్తున్నది. ఈప్రయత్నం నేడు ఒకవేళ కొనసాగితే, శేషు స్వతంత్ర ప్రాచ్యజాతి ఇంతకింతగా ఇంపీరియలిస్ట్ ఫ్రాన్సుపై కక్షసాధించి, బుద్ధిచెప్పకపోదు.




# కనపడేవీ, కనపడనివీ

Heard melodies are sweet, unheard melodies are sweeter అన్నాడు కవి.

కనపడేవి ఎవడైనా చూస్తాడు. రసజ్ఞులూ, భావుకులూ, జిజ్ఞాసువులూ మొదలైనవాళ్ళు కనపడని వాటి కోసం అన్వేషిస్తారు. అదృష్టవంతులు చూస్తారు కూడానూ. కాని కనిపించగానే వాటిలో విలవ తగ్గిపోతుంది.

ఏడెనిమిదేళ్ళ పిల్ల నాలుగైదేళ్ళ తమ్ముడికి సముద్రం గురించి ఎంతో గొప్పగా చెప్పి ఓ నాడు బీచికి పట్టుకుపోయిందిట. సముద్రం చూపించి, “చూశావా, ఎంత అందంగా ఉందో? నే చెప్పలా?” అందిట. పిల్లవాడు సముద్రంకేసి చూసి, “బాగా ఉంది,” అని ఒప్పుకుని, అనుమానిస్తూ, “ఇదేనా సముద్రం?” అని అడిగాట్ట. తీరా కనిపించిన తరవాత ఏదైనా ఇట్లాగే ఉంటుంది.

పొరుగింటి పుల్లకూర రుచి అన్నారేగాని, నిజంగా ఆ రుచి మనం నోట పెట్టుకునే వరకే.

నాకొక పత్రికా సంపాదక స్నేహితుడున్నాడు. మంచి రాతగాళ్ళంతా ఇతర ప్రతికలకు రాస్తూంటారనీ, తనపత్రికకు రాసేవాళ్లు కూడా మంచి వ్యాసాలన్నీ ఇతర పత్రికలకు పంపి తుక్కువి తనకు పంపుతూంటారనీ భ్రమపడుతూ ఉంటాడు. “పోటీ బహుమానాలు పెడితే మంచి రచనలు వస్తాయేమో అని ఆశగా ఉంది,” అన్నాడాయన. “మంచి వ్యాసానికి వెయ్యి రూపాయ లివ్వటానికైనా నా కభ్యంతరంలేదు. వ్యాసాలను అయిదు తరగతులుగా విభజించి వెయ్యి రూపాయలు మొదలు పదిరూపాయల వరకూ బహుమానా లేర్పాటు చేద్దామని ఉంది. మీ సలహా ఏమిటి” అని అడిగాడు. “అయ్యా, మీరు విప్పి చూసుకోగానే ఏ వ్యాసమయినా పది రూపాయల వ్యాసమే అయిపోతుంది,” అన్నాను.

ఆయనకు నా మీద కోపంవచ్చింది. తన పత్రికకు చచ్చువ్యాసాలుతప్ప రావంటున్నానని ఆగ్రహించాడు. నన్ను నలుగురూ అపార్థం చేసుకుంటూ ఉండటం రివాజు. రాయని విషయాలు చదవటమూ, పుస్తకంలో లేని సంగతులను పట్టుకుని విమర్శల్లో ఏకిపారెయ్యటమూ జరుగుతున్నది. ఈ గతి నా రచనలకే పట్టిందని అనలేను. ఎందుచేతనంటే దేశంనిండా భావుకులూవాళ్ళూ జాస్తిగా ఉంటున్నారు.

“మీరు నన్ను మరోవిధంగా అర్థం చేసుకోకండి. మీకు మంచి రచనలు రావటం వస్తాయి కాని, తీరా చేతికి వచ్చినతరవాత అవి



"ఇవ్వాళ నేను చాలా ముఖ్య మిత్రుణ్ణి పోగొట్టుకున్నాను."

"ఎలాగోయ్ ! చనిపోయాడా ఏమిటీ ?"

"చచ్చిపోలేదు, పదిరూపాయలు చేబదులు తీసుకు పోయాడు !"

మంచివిగా కనిపించటమంటూ ఉండదు," అంటూ పానకాలుగారి సంగతి చెప్పాను.

మా పానకాలుగార్ని మీ రెరగరు. ఆయన కూతురికి పెళ్ళి చేశాడు. కనీసం గట్టి ప్రయత్నం చేశాడు. ఏదో నెలకింత తెచ్చుకుంటున్న ప్రాణికావటంచేతా, ఆడపిల్లల పెళ్ళిళ్ళకోసం హైరానపడేవాళ్ళని చూసి నవ్వినవాడు కావటంచేతా పిల్లకి మంచి సంబంధం తేవాలని తీర్మానించుకున్నాడు. కొన్ని మంచి సంబంధాలే వచ్చాయికూడానూ. కాని మా పానకాలు ఒక్కటే లెఖ్ఖపెట్టుకున్నాడు : 'పిల్లాడి తరఫువాళ్ళు మా కిష్టమే నన్నారా, అది మంచి సంబంధం కాదన్నమాటే !'

ఈ కథ చెప్పి సంపాదక మహాశయుడితో నే నన్నాను గదా, "అయ్యా మీరు భావుకులూ అవును, రసజ్ఞులూ అవును; కాని, భావుకత్వంతోనూ, రసజ్ఞత్వంతోనూ ఒక్కొక్కసారి ఇటువంటి చిక్కులు రాకతప్పవూ," అన్నాను.

"అయితే మీ తాత్పర్యం వచ్చినదల్లా కళ్ళ కద్దుకు వెయ్యాలనా ?" అని సంపాదక స్నేహితు డడిగాడు.

నిజానికి నా తాత్పర్యం అది కూడా కాదు. కనపడని వాటిని అన్వేషించటంలోనే కాక ఇతరులు చూడలేనివి మనం చూడగలగటంలో కూడా చాలా ఆనందం ఉంది. రాజుగారి సన్నబట్టల కథ తెలుసుగదా అన్నాను.


"నాకు పని తీరికలేక చదవలేదు. ఏమిటా కథ ? ఎవరు రాశారు ? చూశారా మంచి కథలన్నీ ఇతర పత్రికల్లో పడిపోతూంటాయి... ఏమిటా కథ ?" అన్నాడు సంపాదక మహాశయుడు.

"ఇది పాతకథలెండి. వెనకటి కో రాజాగారు సాలెవాళ్ళని పిలిచి చాలా సన్నని బట్టలు నేయమన్నారుట. సాలెలు ఎంత సన్నని బట్టలు నేసినా, రాజుగారు తృప్తిపడక ఇంకా సన్నని బట్టలు కావాలన్నారుట. సాలెలు ప్రాణం విసిగి మగ్గాలమీద ఉత్తుత్త బట్టలు నేసి వాటిని పట్టుకొచ్చి రాజుగారికిస్తే, రాజుగారు తృప్తిపడ్డవారై ఆ ఉత్తుత్త బట్టలు కట్టుకుని ఊరేగవచ్చారుట. రాజుగారిని చూసి ప్రజలంతా పరిపరి విధాల అనుకోసాగారుట. అప్పుడు రాజుగారికి కోపంవచ్చి, తను కట్టుకున్నవి బట్టలు కావన్న వారినీ, ఈ బట్టలను విమర్శిస్తూ మాట్లాడుకున్న వారినీ కొరత వేయిస్తానని శాసనం చేశాట్ట....అట్లాగే మీరు కూడా మీకు వచ్చే వ్యాసాల్లో ఇతరులు చూడలేని ప్రతిభ ఏదన్నా చూడగలిగితే దానితో తృప్తిపడి ఆనందించవచ్చు" అని సలహా చెప్పాను.

"మీకు 32 ఏళ్లు వచ్చేదాకా వివాహ యోగం ఉన్నట్టు కనపడదు."

"ఈ లోపు ఎలాగూ వీలు పడదా ?"

"అసంభవమేగాని, లేకపోలేదు. మీకు మళ్ళీ పద్దెనిమిదో ఏటికి పో గలిగితే ఒక యోగమున్నది."



సంపాదక మహాశయుడు గడుసువాడు కాడు. అమూల్యమైన ఈ నా సలహా విని, "ఈ వ్యాసాల్లో ఏముందని ఎవరన్నా అడిగితే ఏం చెప్పను" అని నన్ను ప్రశ్నించాడు.

దానికి నేను మా బుజ్జయ్యను గురించి చెప్పాను.

బుజ్జయ్యే జిజ్ఞాసువూ, భావుకుడూ, రసికుడూనూ. అంటే, కనపడని దాని కోసం అన్వేషించటమేకాక, ఇంచుమించు లేనిది కూడా చూడగలడు. కాని వాడికి కనిపిస్తున్నప్పుడు లేనిదని ఎట్లా అంటాం గనకా ?

ఈ మధ్య ఓ రోజున బుజ్జయ్య నన్ను కలుసుకుని, "చూశావుటోయ్, మన కార్తీకం ఎంతపని చేసాడో?" అన్నాడు. ఏం చేశాడేమిటన్నాను.

"పరేలే. నన్ను పట్టుకుని నా మీద నానా చండాలమూ రాశాడు. అదేదో పత్రికలో అదేమిటో కథ రాశాడే దాన్లో!" అన్నాడు బుజ్జయ్య.

"అదేమిటి? ఆ కథ నే చదివానే.అందులో నీ సంబంధ మేముంది? ఆ కథ అసలు మొపాసా అనే ఫ్రెంచికథకుడిది. దాన్ని మక్కీకి మక్కీగా తర్జుమాచేసి తనపే రేసుకున్నాడు. అంతే," అన్నాను.

"అదే వాడి తెలివితేటలు. ఇంకోరి కథను తీసుకుని తర్జుమా చేసేస్తే నా మీద రాసినట్టు కనుక్కోలేరు గదా అని వాడి నమ్మకం. నేను అవలిస్తే పేగులు లెక్కపెడతానని వాడికేంతెలుసూ ?" అన్నాడు బుజ్జయ్య.

ఈ విషయం చెప్పి. "మీరు బుజ్జయ్య పద్ధతి అవలంభించండి. మీరు వేసే వ్యాసాలలో ఏమున్నదీ అందరికీ రుజువు చెయ్యకండి. ఎందుకూ ? అనవసరం," అన్నాను.

ఇంతా విని సంపాదక మహాశయుడు, "లేదులెండి. బహుమానాలు పెట్టితీరాలి. అట్లా అయితేనేగాని మంచి వ్యాసాలురావు. డబ్బుచూపిస్తే కొండమీది కోతి దిగివస్తుంది," అన్నాడు.

"వెయ్యేసి రూపాయ లిచ్చేస్తారా ఏమిటి?" అన్నాను.

"వెయ్యేసి రూపాయ లివ్వటానికి మొదటి తరగతి ఉత్తమ రచనలు మన దేశంలో ఉన్నాయా ఏమిటి ?" అన్నాడు నా స్నేహితుడు. "అన్నీ అయిదోరకం రచనలే. దేనికి పదిరూపాయల కంటె ఇవ్వను."

"ఇదేమిటి ? అన్యాయం ! అధమం నాలుగోతరగతి రచనలు కూడా లేవంటారా ? లేవని ఎట్లా రుజువు చేస్తారూ ?" అన్నాను.

"నేను పదిరూపాయలకంటె ఇవ్వనే?" అన్నాడాయన.

దాన్ని బట్టి దేశంలో అయిదో తరగతి రచనలు తప్ప లేవని తెలిసిపోతుందన్నమాట! మొత్తానికి మా సంపాదక స్నేహితుడు నాకు ఒక్కక్షణంలో కనపడని దాన్ని చూపించాడు. అందుకు నే నాయనకు ధన్యవాదా లర్పించి సెలవు పుచ్చుకున్నాను.

---



ప్రజాప్రతినిధుల విశ్వాసాన్ని కోల్పోయిన

ఆంధ్రకేసరి!

## కబుర్లు

క. స.

మనరాష్ట్రపు రాజకీయాలు చాలా అసహ్యంగా పరిణమించాయి.

ప్రధాని ప్రకాశంగారిలో తమకు విశ్వాసంలేదని కొంతమంది (కాంగ్రెసుపార్టీకిచెందిన అధిక సంఖ్యాకులు) ఎం. ఎల్. ఏ. లు నోటీసు యిచ్చారు. ఆ నోటీసు ఫిబ్రవరి 28 తేదిన జరిగిన సభలో ప్రవేశపెట్టగా, దానిని చర్చించడానికి వీలులేదని ప్రకాశంగారు తోసివేశారు. ప్రతికూల పక్షానికిచెందిన సభ్యులు, 134 మంది వేరే సమావేశమై ఓ. పి. రామస్వామిరెడ్డియార్‌ను నాయకుడుగా ఎన్నుకొని, రాష్ట్రానికి మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయడంలో తమ సలహా యివ్వవలసిందిగా, కాంగ్రెసు హైకమాండునికోరారు.

ఇలాటి విషమస్థితి, అసహ్యమైన సంఘటన మరేరాష్ట్రంలోను కలుగలేదు. ఇది మన రాష్ట్రానికి తలవంపులు తెచ్చేసంఘటన.

మనరాష్ట్రంలో మంత్రివర్గం ఏర్పడినప్పటి మంచి వ్యవహారం కలతలుగానే వుంది. అసలు మంత్రివర్గం ఏర్పడడమే, తగాదాలను మూటకట్టుకుని మరీ ఏర్పడింది. తరువాత, ఏ మూడునాలుగు నెలలో తగాదాలు పైకి వినబడలేదు గాని, క్రమేపీ మంత్రివర్గానికి ప్రతికూల పక్షం ఎక్కువైంది.

ఈ ప్రతికూలపక్షం బలపడుతూ వున్నప్పుడే, ప్రకాశంగారు సరిగా పరిశీలించి, కారణాలను కనుక్కొని, అన్ని వర్గాలనూ కూడతీసుకు రావడానికి ప్రయత్నించవలసింది. కాని అలా చేసినట్లు కనపడదు.

అసలు, ప్రకాశం మంత్రివర్గానికి వచ్చిన ప్రతిఘటనకు కారణాలు ఏమిటో చూద్దాము.

అరవలకు, ఆంధ్రుని ప్రధాన మంత్రిత్వం అంగీకృతం కాకపోవడం;

కేవలం పదవిని ఆశించిన ఆంధ్రులను కొందరిని, అరవలను కొందరిని ప్రకాశం గారు తమతో కలుపుకోవడం.

ప్రపంచమంతా పారిశ్రామికంగా, ఆర్థికంగా ముందడుగు వేస్తూవుంటే, రాజకీయంగా ఎప్పుడో ఒక ఎత్తుకింద అవలంబించిన విధానాలను, ప్రజల అభిమతానికి విరుద్ధంగా అమలులో పెట్టడానికి ప్రకాశం గారు ప్రయత్నించడం.

రాష్ట్రంలో ఖర్చులుతగ్గించి, పరిపాలన బాగా సమర్థంగా జరిగేటట్టు చూడడానికి బదులు, పరిమితిలేకుండా కొత్తవుద్యోగాలు సృష్టించి, ఆశ్రితులకు, అభిమానులకు ఉద్యోగాలను, వ్యాపకాలను కల్పించడంలో మంత్రివర్గం ఏమాత్రం సంకోచించకపోవడం.

చెన్నపట్టణంలో వుండి, న్యాయంగా నిష్పక్షపాతంగా మంత్రుల చర్యలను చూసిన వారికి, వారినిగురించి విన్నవారికి ఏమనిపించిందంటే, 'ఏదో అవకాశం దొరికింది, మంత్రులమయాం. మళ్ళీ యిలాటి అవకాశం వస్తుందో, రాదో! మా పదవి తీరేటప్పటికి ప్రపంచం వుంటుందో, వూడుతుందో! కాబట్టి యీ మంత్రిత్వం వున్న కొద్ది కాలంలోనూ వీలైనంతగా అనుభవిద్దాం' అని మంత్రులంతా, ఒకదీక్ష పట్టుకొన్నట్లు అనిపించింది.

న్యాయానికి, ప్రజాప్రభుత్వం అంటే అలాటి అభిప్రాయం ప్రజలకు కలిగించకుండా వుండవలసింది. అందులోనూ, దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలుచేసిన మహనీయుల పొత్తుగల కాంగ్రెసు పరిపాలన అంటే, కేవలం మహనీయ ప్రభుత్వంగా వుండవలసింది.

కాని, ప్రజలకు అలాటి భావం గలుగలేదు. ప్రజలు, అంతే న్యాయంగా ఏ వృత్తి

మీదనో ఆధారపడి జీవించే ప్రజలు, కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడినందువల్ల, మాకు యీ బాధ తొలగింది అని సంతోషించడానికి ఒక్క అవకాశముకూడా మంత్రివర్గం చూపించలేకపోయింది. [మామూలు రైతులకు అంతకన్నా చూపలేకపోయింది. సం॥]

ఏ వస్తువుకీ ధరలు తగ్గలేదు. బ్లాక్‌మార్కెటింగు అయిపోయింది.

బట్టకరువు తగ్గలేదు సరికదా. మరికొంత ఎక్కువైంది. ఇళ్ళు దొరకడమేలేదు సరిగదా, వున్న అద్దెయిళ్ళవాళ్ళుకూడా అద్దెలు ఎక్కువ యిచ్చుకోవలసిరావడమో, లేక ఖాళీచెయ్యడమో తప్పనిసరి అయింది.

ఇలాంటి పరిస్థితిలో, కాంగ్రెసుప్రభుత్వం నెలకొన్నదనిగాని, ప్రజలకు అభిమానపాత్రుడైన నాయకుడు ప్రధానిగా వున్నాడనిగాని ఆనందించడానికి ప్రజలకు ఏమీ అవకాశం లేకపోయింది.

ప్రజలమాట ఇలావుండగా, శాసనసభ్యులలోని కాంగ్రెసువారి పంథావేరైంది.

ఏ వుద్దేశంతో ప్రస్తుతపు మంత్రివర్గం, పదవులను అంటిబెట్టుకొని వుందని, మిగతా సభ్యులు అనుకుంటున్నారో, ఆ వాంఛలే తమకూ తీరాలని, వారూ కోరివుండాలి. లేకపోయినట్లయితే, ప్రకాశం మంత్రివర్గాన్నే పడగొట్టవలసిన అవసరం వారికి ఏముంది? ప్రకాశంగారి విధానం ఏదైనా తమకు నచ్చనప్పుడు, పార్టీ మీటింగులో దాన్ని చర్చకు తెచ్చి, అధిక సంఖ్యాకులు దానికి ప్రతికూలతను కనపరిస్తే, ఆ విధానాన్ని ప్రకాశంగారు అమలు జరుపగలరా? [టెక్స్టయిలు పాలసీని అమలుపరచటం లేదా?' సం॥]

ఇప్పుడు ప్రకాశంగారికి ప్రతికూల పక్షం వహించిన ఎం. ఎల్. ఏ లకు కావలసింది అదికాదు. అసలు అధికారమే తమ చేతిలోకి రావాలి.

పరిపాలన సాగిస్తున్న మంత్రులకు పదవులకు అంటబెట్టుకొని వుండాలనే కాంక్ష ఎంత ఎక్కువగావుందో, వారికి ప్రతికూలత చూపిన వర్గానికీ, అదే కాంక్ష, అంత ఎక్కువగానూ వుందని పరిస్థితులే స్పష్టపరుస్తున్నాయి.

బ్రహ్మాండమైన ప్రాక్టీసు ఒదులుకొని, ముప్పయి సంవత్సరాలుగా ప్రజాసేవలో అనేక త్యాగాలుచేసి, అష్టకష్టాలుపడిన ప్రకాశంగారికికూడా పదవీ వ్యామోహం తప్పలేదు. [వీరిని ఆంధ్రులొక్కరే ఎన్నుకోలేదు. సం॥ ఆ॥] ఆయన చేసినత్యాగాల ముందర, ఈ ప్రధానిపదవి, నిజంగాచూస్తే ఒక లెక్కలోది కాదు. ఆ మాటను ఆయన మరిచిపోకుండా, "మీ యిష్టంవచ్చినవారికి కట్టబెట్టుకొండి" అని, ప్రధానిత్వానికి రాజీనామా పెట్టినట్లయితే, ప్రతికక్షులందరూ, తల యెత్తుకోడానికి వీలు లేకపోయేది. [అలా వీరుచేస్తే ఒరిస్సా ప్రధానమంత్రిలాగా సభ్యులే బతిమాలి ఉంచేవారు సం॥ ఆ॥] కాని, ఎంత ప్రతికూలతవున్నా ఎలాగైనా ప్రధానిత్వాన్ని నిలుపుకోవాలని ఆయన తంటాలు పడడం, ఆయన పట్ల గొప్పభక్తి, గౌరవాలు కలవారికి కష్టం కలిగిస్తున్నది.

పరిస్థితుల్నిబట్టి చూస్తే, యిప్పుడు కాంగ్రెసు పార్టీలో వున్నసభ్యుల ధోరణిని బట్టి చూస్తే, మదరాసు రాష్ట్రంలో, ఎవరు ప్రధానమంత్రి ఐనా, అడపాతడపా, యిప్పుడు

ప్రకాశంగారు ఎదుర్కొన్న పరిస్థితి ఎదుర్కోవలసి వుంటుంది.

ప్రకాశంగారు తమ మంత్రివర్గంలో స్థానాలు యిస్తామన్నప్పుడు వారితో కలసిన కొంతమంది, వారి ప్రతికక్షులతో కలిసి ప్రకాశంగారిని పడగొట్టడానికి ఎలా సంకోచించలేదో, రేపు మరొక వర్గంతో కలవడానికి అలాగే సంకోచించరు. అంచేత, పదవీవ్యామోహం గల పెద్దలకూటంగా పరిణమించిన, మనరాష్ట్రపు కాంగ్రెసుపార్టీ పుణ్యమా అని, స్థిరంగా ఒక సంవత్సరం అధికారంలో వుండే మంత్రిమండలి ఏర్పడే సూచనలు ఏమీ ఇప్పటి పరిస్థితినిబట్టి కనపడవు.

దీనివల్ల తమ అయిదేళ్ళ కాలపరిమితి తీరేటప్పటికి ప్రతి ఎం. ఎల్. ఏ. కూడా ఒక ఎక్స్ మినిస్టరుగానో, ఒక ఎక్స్ పార్లమెంటరీ సెక్రటరీగానో అవతరించడం తప్ప, తమను ఎన్నుకున్న ప్రజలకు గాని, తమ చర్యలమీద ఆధారపడిన దేశ భవిష్యత్తుకు గాని, ఏమైనా మేలుచేస్తారనే మాట కల్ల.

[మాకంత నిరాశ ఇంకా కలగలేదు. సం॥ అ॥]

దీని ఫలితం ఏమతువుంది? కాంగ్రెసు అంటే ప్రజలకు గల గౌరవం గాలిలో కలుస్తుంది. మళ్ళీ ఎన్నికలనాటికి, నేను కాంగ్రెసు తరపున నిల్చబడ్డానని ఒక్క వ్యక్తి కూడా ప్రజలను ఓటు అడుగలేదు. సిగ్గులేక అడిగినా, అతనికి ఏం జవాబు చెప్పాలో ప్రజలకు తెలుసు. [ఈ శాసనసభ్యులను ప్రజలు ఎన్నుకోలేదు. కాంగ్రెసు హైకమాండు ఎన్నుకుంది. ఆంధ్రరాష్ట్రి పార్లమెంటరీబోర్డు సిపారసుమాత్రం చేసింది. సం॥ అ॥]



'పాకిస్థానుకు తక్కువైతే
నేను తిరిగికూడా చూడను.'

ఎవడు తమ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తాడో ఆ నాయకుణ్ణి ఎన్నుకొనే జ్ఞానం ప్రజకు కలిగిననాడు, కాంగ్రెసు అభ్యర్థిని వారు ఎన్నుకోకపోతే నష్టం ఏమీలేదు. ప్రజాక్షేమం కోరేవాడూ, ప్రజలకోసం, తన స్వార్థాన్ని చంపుకొని పనిచేసేవాడూ కాంగ్రెసువాడే అయివుండాలని ఎక్కడా నియమం లేదు. మళ్ళీ ఎన్నికలలో కాంగ్రెసువారినే ప్రజలు ఎన్నుకోవాలనే నిర్బంధం ఏమీలేదు.

నిజానికి కాంగ్రెసు, ఆంధ్రులకు—అంటే ఆంధ్రజాతికి, ఆంధ్రదేశానికి, ఆంధ్ర నాయకులకు—ఒరిగించి పెట్టింది ఏమీలేదు. పైగా, కాంగ్రెసును అంటిపెట్టుకున్నందువల్ల కొన్ని విషయాలలో, ముఖ్యంగా రాష్ట్రసమస్యలోనూ, కేంద్ర సంస్థలలో ఆంధ్రులకు ప్రాతినిధ్యం

ఇవ్వడం విషయంలోనూ తీరని అపకారమే జరిగింది. కాంగ్రెసులోని పెద్దలు ఆంధ్రులని ఒకజాతిగా గాని, ఒక దేశంగా గాని పరిగణించనే లేదు.

వర్కింగుకమిటీ సభ్యత్వపు నియామకంలో, ఆంధ్రులను, అరవలను, మళయాళీలను కట్టకట్టి "మదరాసీ" లని తేల్చివేశాడు, కాంగ్రెసు అధ్యక్షుడు కృపలానీ. పదకొండు జిల్లాలు, దాదాపు మూడుకోట్లజనంగల మనకి, రాజగోపాలాచారిగారు ప్రతినిధి అయాడు.

[చాలాకాలంనించి మొన్న మొన్నటి వరకు పట్టాభిగా రొక్కరే మద్రాసు రాష్ట్రం తరపున కాంగ్రెసు వర్కింగుకమిటీలో ఉన్నసంగతి జ్ఞాపకం చేస్తున్నాను. సం॥ ఆ॥]

దేశంలోని భాషాభాగాలను తీసుకుంటే, అయిదుకోట్ల ముప్పయినాలుగు లక్షలమంది బెంగాలీలు, రెండుకోట్ల డెబ్బయిలక్షలమంది బీహారీల తరువాత, ఆంధ్రులే (రెండుకోట్ల అరవై లక్షలమంది) లెఖకువస్తారు. [ఇందులో ఎనభై లక్షలమంది ఆంధ్రులు నైజాములో ఉన్నారు. సం॥ ఆ॥] ఆంధ్రుల తరవాత మహారాష్ట్రులు (రెండుకోట్ల ఎనిమిది లక్షలు) వారితరువాత (రెండుకోట్ల నాలుగులక్షలు) అరవవారు వస్తారు. కాని, మనం అఖిల భారత రంగంలో, ఎవరికీ కనపడడంలేదు. కారణం?


మనలో మనకి పడకపోవడం! ఈసంగతి యివ్వాళ నేను కొత్తగా కనిపెట్టిందికాదు. అందరికీ తెలిసిందే. అందరూ చెప్పేదేకాని, ఒక్కరుకూడా యీ లోపాన్ని సవరించడానికీ, యీమచ్చను మాపడానికి ప్రయత్నం చెయ్యలేదు. అంతవరకూ, మనం ఎందునా పనికిరాకపోవడం జరుగుతూనే వుంటుంది.

[ఐకమత్యంగా అరవజాతిలేదు. పోతే మనం ఒకరికి ఉన్నదని ఏడుస్తాము. అరవరలు వారికి లేదని ఏడుస్తారు. ఇదే తేడా. సం॥ ఆ॥]

ప్రత్యేకంగా మనకొక రాష్ట్రం వచ్చిన నాడు మనపాట్లు ఎలా వుంటాయో గాని, యీనాడుమాత్రం రాష్ట్రీయ పరిపాలనా వ్యవహారాలతో, అరవలతో సహకారంచేసి, మన మేలుతోపాటు వారి మేలు చూస్తూ, వారి మేలుతో మనమేలు కలుపుతూ నడచుకొని తీరవలసిందే. [అరవలతో సహకారం చేయాలని ఏ తెలుగువాడైనా చెప్పితే వాడిని మాత్రం, ద్రోహిగా మన పత్రికలే ప్రచారంచేస్తాయిగా. సం॥ ఆ॥]

అంచేత ఆంధ్ర ఎం. ఎల్. ఏ. లంతా కలిసి, ప్రస్తుత పరిస్థితిని చర్చించి, స్థిరంగా నిలబడే మంత్రివర్గం ఏర్పాటయే మార్గాలను ఆలోచించి, అరవలతో చర్చించి, అనుకూల పద్ధతిలో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేస్తే రాష్ట్రానికీ, ప్రజలకూ మేలుకలుగుతుందిగాని, యీనాడు ప్రకాశం మంత్రివర్గాన్నీ, మరొకనాడు రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గాన్నీ, ఇంకొకనాడు ఇంకొకరి మంత్రివర్గాన్నీ పడగొడుతూ కూచుంటే, మనం ముందుకురాము. పరిపాలన సక్రమంగా జరుగదు. నెలజీతాలు తీసుకొని పనిచేసే ప్రభుత్వోద్యోగులు సరిగా పనిచెయ్యరు. రాష్ట్రాభివృద్ధికి జరుపవలసిన ఒక్కపనీ సాగదు.

దేశంగతి ఎలావుందో!



# వంచనాశిల్పము

ప్రొఫెసరు గిరిరావు

## ఘరానా వంచకులు

పాప మీబిచ్చగాండ్రి నింతతో వదలి పెట్టుదాము. వీళ్ళు పడేకష్టం అధికం, ఫలం అల్పమూనూ. తమ్ము అనుమానదృష్టితో చూచే ప్రపంచమునుండి ఒక కానిడబ్బు గుంజుకోవడంకోసం వీ రిన్ని వేషములు వేయవలసివస్తూ వుంది.

పెద్దపెద్ద లాట్లు కొట్టుకొని పోయేవాళ్ళ మీద ఎవళ్ళకూ అనుమానం ఉండదు. గొప్ప గొప్ప శ్రీమంతుల గుమ్మములలోపలి కీ బిచ్చగాండ్రకు ప్రవేశమే ఉండదు. వాకిట్లో నిలబడి కొంచం సేపు మొత్తుకొని, తమ మొర వినిపించుకొనేవారు లేక వెళ్ళిపోతారు. శ్రీమంతుల దగ్గర దోసెడు బియ్యం, రాగి డబ్బో సంపాదించటం కంటె, వందలూ, వేలూ సంపాదించటం సులభం. అక్కడ యాచ్నాదైన్యంకూడా అక్కరలేదు.

అయితే వందలూ, వేలూ పుచ్చుకోదగిన వేషం వుండాలి. లక్షలూ, కోట్లూ కొలది మూలధనంతో, జాయంటుస్టాకు కంపెనీలు, లిమిటెడు కంపెనీలు పెట్టుతామని షేర్ల కొరకు పత్రికల్లో ప్రకటనలుచేస్తే చాలును; అమెరికా మొదలగు దేశాల్లో కనకవర్షం కురుస్తుంది. ఆస్ట్రేలియాలో బంగారు గనులు త్రవ్వుతామనో, మెసపొటేమియాలో కిరసనాయిల్ తీస్తామనో బయలుదేరి, ప్రాస్పెక్టర్సు, ప్రకటించి, దానికి అట్టహాసం అంతా చేసి, పదిమంది పేరుగల డైరెక్టర్లను కూడగట్టి, ఒక సంవత్సరమో, రెండు సంవత్సరాలో నాటకం నడిపిస్తే, సులభంగా ఏ యైదారులక్షలో సంపాదించుకొని సుఖజీవనం చేయవచ్చు. అవి మన్నకంత ప్రస్తుతం కావు. మనదేశంలోకూడా కాగితపు మిల్లులు పెట్టుతామని - జనపనార ఫ్యాక్టరీలు పెట్టుతామని షేర్లువేయించి, వాటాదార్లను నష్టపరచి, షేర్లు స్వల్పధరలకు తామే కొనివేసి వ్యాపారం సాగించడం చూస్తున్నాము. వీరిని వంచకులక్రింద జమకట్టడానికి వీలులేదు. అదియంతా వ్యాపారసరళి. దాన్ని పోనివ్వండి.

ఏ విషయములోనైనా విప్రస్వాములకు అగ్రతాంబూల మిచ్చితీరవలసిందే మన దేశంలో. కాబట్టి మొదట వారిసంగతే మనవి చేస్తాను. వెనుకటికి ఏ సోమయాజులుగారో, తాము అప్రతిగృహీతలైనప్పటికీ, లోకసంగ్రహార్థము ఆస్తికమహాజనుల సహాయమంగీకరించి యజ్ఞంచేసి ఉంటారు. లేదా, ఏ సుబ్బదాసుగారో, బాలాంబగారో, యాత్రికుల సౌకర్యార్థం చందాలు వసూలుచేసి, సత్రములు పెట్టారు. వీరిని చూచి అనేకమంది కుండలాలు తగిలించుకొని. యజ్ఞానికి చందాలు వసూలుచేస్తారు. సప్తాహాలు చేస్తామని, బియ్యం, పప్పు, నెయ్యి వసూలు చేస్తారు. ఎవరైనా తినేవేకాని పారపోసేవి కావుకదా యివ్వి. ఏ సొమ్మైనా బ్రాహ్మణకుక్షిలో పడితే చరితార్థత కలుగుతుంది. ఈ


చందాలు వార్షికాలై జాబితాలూ, కవిలి కట్టలూ పుట్టి, యేటేటా వస్తూనేవుంటవి. ఏజంట్లువచ్చి వసూలు చేసు కు పో తూ వుంటారు.

షాహుకారు ఎన్ని దివాలాలుతీస్తే అంత భాగ్యవంతుడవుతాడని చెప్పుకుంటారు. ఆలాగే సోమయాజులుగారు ఎన్ని యజ్ఞాలు చేస్తే అంత సంపన్నులవుతారని పాపభీతి లేని జనులు చెప్పుకుంటారు. ఈ మాటలకేమి గానీండి, అందరూ ఇంగ్లీషు చదువుకొని, ప్లీడరీయనీ, డాక్టరీయనీ, ఉద్యోగాలనీ, లంచాలనీ, ముడుపులనీ, సప్లయిలనీ, చివరికి స్కూలు మాస్టరీలోకూడా, అర్థనోపాయాలు అనేకవిధాలుగా ఏర్పరుచుకొంటూవున్న యీ కాలములో కూడా, వేదశాస్త్రవిశ్వాసం కలిగి, కర్మలయందు ప్రీతిగలిగియున్న సనాతనాచారులు బ్రతకడమేలాగో చెప్పండి మఱి! వారి నే విధంగానైనా సంఘం పోషించవలసిందేగా! 'బ్రాహ్మలు ఉద్యోగాల జోలికి పోకుండా ముక్కుమూసుకుంటే మేము గౌరవించమూ ?' అంటారు అబ్రాహ్మలు. ముక్కుమూసుకుంటే మూడు ఘడియలట, ఆనక వీరు గౌరవా లెవరికిచేస్తారు ?

నాడూ, నేడూ, అన్నిటికీ బ్రాహ్మణులదే గురుపీఠం. వీరిని చూచి అబ్రాహ్మణులు కూడా సత్రాలు పెట్టించడం, దేవాలయాలు కట్టించడం మొదలు పెట్టారు. బ్రాహ్మణులూ, కోమట్లూ తప్ప తక్కినవారు బ్రాహ్మణులకు చందాలు ఇవ్వడం మానివేశారు. 'పనిపాటలు లేకుండా బ్రాహ్మణులు సోమరిపోతులై పరాన్నభోక్తలైనారు. వీరికి సంభావన లివ్వగూడదు సరిగదా, ముష్టికూడా పెట్టగూడదు' అనే భావం ప్రజలలో వ్యాపించింది. ఉద్యోగాలివ్వగూడదని శాసనమే పుట్టింది గదా. అందుకని పౌరోహిత్యాలతో పాటు తక్కిన బ్రాహ్మణ కార్యములన్నీ అబ్రాహ్మణులే చేయవలసి వచ్చింది. సంతర్పణలూ, సత్రాలూ బ్రాహ్మణులకేగావి తక్కినవారికక్కరలేదా యేమిటి ? ఈ సత్రాలు, ఆలయాలు నిర్మింప చేయటంలో వచ్చే పుణ్యమూ, లాభమూ అబ్రాహ్మణులు వదులుకొని, పాపం పెరిగిపోతూవుంటే చూస్తూ వూరుకుంటారా!

శుభ్రంగా ఒక రిటైర్డు ఉద్యోగస్థుని వేషం వేసి పట్టెవర్ధనాలుపెట్టి నాయళ్ళూ, విభూతి, బిల్లగోచులూ ధరియించి చౌదర్లూ చందాల కవిలెకట్టలు పుచ్చుకున్నారు. వీరు చందాలడగడంలో బొత్తుగా దైన్యం లేదు. అబ్రాహ్మణజాతికి చిరకాలం నుంచి జరుగుతూవున్న అన్యాయం నివారించడానికీ, స్వయంనిర్ణయం ( సెల్ఫు డిటర్మినేషన్ ) కోసమూ వీరు పూనుకుంటారు. 'మన సొమ్ము తీసికెళ్ళి బ్రాహ్మణులు బ్రాహ్మణ సత్రాలు పెట్టుకొని తెగ తింటున్నారు. అందుకని శూద్ర—(కాదు, శూద్ర అంటే వినేవారికి చక్కిలిగింతగా వుండదు.) నాన్ బ్రాహ్మణులకు సత్రం పెట్టిస్తున్నాము' అంటేచాలు. ఎవరైనా అభిమానిస్తారు.

ఈ మధ్య నొక నాయుడుగారు, పాపం ఉద్యోగానికి సెలవుపెట్టినానని చెప్పుతూ, ఒక ఆలయమూ, సత్రమూ, తటాకమూ కూడా కలిపి నిర్మించడానికి పూనుకొని చాలా శ్రమ చేశారు. ఆయన ఇంజనీరింగు డిపార్టుమెంటు ఉద్యోగిలెండి. అందుకని చక్కగా ఆలయానికి, సత్రమునకు, చెరువుకు ప్లానులు రంగులతో తయారుచేసి, ఎస్టిమేట్లు వేసి తీసుకు వచ్చినారు. 'ఇదిగో ఇది ఆలయానికి ముఖద్వారము, ఇచ్చట గోపురం, ఇక్కడ కల్యాణ మండపం, ఇక్కడ సరోవరం, దానికిక్కడ మెట్లు, ఇదిగో ఈ రేవు ఆడవాళ్ళకు, ఇది సత్రం, ఇది బసకు, ఇవి వంటకు గదులు, వెనుక నుయ్యి' అని యీ విధంగా ప్లాను చూపిస్తూ ఆయన శ్రమ పడుతూవుంటే ఎవరికి గర్వం పుట్టదు చెప్పండి! ఆలయంలో పూజారికూడా నాన్ బ్రాహ్మడేనట మఱి!



★

"నాకు సాంఘికవిప్లవం కావాలి, ఆర్థికవిప్లవం కావాలి, అన్ని విప్లవాలూ కావాలి!"

★

దీనితో ఇంకొక సౌలభ్యం కూడా వుంది. ఈ ప్లానేతీసికొని, బ్రాహ్మణుల దగ్గర కూడా చందాలు వసూలుచేయవచ్చు. 'ఇదిగో ఈ భాగమంతా బ్రాహ్మణులకు వదలిపెట్టానండి. శూద్రులకు వేరేదారి, బ్రాహ్మణులకువేరే దారి. ఒకరి సంపర్కం ఒకరికి లేకుండా ఏర్పాటు చేస్తున్నాను' అని చెప్పవచ్చును. అబ్రాహ్మణ పూజారిమాట మట్టుకు చెప్ప నవసరములేదు.

కాంగ్రెసువారి దగ్గరకు వెళ్ళితే 'ఇదిగో ఇది హరిజనులు ప్రవేశించడానికి ద్వారం. స్వామిని సేవించడానికి ఏర్పాట్లు. ఆలయం శంకుస్థాపనకు మహాత్ములవారినే రమ్మని కోరాను. వారు అంగీకరించారు!' అని చెప్పవచ్చు.

ఈ ఆలయమునకు శంకుస్థాపన గాంధీజీ చేస్తారని విన్నారో ఏమోకాని, ఆ మధ్య పోలీసువారు ఆ నాయుడుగారి విషయములో కొంచం జోక్యం పుచ్చుకోవడంవల్ల ఆలయ నిర్మాణం ఆగిపోయినట్లు కనుపిస్తుంది. సత్రము మట్టుకు వారింటిలో నిత్యమూ సాగుతూనే వుంది. సత్రముకొరకు ఏర్పరచ దలచుకొన్న మాన్యం మట్టుకు ట్రస్టీ అయిన నాయుడుగారి పేరనే ఏర్పడింది.

పెద్దపెద్ద వర్తకులు, దేశములో తమ సరకులు వ్యాప్తి చెందడానికి, మచ్చు వస్తువులిచ్చి తమ ఏజంట్లను పంపుతారు. ఆ యేజంట్లు ఆ సరకుల నమూనాలు చూపించి, ఎవరెవరికి, ఏయే సరకు, ఎంతెంత కావాలో ఆ ప్రకారం అర్డర్లు బుక్కు చేసికొని; అర్డరుకు మొత్తము మీద నూటికి ఇరవై, ఇరవైయైదు వంతున అడ్వాంసు పుచ్చుకొని, ఆ యార్డర్లు కంపినీవారికి పంపితే వారు ఆ సరకులు పంపుతారు. ఇది వ్యాపార

లక్షణం. ఫలాని ఆయన మా యేజెంటు అని విజిటింగు కార్డు లచ్చువేసి నమ్మకం కొరకు ఏజెంటుకిచ్చి పంపుతారు.

ఈ యాచారం చూచి కొందరు బుద్ధిమంతులు, దూరదేశంనుంచి, ఆ యేజంట్లు రావడం శ్రమయని, తామే యేజంట్లుగా తయారవుతారు. ఒక్కొక్కరు రెండుమూడు కంపెనీలకు కూడా ఏజంట్లు కావచ్చు. దేశంలో ఎవరడిగినా, ఈ వర్తకులు తమ సరకులు ఉచితంగా మచ్చుకు పంపుతారు. ఆ ప్రకారం ఆయా కంపెనీలవారి సరకులు మచ్చుకోసం తెప్పించి పెట్టుకొని, ఆర్డరు ఫారములు, విజిటింగు కార్డులు అచ్చువేయించుకొని, కళ్ళజోడుతో, సగము గొరిగిన మీసాలతో, బయలుదేరి వస్తారు ఈ కపటపు ఏజంట్లు. ఇందులో తెలివిగలవారు కొందరు ఏజన్సీనే కాకుండా కంపెనీనికూడా సృష్టిస్తారు.

బొంబాయి, కలకత్తావంటి మహానగరములలో ఎన్నో కొత్త కంపెనీలు పెట్టుతూ వుంటారు. నమూనా వస్తువుల మీద కంపెనీ పేరుగల అట్టలు తీసివేసి, కొత్తకంపెనీ పేరుతోవున్న తన స్వంత అట్టలు విస్సుచేసి, ఆర్డర్లు హెచ్చుగా సంపాదించుటకుగాను రూపాయకు ఒక అణా తగ్గిన రేటుచూపి, గబగబా నాలుగైదు పట్నాలలో పదిపదిహేను రోజుల్లో ఆర్డర్లు బుక్కుచేసికొని, వచ్చినంత వరకు అడ్వాన్సులు గుంజుకొని పోతూ వుంటారు.

ఆర్డరు ఇచ్చిన పదిపండ్రెండు రోజుల వరకు ఎవరికీ అనుమానం వుండదు. ఆనక రెండుమూడు రోజులు ప్యాసుకోసం ఎదురుచూచి, మరో రెండురోజులకు కలకత్తాలోనో, లాహోరులోనో, అమృతసరంలోనో ఉందని చెప్పబడే ఆ కంపెనీకి వ్రాస్తారు. మా సరకులు పంపలేదేమని జవాబుకోసం ఒకవారం రోజులు చూచి ఆనక రిజస్టరు నోటీసు లిస్తారు. అవి కొన్నాళ్లకు తిరిగివస్తవి— 'చిరునామాదారు నాట్‌ఫౌండు' అనే రిమార్కుతో. ఈ విధంగా ఒక నెలరోజులు గడిచేటప్పటికి ఈ యేజంటు తనపని పూర్తి చేసుకొని ఒకటి రెండు సంవత్సరాల గ్రాసం సంపాదించుకొని, వేషంమార్చి, తన స్వంత పనులు చూచుకుంటూవుంటాడు. ఎప్పుడూ పరసేవనమేనా ? వెధవపీడ !

అసలు కొన్ని కంపెనీలవాళ్ళే, ఏజెంట్లను, వర్తకులను గూడా మోసం చేస్తారు. ఒక కంపెనీ పేరుపెట్టి, ఏజెంటు కావాలనీ, మంచి కమీషనిస్తామనీ ప్రకటనచేసి, ఏ కంపెనీ సరుకులో మచ్చులుపంపి, ఆర్డర్లు వచ్చిన తరువాత తక్కువరకం సరుకులు పంపుతారు. లేదా, అయిదారు మాసాలు వ్యాపారం సాగినతరువాత, ఏ నెలలోనైనా అడ్వాన్సు పైకం పుష్కలంగా లభిస్తే గుడినీ లింగాన్నీ కూడా మ్రింగి బల్లతీసి వేస్తారు. ఇట్లా సంపాదించిన సొమ్ము కాస్తా ఏ లోకల్‌బోర్డు ఎలెక్షన్‌లోనో తగలేసి, మళ్లా సంపాదనకు క్రొత్తమార్గం వెదకుతూ వుంటారు.

వీరుగాక, ప్రావిడెంటు కంపెనీలవారు, అప్పుల కంపెనీలవారు, అనేకరకాల ఇన్స్యూరెన్సులవారు బయలుదేరుతారు. ఆ వ్యవహారమంతా ఇంతకుపూర్వమే, ఇన్స్యూరెన్సు వాచస్పతులైన చెఱుకువాడ నరసింహంగారు పత్రికలలో వ్రాసారు కాబట్టి, వానిజోలికి పోక, ఈ శాఖ నింతటితో ముగించి విషయాంతరం ప్రారంభించుతాను.






ఇన్నాళ్ళమట్టి చూస్తున్నాంకాని రాధాయికి ఆ రంగాయి చిక్కనేలేదు. స్కూలుకు పెందరాడేచేరి పక్క కలెక్టరు ఆఫీసులో కోతి కొమ్మంచి ఆడేవాళ్ళం. ఎవడినో ఒకడిని పట్టుకోవలసిన అగత్యం మొదట రాధాయికి పట్టినప్పటికీ ఇప్పుడు మాలోకెల్ల పెద్ద వాడే. మేమంతా చెట్లెక్కి కూచునేవాళ్ళం. ఎవడో వకడు ఆయుధాన్ని విసిరి అవతల పారేశే వాడు. రాధాయి దబదబా పరుగెత్తి దాన్ని తీసుకుని కూతపెట్టుకుంటూవచ్చి చెట్టెక్కి మాలో ఎవడినో ఒకడిని గొంతులో కూత వుండగా తాకాలి. అప్పుడుకాని ఆ తాకబడిన వాడికి ఆ రాధాయిగాడి అవస్థ పట్టదు–అంటే అప్పుడుకాని వాడు దొంగకాడు ! అదీ మా ఆట !

అయితే మాలోకెల్ల రాధాయి వుడ్డోలుడు కావటంవల్ల ఎప్పుడో అప్పుడు మాలో ఎవరినో ఒకరిని తాకనే తాకేవాడు – ఒక్క రంగాయిని తప్ప. అదేం విచిత్రమో రంగాయి మటుకు వాడికి చిక్కలేదు. మాలోకెల్ల రాధాయి నాయకు డయినప్పటికీ రంగాయి విషయంలో ఇంకా కొరత వుండిపోయింది. ఈ చిన్నవిషయం సుస్పష్ట మయినప్పటి నించీ రాధాయికి రంగాయినికూడా తాకాలని మరింత పట్టుదల కలిగింది. రాధాయి ఎన్నో ఎత్తులువేశాడు. ఏవేవో ఆలోచించేవాడు. కాని వాడి అన్ని పన్నాగాలూ నిష్ప్రయోజనం అయిపోయినై.

రంగాయికైనా ప్రత్యేకప్రతిభ వుందని చెప్పటానికి వీల్లేదు కాని రాధాయిని తప్పించుకోవటంలో మటుకు వాడు విపరీతమైన చాకచక్యం చూపించేవాడు. రాధాయి దగ్గిరికి రాగానే వాడు ఇంకో కొమ్మమీదికి ఎగిరేవాడు. మేమెంతసేపటికీ తప్పించుకోటానికి కొమ్మల చివరదాకా పోయేవాళ్ళమే కాని వున్న కొమ్మమీదినించి ఇంకోదానిమీదికి ఎగరటం అనేది మాకు కొత్త – చాతకాని విషయం – చెయ్యలేనిది కూడాను ! మొదట్లో రాధాయి దిమ్మరపోయేవాడు ఈ రంగాయి ఎగరటంచూచి, కొంచం అనుభవమయింతరువాత, రంగాయి ఫలాని కొమ్మమీదికి ఎగురుతాడు అని వూహించుకో గలిగింతరువాత రాధాయికూడ ఇంకో కొమ్మమీదికి ఎగరటానికి సంసిద్ధమయి నేర్చాడు. ఈసంగతి రంగాయి గమనించి తన చాకచక్యానికి మరింత మెరుగుపెట్టాడు. వాడిప్పుడు ఏకొమ్మ మీదికైనా ఎగరకలడు ! ఒక్కొక్కసారి చిటారు కొమ్మకి వెళ్లి కూచునేవాడు. అటువంటి సమయాల్లో రాధాయికి గుక్కచాలక రంగాయిని తాకటానికి సమీపించినప్పటికీ కూత అయిపోయేది ! రంగాయి తన అవస్థనుచూచి వికటంగా నవ్వినందుకు రాధాయికి వుక్రోషంగానే వుండేదికాని రాధాయి ఏం చెయ్యగలడు ?

ఇంతలో రాధాయికి ఇంకో వుపద్రవం వచ్చింది. వకరోజున అకస్మాత్తుగా ఆ కలెక్టరు ఆఫీసు గుమాస్తా రాధాయిని లంకించుకొని లోపలికి తీసికెళ్ళాడు. ఇలా ఎప్పుడో జరుగుతుందని మాకు తెలుసు. అదివరకే రెండుమూడుసార్లు ఆఫీసు గుమాస్తా మా వెంటపడటమూ మేము దబదబా కొమ్మలమీద నించి జారి ఇవతల స్కూలులో పడటమూ జరిగింది. అందుకని తగుమాత్రం జాగ్రత్తగానే వుండేవాళ్ళం. కాని ఇవాళ్ళ విసిరివేయటంలో ఆ ఆయుధం ఆఫీసుకు కొంచం దగ్గిరిగా పడింది. దాన్ని తీసుకుని ఆట ప్రారంభించటానికి రాధాయి వెళ్ళేటప్పటికి

సమయంకోసం కాచుకునివున్న పిల్లిలాగా ఆ గుమాస్తా రాధాయిని వాటేశాడు. మేమంతా పారిపోయినాము. రంగాయిమటుకు మహారాజల్లే ఏమీ జరగనట్టు ఆ చిటారు కొమ్మనించి మెల్లిగాదిగి మా పిరికితనానికి నవ్వుతూ వచ్చేశాడు. మా అందరికీ వొళ్లు మండింది. వీడిపని పట్టించాలని మా అందరికీ వుందికాని మేమేం చెయ్యం?

రంగాయిని ఏదన్నా చెయ్యాలంటే రాధాయివల్లే కావాలి. వాడు ఎప్పుడువస్తాడా అని కనిపెట్టుకుని కూచున్నాం. చివరికి రాధాయిని వాళ్లు వదిలిపెట్టారు అరగంట సేపయింతరువాత. తర్వాత రెండుమూడు రోజులు సందేహించాము మళ్ళా ఆట మొదలుపెట్టటానికి. ఈసారి మా అందరి పట్టుదలా ఒకటే— ఎలాగైనా రంగాయిని పట్టుకుని వాడిని కిందికి దించాలి! పాత అనుభవాన్ని గుర్తుంచుకుని కొత్తఏర్పాటుచేశాము. పాతకూతకు గుక్క సరిపోకపోవటంవల్ల కొత్తది ఏర్పాటుచేశాం. "అంచి, అమ్మంచి, చెన్నన్నపట్టాంచి" అని నామకరణం చేశాము. వినటానికి ఇది కూత స్వరూపంలోనే వుంటుంది కాని చిన్న కిటుకు వుంది. కూతపట్టేవాడు అమూడు మాటల మధ్య గాలి పీల్చుకోవటానికి అవకాశం వుంటుంది! ఈవక్క ఆయుధంతో రెండు పిట్టల్ని కొట్టచ్చు! రంగాయి ఎంత చిటారు కొమ్మనవున్నా కూత సరిపోతుంది. రెండోది రంగాయి ఏకొమ్మమీదికి ఎగిరినా రాధాయి తాపీగా రంగాయివున్న కొమ్మమీదికి కూత వుండగానే చేరచ్చు!

ఒకరోజు ఓ శుభలగ్నంలో ప్రారంభించాము. రంగాయి ఈసారి ఎందుకనో కింది కొమ్మలలోనే ఇరికి కూచున్నాడు. రాధాయి కొత్తకూత పెట్టుకుంటూ తనని సమీపించేదాకా రంగాయికి అనుమానమే పోలేదు రాధాయి తన వెంటపడ్డాడని! అపన్న రంగాయి ఎక్కడలేని వేగంతో పాకి చిటారు కొమ్మకు చేరాడు. రాధాయి కూతవిడవకుండానే వాడి వెంటపడ్డాడు. రంగాయి దిమ్మరపోయినాడు. వాడి జన్మలో మొదటిసారి భయంవేసింది! "ఇది దొంగకూత!" అని అరిచాడు. రాధాయి ఇదేమీ వినిపించుకోకుండా రంగాయి వెంటపడ్డాడు. రంగాయి ఆ కొమ్మమీదికీ, ఈ కొమ్మమీదికీ ఎగిరాడు. "ఇది అన్యాయం, దొంగకూత!" అని వాడు అరవటం మాకు వినపడుతునేవుంది! రాధాయి అయినా ఏవిధమైన ఆతుర్దాలేకుండా రంగాయి ఏకొమ్మమీదికి చేరితే ఆకొమ్మమీదికి తాపీగా చేరటం మొదలుపెట్టాడు కూతతోనే. మేమంతాచూస్తునే వున్నాం ఏం జరుగుతుందా అని. మేం చూస్తుండగానే రంగాయి ఒకకొమ్మ పట్టుకుని అవతలికి పోయినాడు. రాధాయి అందాకాపోయి కూతపెట్టుకుంటూ ఆగాడు. చిత్రం ఏమిటంటే ఆకొమ్మ మరో చెట్టుది! ఆ చెట్టుకొమ్మలు ఈచెట్టులోకీ, ఈచెట్టు కొమ్మలు ఆచెట్టులోకి కలుసుకునే వున్నాయి. రంగాయి దబదబా ఆకొమ్మమీదినుంచి దిగి ఆ రెండోచెట్టు మొదట్లోకివచ్చి చేరాడు. కపిస్తున్న వాడి మొహంచూచి తీరాలి! రాధాయి ఇంకా కూత పెట్టుతునే వున్నాడు పైన! రాధాయి కూతపెట్టుకుంటూ రంగాయి దిగిన విధంగానే దిగినప్పటికీ రంగాయి మళ్ళీ ఇంకో చెట్టుఎక్కి తిరిగి మరో చెట్టుమీదినించి దిగి రాగలడు! రాధాయి ఏంకూతపెట్టి ఏకొమ్మ మీదికి ఎగిరినా ఏం ప్రయోజనం? కాకపోతే- ఇక రాధాయి చెయ్యాలిసిందల్లా రంగాయి కన్న త్వరగా కొమ్మమీదికి ఎగరగలగటం. ఇంకా చాకచక్యంగా ఏ చెట్టుపడితే ఆచెట్టు ఎక్కి దిగిరాగలగటం! అది రాధాయి నేర్చుకుని ఆమార్గం తొక్కితేకాని రంగాయి చిక్కేటట్టు తోచదు. అయితే రాధాయి అది చెయ్యగలిగినాడు. ఈ కొత్తకూత అనవసరం - పాతకూతే పనికొస్తుంది!

# చేసుకున్న కర్మ

జి.వి. కృష్ణరావు



"ఏమే. నిన్నే. దొడ్లోకి ఎవరో వచ్చినట్టుంది. కాస్త అటుపోయి చూడు."

"ఇపుడు ఎవరొస్తారు? రాగవులు గడ్డిమోపు తెచ్చాడేమో," అంది రాజేసిన చెత్తచుట్ట కాస్త తగలబడి పోతుందేమో నని గబగబ వంట పిడకలు విరిచి దాలివేస్తూ.

"నీ తెలివి తెల్లారింది. రాగవులైతే పాడావు ఒక్కటే అలా ఎందు కరుస్తుంది? పోయి చూడు." భర్త మరికొంచం గట్టిగా కూకలేశాడు.

పాలచెంబు అక్కడేవుంది. వాడు దొడ్లోకి వెళ్ళితే పిల్లముండ ఆ కానిని పాలు గుమ్మరిస్తేనో. లక్షమ్మ తన కొంగుపట్టుకొని అన్నంకోసం మారాంచేసే కొడుకుతో, "అరే చిట్టావా! కాస్త దొడ్లోకి పోయి చూడమ్మా ఎవరొచ్చారో" అంది.

చిట్టాడు మొండాడై పోయాడు. పంచె కట్టుకొన్న వెంకయ్య భార్యవేపు చూశాడు. ఆమె దాలివేసి పాలు పిడతలో పోస్తున్నది. చేతిలో పనున్న మనిషిని యేమంటాడు? తావే వినుక్కొంటూ పైరుకావి ఉత్తరీయం మీదవేసుకొని దొడ్లోకి వచ్చాడు.

అప్పుడే కరకర పొద్దు పొడుస్తున్నది. ఎదురు పొద్దుకు చెయ్యడ్డం పెట్టుకొని. "ఎవ రారు?" అని వెంకయ్య గట్టిగా కేకేశాడు.

"నేనేండి".

పెద్ద తలగుడ్డ ఎదురుగా వస్తున్నది. తేరిపారజూచిన వెంకయ్య. "నువ్వట్రా పుల్లాయ్. ఎప్పుడొచ్చా వేవిటి?" అని పరామర్శించాడు.

"ఇప్పుడే వత్తున్నా నండి." అన్నాడు వెంకయ్యను చూడగానే తలగుడ్డ తీసి బుజాన వేసుకొంటూ పుల్లయ్య?

"పిల్లామేకా బాగున్నారా?"

"ఏదో మీ దయొల్ల అట్టట్టుండాము."

"మాదయ కావలిసొచ్చినాదివైతే, ఇన్నాళ్ళు ఇటుకేసి చూడకుండా వుంటావా? మాకోసం కాకపోతె మానె, కొడుకుని ఇక్కడుంచావుగా. ఈ రెండేళ్ళల్లో ఒకసారన్నా చూచెళ్ళావట్రా? తొత్తు కొడకా. కని బూమిమీద పారెయ్యంగానే సరా? పశువులూ కంటున్నాయి. మవ్వూ కంటున్నావు." వెంకయ్య తిడుతున్నా. అందులో బలికేవాత్సల్యానికి పుల్లయ్య మురిసి పోయాడే కాని ఏమాత్రం నొచ్చుకోలా.

"ఏం చెయ్యమంటారు దొరగారు? ఇక్కడ కొద్దామని ఎన్నిసార్లుబయలుదేరినా పడకొచ్చింది. ఒకసారి మా యింటోది పడకేసింది. ఇంకోసారి చంటోడికి బాగుండలా.

మళ్ళోసారిగ త్తే. నాకు తెరమొచ్చింది. ఏమిచేసేది చెప్పండి ? అదీ యిదీ లేకుంటే పనిరోజు లొచ్చిపడేయి."

"ఇయ్యన్నీ ఎవళ్ళకి చెప్పాలో వాళ్ళకి చెప్పు. నాకు చెబుతావా ? కొడుకును చూద్దామన్న భ్రమతవుంటే ఈ రెండేళ్ళల్లో వీలు చిక్కకపోయిందీ ?" అన్నాడు వెంకయ్య.

అవును. నిజంగా కొడుకుమీద భ్రమతవుంటే, ఒకసారి కాకపోతే ఒకసారన్నా పుల్లయ్యకు చూడటానికి పడకపోయిందా ? వాస్తవం చెప్పాలంటే అతడి మనస్సు పెద్ద కొడుకు రాఘవులమీద లేదు. దానికి కారణముంది. రాఘవులకు ఆయిదేళ్ళు నిండీ నిండక ముందే వెంకయ్య దొడ్లో పడేశాడు. పిల్లలుగల పల్లెటూరి పేదవాళ్ళకు అంతకన్నా దా రేముంది ? రాఘవుల మంచిచెడ్డలన్నీ ఈ 15 ఏళ్ళనుంచి ఆ ఆసామే చూస్తున్నాడు. ఆయన్నే వాడికి పనినేర్పి చేయించుకొంటున్నాడు. దొరసాని వాణ్ణి ఎలా చూస్తున్నదో యేమో కాని, యీ పదమూడేళ్ళనుంచి మాత్రం ఆ దొడ్డి వదలనంటున్నాడు. పుల్లయ్య అవూరినుంచి దూరంగా వెళ్ళిపోతున్నప్పుడుకూడా రాఘవులు అక్కడనుంచి కదలనన్నాడు. అందువల్ల వెంకయ్యకుకూడా వాడంటే మమత ఏర్పడింది. పుల్లయ్యమాత్రం ప్రతి బావాయిపున్నానికి ఒకసారివచ్చి రావలసిన జీతం పుచ్చుకెళ్ళుతుండేవాడు.

ఇలాంటి పరిస్థితులలో తలిదండ్రులమీద రాఘవులకు భ్రమతలేదంటే ఆశ్చర్యపడవలసింది ఏమున్నది ? లక్షువమ్మే పిల్లలగన్న తల్లి కాబట్టి సంవత్సరాని కొకసారి బలవంతాన రాఘవుల్ని ఇంటికిపోయి చూచిరమ్మని నెట్టేది.

"ఏఘేవ్, రాగవుల తండ్రి వచ్చాడే. ఆ పెద్ద చెంబు తెచ్చియ్యి. మొగం కడుక్కుంటాడు." అని వెంకయ్య కేకవేసి చెప్పాడు.

"ఏమండి దొరగారు, చిక్కిపోయారేం ? కాయిలాపడ్డారా ఏమిటి ?" అన్నాడు పుల్లయ్య.

"లేదురా, పొయినకొద్దీ ఏళ్ళు వస్తున్నాయి కాని పోతున్నాయా." అంటూ వెంకయ్య దొడ్డి అరుగుమీద చతిలబడ్డాడు.

లక్షువమ్మ కుంబకోణపు చెంబు తెచ్చి వాడిదగ్గరపెట్టి, "ఏమిరా, ఇన్నాళ్ళకా వచ్చేది ? పరే, చాంతాడు బాయిదగ్గరేవుంది, తోడుకో." అన్నది.

రైతు కుటుంబాలతో సంబంధం లేనివాళ్ళకు ఆమె వట్టిచెంబు తెచ్చినందుకు కష్టం కలగవచ్చును. కాని ఆ వట్టి చెంబుకే పుల్లయ్య మురిసిపోయాడు. తనంటే దొరసానికి ఎంత చనువుంది ?

"కొడుకు కనపడ్డాడా ?" అడిగింది లక్షువమ్మ.

"ఆ కనిపిచ్చాడమ్మా. కనిపిచ్చాడు. వస్తా వస్తా వావుంలదగ్గరకు వెళ్లొచ్చా. అప్పుడే వాడు గడ్డి దూస్తుండాడు."

"అయితే యింకేం, దారిలోనే వాడిచెవి కొరి కొచ్చావన్నమాట !" అన్నాడు ఆసామి.

"చాల్లెద్దురూ, మీకుగాగ తగిపోయింది. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో చూస్తున్నప్పుడు మాటాడుకోవద్దా ఏమిటి ?" అని లక్షువమ్మ పుల్లయ్యను వెనకేసుకొచ్చింది.

"మేకారిపిచ్చి పోసీకపోతివి. పుల్లాయ్ ఎందుకొచ్చా డనుకోంటున్నా ? నిన్ను చూద్దామనీ కాదు. కొడుకును చూద్దామనీ కాదు."

"అయితే ఎందుకొచ్చా డంటారు ?"

"అలా అడగండమ్మా దొరసానిగారు." పుల్లయ్య నవ్వాడు.

"ఉండరా వెదవల కొడకాంటె వెదవల కొడకా అవి. ఊరికే చూచివెళ్ళటానికి వచ్చేవాడివైతే బాబాయి పున్నమవెళ్ళిన నాలుగురోజులకే రావాలి ?"

"ఇప్పుడే కాస్త తీరిక చిక్కిందేమో లెండి," అన్నది భార్య.

"వీడికా యిప్పుడే తీరిక. అంతేకాదూ ? అందుకనే అన్నారు మేకారిపిచ్చి అని. మరి వూరికే అంటారూ ?" వెంకయ్య ఎత్తిపొడిచాడు.

"ఎవరి తెలివితేటలు వారికుంటాయి లెండి. పోరా, పోయి కాళ్ళుకడుక్కురా." లక్ష్మమ్మ పుల్లయ్యను హెచ్చరించి యింట్లో కెళ్ళింది.

ఇంతలోనే దొడ్లోని ఆవులు అరిచాయి. కర్రిగిత్త కట్టుకొయ్యదగ్గర ముంగాలి గిట్టతో గీరుతూ ఖణేలున రంకెవేసింది. ఆరుకారుల యెద్దు పండుకొన్నదల్లా లేచి దొడ్డివాకిలివైపు చూస్తూ నిలబడ్డది. కోడెదూడ చెంగనాలు తీసుకొంటూ వస్తున్న ముందు మోపుదగ్గరకువెళ్ళి మూచూచి అక్కడనుంచి మరొక గంతు ముందుకువేసింది. ఆ రెండో మోపు రాఘవులది.

ముఖం కడుక్కొంటున్న పుల్లయ్య యిదంతాచూస్తూనే వున్నాడు. లేగదూడ లగాయతు ఆయింటి ఆసామిదాకా అంతా తన కొడుకును ప్రేమించేవారే. అలాంటి జీతగాణ్ణి ఆసామి పోగొట్టుకొంటాడా అని పుల్లయ్య లోలోన ఆసపడ్డాడు.

"ఓసి నీ దుంపతెగ, ఉండవే, వంచెలాగుతావు," అని రాఘవులు లేగదూడను అదలించాడు. అయినా అది అతనిచుట్టూ తిరుగుతూ ముందడుగు వేయనీయటంలేదు. అదిచూచి, "ఒరే చిట్టాడా ! నీ బుజ్జాయి పారిపోతున్నదిరా," అని వెంకయ్య కేకలేశాడు. తల్లిచెంగువదలి చిట్టాడు ఒక్క గంతులో దొడ్లోకి వచ్చిపడ్డాడు.

"బుజ్జాయి ఎటెల్లింది నానా ?"

"అదిగో రాగవుల యెనకాల. లాక్కెళ్ళి కట్టెయ్యి."

చిట్టాడు దూడ మెడలోని వెంట్రుకలతాడు పట్టుకొని లాగినా, అది రాఘవుల గోచిచెంగు వదలుతూ కదల్లేదు. రాఘవులు కసిరాడు. చిట్టాడు మళ్ళీ గట్టిగా లాగాడు. లేగదూడకు వంచెకొంగు వదలక తప్పలేదు.

మోపులు చావడిచూరువద్ద పడేసి చిన్నదొర, రాఘవులు లోపలికి లాగారు. జనపకట్టెలు మచ్చుమీద వెయ్యమని చిన్నదొరకు చెప్పి రాఘవులు వెంకయ్య దగ్గరకు వచ్చాడు.

"ఆవేళకాడ పోయి యిప్పుడా వచ్చేది !" ఆసామి కూర్చునే కూకలేశాడు.

"ఏమి చెయ్యమంటారు, గడ్డివస్తేనా ? ఎన్నుగాడి తెగ్గొడతానంటే మీరేగా వద్దన్నది."

"నిజమే నాన్నా, ఒక్క పరక్కూడా రావటంలేదు. ఏం రాగవాయి. రేపు తెగ్గొటద్దాం." అన్నాడు చిన్నదొర.

"రేపుకాదులే, మనుపులు చేస్తుండాయి. ఈ రెండురోజులూ పోనీ," అన్నాడు రాఘవులు.

ఆమాత్రం తెలివితేటలు తనకొడుకుకు లేనందుకు వెంకయ్య చింతపడ్డాడు.

"అరే రాగవాయి మీబాబు వచ్చాడఁరా అంది అప్పుడే బయటికివచ్చిన లక్షమ్మ.

"వస్తే వచ్చాడులెండి. అన్నంపెట్టండి, తొందరగా అరకుక్కపోవాలి. ఊళ్ళో నాగళ్ళు అప్పుడే చేలల్లోకి దిగాయికూడా," అన్నాడు రాఘవులు.

"రెండేళ్ళగ్గాను ఇవాళవస్తే అలా అంటావేమిరా!" అన్నాడు చిన్నదొర.

"వస్తే వచ్చాడు. వచ్చినవాడు చూస్తాడు. చూచినవాడు చక్కాపోతాడు. నువ్వు తొందరగా గొడ్లువిప్పు," అని చిన్నదొరను హెచ్చరించి పంపాడు.

"అరే అబ్బాయి! ఒకమాటరా." తండ్రి పుల్లయ్య పిలిచాడు. రాఘవులు మాట్లాడకుండా యింట్లోకి వెళ్ళుతున్నాడు.

"ఒరే నిన్నేరా, మీబాబు పిలుస్తున్నాడు," అని వెంకయ్యకూడా హెచ్చరించాడు.

రాఘవులు ఆసామి కెదురుగావచ్చి నిలుచున్నాడు. పుల్లయ్యకూడా అరుగుదగ్గరకు వచ్చాడు.

"మీ బాబు నీతో ఏమన్నా మాట్లాడుతాడు కామాలురా, వెళ్ళు." అన్నాడు దొర.

"నాతో మాట్లాడే దేముంది? మీతోనే మాట్లాడటానికని వచ్చాడు. అరు నువ్వు మాట్లాడు కోండి."

"వాడితిక్క ఎలావుందో చూడండి దొరగారు. వెనకటికి "నాపెళ్ళికి నేనూ పోవాలి." అన్నాట్ట యిలాంటివాడె.

"నేను మాట్లాడే దేముంది? పెద్దోడివి నువ్వు, న్యాయంతెలిసిన దొర ఆయన; మధ్య నేనుదేనికి? నేను అరకుక్కపోవాలి." అని తండ్రి పిలుస్తున్నకొందికి రాఘవులు ఇంట్లోకి వెళ్ళుతున్నాడు.

"ఒరే రాఘవులు ఉండకపోతే వుండకపోయావు. కాని, అరక కాస్త కనిపెట్టిపోసీ. లేకపోతే గిత్తచెడుతుంది," అన్నాడు ఆసామి.

"ఆవ్వా కావాలి బువ్వా కావాలి అంటే ఎలా? నీళ్లవచ్చి పడుతున్నాయి ఇంకా ఏడెకరాల మెట్టసాలు అలానేవుంది. ఒక జతతో సాగాలి సంత అంటె?" రాఘవులు వెళ్ళుతూ వెళ్ళుతూ అన్నాడు.

"దాని సిగ తరిగిరి, అయినప్పుడే అవుతుంది లేరా," అని గట్టిగాచెప్పాడు ఆసామి.

"ఈ వరసవాణ్ణి పెట్టుకొని ఎలా వేగేదండి దొరగారు," అన్నాడు పుల్లయ్య కొడుకు లోపలికి వెళ్ళింతరువాత.

"సరే, నువ్వుకూడా తిండితిను. తరువాత మాటాడొచ్చు."

అన్నాలయ్యాక ఎవరిపనిమీద వాళ్ళు వెళ్ళారు. వెంకయ్య తూర్పింట్లో తగతాబల్లమీద పడుకొని తాపీగా చుట్ట కాలుస్తున్నాడు. ఆసామి కింద పారేసిన పొగాకు కాడను పుల్లయ్య తుంపి నోట్లోవేసుకొంటున్నాడు.

"అదేమిటిరా, అడిగితే ఒకకాడ యివ్వకపోయాను."

"వద్దులెండి దొరగారు. నోట్లోకి యీకాడలే బాగుంటాయి."

అంతలో లక్షమ్మకూడా యింట్లోపని ముగించుకొనివచ్చి కూర్చున్నది.

"ఇదిగో దొరగారు!" అన్నాడు పుల్లయ్య.

"ఏమిటిరా?" అన్నాడు ఆలోచనలనుంచి బయటపడి ఆసామి.

పుల్లయ్య కాసేపు నీళ్ళునమిలాడు.

"అవత్తులు దేనికి పుల్లయ్యా! అడగదలిచిం దేదో అడగరాదా?" అన్నది యిల్లాలు.

"అదికాదండి దొరగారు. ఈ యేడు వాడికి పెళ్ళిచేద్దామని వుంది."

"పిల్ల కుదిరిందటరా?" లక్షమ్మ అడిగింది.

"ఇంకా లేదండి దొరసానిగారు."

"అయితే మరి నీ గోడేమిటి?" అన్నాడు ఆసామి.

"అదికాదు దొరగారు, నాలుగురాళ్ళు సంపాయిచ్చుకొంటుంటేగా ఓరన్నా పిల్లనిత్తామనేది?"

"సంపాయించు కొంటుంటెగదరా, గోవాయికోడెలా తిరుగుతున్న దెక్కడ?"

"యాభై రాళ్ళు వాడికీ, వాడి పెళ్ళానికీ ఎక్కడ చాల్తాయండి. అందుకనే యెక్కడన్నా పిల్లనడగబోతే జీతం ఏమి తెస్తుండాడేమిటి అంటుండారు."

"ఇంతకూ జీతం పెంచందే ఈయేడు నాదగ్గర వుంచేది లేదంటావు. అంతేనా?" అన్నాడు ఆసామి.

"అన్నీ తెలిసి మీరు అలా అంటే ఏమిచెప్పేది. కట్టుకాలు మీకు తెలీనియి కనకనా?"

"నీ కొడుక్కు పెళ్ళిచేయటమేగా నీకు కావలసింది?"

"అంతకన్నా యీ ముసలి ముండాకొడుక్కేమి కావాలి?"

"అయితే యీ పదేనేళ్ళనుంచి యిస్తున్న జీతం ఇచ్చిపో. రేపీ వరటాళికి వాడికెలా పెళ్ళికాదో చూదాము."

"అంతగీతండీ మాకు. పిల్ల బీరకాయ, రోగాలు, నొప్పులు, గుడ్డా గోసీ, ఎప్పటి కప్పుడు ఎతుక్కునే గతి తప్పటంలేదు. మీరుకాస్త చల్లనిచూపు చూడాలి. మాలాంటోళ్ళు బతకాలి."

వెంకయ్య కాస్త ఆలోచించి, "ఇంతకూ యామంటా వేమిటి?" అన్నాడు.

"మావూరు షావుకారు రొండు జతల గుడ్డలిచ్చి డెబై అయిదు రూపాయ లిస్తానం టుండాడండి."

"అయితే నీ కొడుకును అక్కడే జీతానికి పెట్రా," అని వెంకయ్య గోడపై పుకు తిరిగి వండుకొన్నాడు.

"దీని దుంపతెగాను, ఒక్కసారే పాతిక పెంచుతారట్రా ఎవరైనా?" అంది లక్షమ్మ.

"నీతోడండి దొరసానిగారు. 75 రూపాయలు రొక్కం తెచ్చి నా చేతిలో పొయ్యొచ్చాడండీ. వలుగురు కట్టిన యింటి కిందుండి చెబుతుండా."

లక్షమ్మ మాట్లాడలేక పోయింది.

"ఒరే పుల్లాయ్, వచ్చేడబ్బు చెడగొట్టుకోవడం దేనికిరా. విశేషంగా నీ కొడుకును తీసుకెళ్ళి ఆయనదగ్గర పెట్టు. మాకూ కొంచెం బరువు తగ్గుతుంది. ఈయేడు నాగాలుకూడా లేవు. కావలసినదేమిటో రేపు పొద్దున యిచ్చివేస్తాను,"

"మీరల్లా దయతప్పితే మా పేదోళ్ళేమికావాలి?"

"నేనేమీ నిష్టూరా లెయ్యటంలేదు. సాయంత్రం రాగవులు రాగానే చెప్పి తీసుకెళ్ళు."

కావేపు ఎవరూ మాట్లాడలేదు. రాఘవులను తీసుకొని వెళ్ళుతానంటే. లక్షివమ్మకు కన్నీళ్ళపర్యంతమైంది. ఇన్నేళ్ళు తమదొడ్లో ఉన్నాడు. చెప్పించుకొనకుండానే అన్నీ చేసుకొని పోతుంటాడు. "పనిమంతులు" దొరికినా నమ్మకమైన మనుషులు దొరకొద్దూ? పదో పరకో పెంచి రాఘవుల్ని అట్టేపెట్టమని భర్తకు చెబుతామనుకొన్నది. ఆయనకు తాను ప్రత్యేకంగా చెప్పవలసింది ఏమున్నది? తాను ఇంటివద్ద వున్నా లేకపోయినా ఎలా జరిగిపోయేదీ ఆయనకు తెలియదా? సంసారమంతా యీదుకుపోయే ఆయనే యిలా అన్నాడంటే యేదో వుండివుంటుంది. ఈభావం కలగటంవల్ల లక్షివమ్మ జీతగాణ్ణి అట్టిపెట్టవలసిందే నని పట్టుబట్టలేక పోయింది.

"అయితే దొరగారు!"

"ఏమిట్రా. గంగలో దూకమంటావా ఏమిటి?"

"అయ్యయ్యో అంతమాట దేనికండి. మీరుకాస్త విడమరిచి చెబితే."

"నువ్వు చెప్పలా?"

"చెప్పాను. ఇందాక వాడన్నమాటలు విన్నారుగా. మీరు వెళ్ళమంటేకాని మీ దొడ్డి వదలడండి దొరగారు."

"అలాంటప్పుడు నేనుచెబితే వింటాడా?"

"తప్పకుండా వింటాడండి. మీమీన వాడికి మాపెద్ద గురి."

"సరే యీ రాత్రి నీముందే చెబుతాను." అంటూ చటుక్కునలేచి చెప్పులు తొడుక్కొని వెంకయ్య పొలంవెళ్ళాడు.

ఆ రాత్రి యింటిల్లిపాది భోజనాలు అయిన తరువాత వెంకయ్య గొడ్లకు మేతవేస్తున్న రాఘవుల్ని. వాకిట్లోకూర్చున్న పుల్లయ్యను కేకేసి దొడ్లో అరుగుమీద రడ్డిగం వేసుకుని కూర్చుని తీరిగ్గా చుట్టముట్టించాడు. తండ్రి కొడుకు లిద్దరువచ్చి అసామి కెదురుగా కింద కూర్చున్నారు.

"అయితే రాగవులూ మీబాబు ఎందుకొచ్చాడో కనుక్కున్నావా?" అడిగాడు ఆసామీ.

రాఘవులు తలవూపాడు. ఇంతలో చిన్నదొర. చిట్టాడు వచ్చి తండ్రిపక్కనే అరుగుమీద కూర్చున్నారు.

"మరి మీ బాబుకు ఏమిచెప్పా?" మళ్ళీ అడిగాడు ఆసామి.

"నేనేమి చెప్పేదండి. అన్నీతెలిసినోరు మీరుండారుగా." అంటూ జీతగాడు నవ్వాడు.

"అయితే నేనుచెప్పినట్టు మీ అబ్బా కొడుకులు వినుకుంటారా?"

"మీ మాటకు ఎదురుచెప్పే దేముంది?" అన్నాడు రాఘవులు.

"న్యాయం సెలవిత్తే కాదనేదోడు దొరా?" అన్నాడు పుల్లయ్య.

"అరే రాగవులూ మీవూళ్ళో షావుకారు నువ్వు తనవద్ద జీతానికి కుదిరితే రొక్కం డెబ్భై అయిదు రూపాయ లిస్తానంటున్నాడట." వెంకయ్య ఆరిపోయిన చుట్టను అవతల పారేశాడు.

"మీరేమంటారు?" రాఘవులు ఆసామివేపు చూచాడు.

"నేమ చెప్పే దేముందిరా? నువ్వు నాలుగురాళ్ళు సంపాయించుకొంటే నేనెలా కాదంటాను? నేను కాదంటేమాత్రం నీకెలావుంటుంది? నలుగురు అవునొద్దూ? రేపొద్దున్నే మీబాబు వెంటవెళ్ళు. ఏదో యింతకాలం నన్ను నమ్ముకొన్నా వనుకో. ఈ చిట్టాడొకటి కాదు. నువ్వొకటికాదు. మీబాబు ఎంతచెప్పినా ససేమిరా అంటున్నావని తెలిసింది. అందుకని అంటున్నా. నిన్ను అట్టె పెట్టుకొందామని లేకపోలేదు. మరేంచెయ్యను? కాలం

బాగుండలేదు. ధరలు ముండమోసి కూర్చున్నాయి. ఖరాయించొద్దూ? చీకటితోలేచి మీబాబు వెంట వెళ్ళిపో."

వెంకయ్య పక్కవాటుగా తిరిగి చిట్టాడిని దగ్గరకు లాక్కొన్నాడు.

"రాగవాయి యాడకే ఎల్లేది?" చిట్టాడు తండ్రిని అడిగాడు.

"వాళ్ళింటికి?"

"వాళ్ళిల్లెక్కడ? ఇదికాదూ?"

"కాదు నాన్నా. చాలదూరాన వుంది."

"ఎందు కెళ్ళుతున్నావు రాగవాయి? నాన్న కొట్టాడా?"

ఆసామి తప్ప మిగతావాళ్ళంతా నవ్వారు.

"వాళ్ళ అమ్మదగ్గిరికి వాడు వెళ్లుతన్నాడు," అన్నాడు తండ్రి.

"మల్లా ఎపుడొత్తాడు?"

"ఇక రాడురా." అన్నాడు చిన్నదొర.

"అయితే ఎల్లొద్దు రాగవాయి. మనిద్దరం సావాసంకాదు?" అంటూ చిట్టాడుపోయి రాఘవుల మెడ వాటేసుకొన్నాడు.

"ఎల్లనుగా నువ్వుపోయి పడుకో," అన్నాడు రాఘవులు.

"అమ్మదొంగా! నన్ను మరిపిచ్చి పోదామనుకుంటున్నావులే. ఇవ్వాళ నీదగ్గిరే పండుకొంటాను." చిట్టాడు మారానికి దిగాడు.

"పోదు నాన్నా, నువ్వుపోయి యింట్లో పడుకో," అన్నాడు తండ్రి.

"నాకు తెలుసులే. ఇవ్వాళ నేను రాగవాయిదగ్గిరే పండుకొంటాను."

రాఘవులు చిట్టాడిని బుజానవేసుకొని చావట్లోకి వెళ్ళాడు.

"అరే పెద్దాడా, మీ అమ్మనుపోయి చిట్టాణ్ణి తీసుకురమ్మను." అని వెంకయ్య పెద్ద కొడుకును పంపాడు.

"ఏమండి దొరగారు?" పుల్లయ్య తన సంగతి జ్ఞాపకంచేశాడు.

"చెప్పానుగా. చీకటితోలేచి తీసికెళ్ళు. రావలసిన డబ్బు మీ దొరసానికిచ్చాను. అడిగి పుచ్చుకో. ఇంకాదేనికి, పొద్దుపోలా? చాప తీసికెళ్ళి తలాకిలి అరుగుమీదవేసుకొని పండుకో."

వెంకయ్య యింట్లోకివెళ్ళి పండుకొన్నాడు. లక్షమ్మ పాలుతోడుపెట్టి వంటయిల్లు చక్కదిద్దుకొన్నది. తరువాత చిన్న లాంతరు తీసుకెళ్ళి దొడ్డిగేటువేసి రాఘవుల పక్కలో నిద్రపోయిన చిట్టాణ్ణి ఎత్తుకొచ్చి తన పక్కలో పండుకోబెట్టింది. గంటలాగా దీపం వెలుగుతుంటే దాన్ని కాస్త తగ్గించింది. పెద్దకొడుకు కిందకు నెట్టివేసుకొన్న దిండు మళ్ళా వాడి తలకిందపెట్టి మోకాళ్ళకు పైకిపోయిన ధోవతి సరిగాలాగి వచ్చి తన మంచంమీద కూర్చున్నది. ఆసామి యింకా పసిపిల్లవాడిలాగా మెసికట్లాడుతున్నాడు.

"యావండీ, అప్పుడే నిద్రపోయారా?" లక్షమ్మ నవ్వింది.

"నిద్రపోయానే" అన్నాడు వెంకయ్య.

"నిద్రపోయినవాళ్ళు మాట్లాడుతారు కామాలు. నాకు తెలీదులెండి. పరేకాని రాగవాయి ఏడుస్తున్నాడు. ఏమన్నారేమిటి?"

"నే నేమనలేదే. వాడి బాబువెంట పొమ్మన్నాను. మరేంచేసేది, భరించే శక్తిలేనప్పుడు ?"

"వాడి చాకిరికి 75 రూపాయలివ్వటం కష్టమా ?"

"అయితే మీ బాబేమన్నా యిచ్చాడేమో తెచ్చియివ్వు."

"మీకు చాకిరీచేయటమేం, మా బాబు డబ్బివ్వటమేం ?"

"నాకిచ్చే శక్తి లేదనేగా చెబుతున్నది ?"

"నాదెగ్గిరికీ, వాడిదెగ్గిరికీ వచ్చేటప్పటికే మీకు చెయ్యిరాదు." లక్షుమమ్మ కష్టంగా మాట్లాడింది.

"మీకు కిందుమీదులు తెలియటంలా. ఇంకా ఎన్నాళ్ళకొస్తుంది గ్నానం? నీ అల్లుడికేమో అయిదేలకు నోటురాయించి యిచ్చేదాక నిద్రపట్టకపోయె. చావడికేమో వెయ్యిరూపాయలయ్యె. ఈ అప్పులన్నీ తీరి ఎలా బయటపడతామురా భగవంతుడా అనుకొంటుంటే ఈ బండకూడా నా నెత్తికే ఎత్తాలంటే? నేనూ మనిషినే" వెంకయ్య కస్సుమన్నాడు.

ఆ మాటలతో మానవురాలు మళ్ళీ నోరెత్తలా. రామనామస్మరణ చేస్తూ లక్షుమమ్మ నడుం వాల్చింది. ఆసామికి మాత్రం నిద్రపట్టలా. "మాఖం, ఫాల్గుణం—ఫాల్గుణంతో నోటు వాయిదా వెళ్ళిపోబోతూవుంది," అంటూ వెండి సులోచనాలతో వియ్యంకుడు, "డబ్బు అవసరంగావుందిరా అబ్బాయి," అంటూ తనవూరి షావుకారు వెంకయ్య ప్రత్యక్షమయ్యాడు. అతనికి చీమలు పారుకాడినట్లయింది. అతడు ఇంకా ముడుచుకు పండుకొన్నాడు. ముడుచుకొన్నకొద్దికి చాలా చీమలు చుట్టూ బ్రహ్మాండంగా కోటలు పెట్టుకొస్తున్నాయి. గాభరా పుట్టింది. అతడు ఉలిక్కిపడి కూర్చుని కళ్ళుతెరిచాడు. దీపకాంతి కొంత ఊరట కలిగించింది.

అయినా అతని హృదయం దడదడ కొట్టుకుంటూనే వుంది. తాను అందనివాటికి అర్రులు చాచిందెక్కడ ? పట్టరాని పరుగులు తీసిందెక్కడ ? వియ్యంకుడికి అయిదువేలకు నోటు వ్రాసి యిమ్మన్నదెవరు ? రైతన్నవాడు ఎవడు చేలోచేను తెగనరికి ఇస్తాడు ? ఆ పని చేయక పోబట్టే యివ్వాళ ముడ్డికిందికి నీళ్ళొచ్చి కూర్చున్నాయి.

విజంగా ధరలు అలా నిలబడివుంటే ఇలాంటి అప్పులు తన్ను ఏమిచేసేవి? నాలుగైదేళ్ళలో తీరిపోయేవికావా ? అసలు ఈ ధరలు ఎందుకు పడిపోయాయి ? తాను ప్రతి సంవత్సరం పంచాంగశ్రవణం చేస్తూనేవుండె. ధరలు తగ్గుతాయని ఒక సిద్ధాంతి అయినా ఎందుకు వ్రాయలేదు ? వాళ్ళకు మాత్రం కర్మ ఎలా తెలుస్తుంది ?

అయితే తాను చేసిన కర్మ ఏమిటి ? తను ఎవడి కడుపూ కొట్టలేదు. తన వర్ణధర్మం తప్పిందిలేదు. తనకీ దుర్గతేమిటి ? తనవూరి షావుకారికి ఆ ఐశ్వర్యమేమిటి ? అతడు చేసిన పుణ్యమేమిటి ? ఎందరి కొంపలు నిలువున తీశాడు ? ఎన్ని దీపాలు ఆర్పివేశాడు ?

వెనక జన్మంలో పున్నెం చేసుకొన్నాడేమో. అయితే దేవుడిమీదకూడ పెత్తనంచేసేది కర్మే కాబోలు. ఆ లెక్కలో దేవుడు దేనికి ?

తన తెలివితేటలికి తాను దేవుణ్ణి వెక్కిరించేవాడా ? వెంకయ్య భయంతో వణకిపోయాడు. క్షమించమని తనకుతానే చెంపలు వాయించుకొన్నాడు.

ఇంతకూ తాను చెయ్యవలసిందేమిటి ? నిలువునా ఉన్న పొలం, గొడ్డుగోదా తెగబరికి అప్పులు తీర్చటమే. మాట దక్కించుకొని అప్పులనుంచి బయటపడాలంటే అంతే. సరే

అమ్ముతాడు. అమ్మింతరువాత చెయ్యవలసిన పని ? ఇద్దరు పిల్లలూ, తాను, తనభార్య ఎలా పోషించటం. ఏ ఆసామివద్దో జీతానికి కుదరాలి. పొలంచాకిరి తప్ప తాను చేయగలిగింది ఏముంది ? పొలం లేనప్పుడు మరొక రైతువద్ద తల తాకట్టు పెట్టుకోవలసిందేగా ?

ఇంతబతుకు బతికి తాను తోటి రైతువద్ద జీతం ఉంటాడా ? తాత ముత్తాతలనుంచి వస్తున్న పొలం అమ్మి బిడ్డలను బికారులను చేస్తాడా ? తనతండ్రి అంత పొలం అప్పజెప్పింది అందుకేనా ? అంతకన్నా ముక్కుమూసుకొంటే మూడుగడియలు పట్టదే.

వెంకయ్యకు అటు పొల మమ్మటానికికాని, ఇటు ముక్కుమూసుకోటానికికాని సాహసించ లేకపోయాడు. భగవంతుడనేవాడు వుంటే, వాడికి కనికరం లేకపోయిందా ?

ఆ తెల్లవారుజామున పుల్లయ్య రాఘవులు కనిపించలేదన్న ఆతురతతో దొరను లేగ్గొట్టాడు. ఎక్కడి కెళ్ళాడంటే ఎక్కడి కెళ్ళాడని యింటిలపాది విస్తుపోయారు. చిట్టాడు ఆ హడావుడికి లేచి శోకాలు మొదలెట్టాడు. వాణ్ణి సముదాయించేటప్పటికి లక్షువమ్మకు పెద్దలు దిగొచ్చారు. పుల్లయ్య కళ్ళురచూస్తూ దొరను ఏమనలేకపోయాడు. లక్షువమ్మ భర్త సందకాడ తనకిచ్చిన యాభై రూపాయలు పుల్లయ్య దోసిట్లోపోసి, "రాగవాయికి వచ్చిన పరవా ఏమిలేదులే," అని ఒకటికి రెండుసార్లు నమ్మకంచెప్పి సాగనంపింది.

ఆనాడు రెండుబారలు పొద్దెక్కినతరువాత లాంతరు పట్టుకొని రాఘవులు ఇంటికివచ్చాడు.

"వచ్చాడమ్మా వచ్చాడే, రాగవాయి వచ్చాడు. నాకు కాయకూడ తెచ్చిపెట్టాడు." అని చిట్టాడు గంతులు పెడుతూవచ్చి తల్లిచేతికి తాటికాయ అందించాడు.

ఆమె దొడ్లోకివెళ్ళి చూచేతలికి రాఘవులు కడవలో నీళ్ళుతోడుకొని ముఖం కడుక్కొం టున్నాడు." నీ మొగానో గుద్దుమొలవ, యాడకెళ్ళావురా ?"

"పడమటి పొలాన నారుమడి ఎండిపోతుంటే, నీళ్లుపెట్టటాని కెళ్ళాను. మరి లాంతరు యెందుకు తీసుకెళ్ళా ననుకొన్నారు ?"

"బాబు ముండాకొడుకు నీకోసమని దుంపలు దంపలు చేసుకొస్తే మొగం తప్పిస్తావట్రా తప్పుడుగాడిదా "

"ఏమన్నా అనండమ్మా. మీరనావచ్చు. నేను పడావచ్చు. చిన్న దొరను అనటంలా ? మా బాబంటారా ? ఈ పదేళ్ళనుంచి యీబాబు ఏమయ్యాడు ? రోగంవచ్చినా, నొప్పివచ్చినా మీరుచూస్తుండారుకాని, ఆయనొచ్చి చూస్తుండాడా ? చెప్పవేవమ్మా అలాచూస్తావు ?"

"పుల్లయ్యమాత్రం ఏమన్నాడురా ? నీ బాగుకోసమేగా చెప్పింది ?"

"చాలు చాల్లెండి, మాబాగ చెప్పారు. వాళ్ళకు కావలసింది నా బాగా ? నా జీతం. నిజంగా నాబాగు కోరేవాళ్ళయితే ప్రతేడు నా జీతం తీసుకెళ్ళుతున్నారుగా. ఇప్పుడు నా సొమ్మెంతుందో చూపించమనండి. అంతా తినేశారు. ఈరోజున ఒక దమ్మిడీకూడా లేదు."

"పిల్లల్ని కని పెంచటం దేనికిరా ? ఏడుగడ అవుతారనేగా ?"

"నిజమే, మీరుచెప్పినట్లు పెంచి పెద్దవాణ్ణిచేస్తే అలాగే. నా మంచి చెబ్బర మీరుచూశారు కాని, మావాళ్లేమన్నా చూశారా ?"

లక్షువమ్మ వాదించలేకపోయింది. "అదికాదురా అలా మొగంతప్పిస్తే మీబాబు ఏమనుకుంటాడు ? మేమేదో చెప్పిచేయించా మనుకోడూ ?"

"ఇందులో మీరు చెప్పిందేముంది? నిన్నపొద్దునే. "నేనురావటంలే."దని మాబాబు ముఖానే చెప్పేశాను. మిమ్మల్ని అనటానికి పనేముంది?"

"సరే ఫిలాకావాలో అలాగే అవుతుందిలే. పొద్దెక్కింది. తొందరగా కాఫీ, రెండుముద్దలు తిందుగానీ."

రాఘవులు అన్నం తిని అప్పుడే మళ్ళా అరక్కు వెళ్ళాడు.

అతని ప్రవర్తనకు ఊళ్ళోవాళ్ళేకాదు, వెంకయ్య లక్షమ్మలుకూడా విస్తుపోయారు. నాటినుంచి జీతగాళ్ళ సంగతివస్తే రాఘవుల ప్రస్తావన రాకుండా వుండటంలేదు. ఆ ఆసామి మీద వాడికి అంత మమకారం దేనికి? అందరి జీతగాళ్ళు అలావుండరేం? అందరూ అలా ఒళ్ళువంచి పనిచేయరేం? ఇవే వూళ్ళో రైతులకు తీరని అంతర్జాతీయ సమస్యలు.

ఊళ్ళో ఆసాములు తమ జీతగాళ్ళను కూకలేసినప్పుడల్లా రాఘవుల సంగతియెత్తే వాళ్ళు. వాళ్ళుకూడా పుటికి పుటికి నాలుగు అడిగేవాళ్ళు. షరతులన్నీ గుదిగుచ్చి పెట్టేవాళ్ళు. ఛద్దుదంపమనగూడదు. చద్దన్నం పెట్టగూడదు. చీటికి మాటికి తమపెద్దల్ని తడవగూడదు. ఏడాదికి జత కట్టు పంచెలు, జత పై పంచెలు ఇవ్వాలి. నెలకు సవాసేరు పొగాకు ఇవ్వాలి. అయినంతపని చేయించుకోవాలి కాని, అయినదానికి కానిదానికి చివాట్లేస్తే లాభంలేదు. ఇలాంటివే యింకా ఒకటి రెండు షరతులుండేవి. రైతులు వాటిని పాటించిందీలేదు. జీతగాళ్ళు రాఘవుల్లా పనిచేసిందీ లేదు.


అయినా కాలవాహిని ఒక్కక్షణంకూడా ఆగలా. వర్షాకాలం వచ్చింది. మాగానివూళ్ళు మొలబంటి బాడవలయ్యాయి. రాఘవులు చావట్లోనుంచి కదిలేవాడుకాడు. ఎప్పుడూ కట్టుపట్లు రొచ్చుకాకుండా పశువుల వుచ్చ కుండలోపట్టి బయటపారబోస్తూనో మేతవేస్తూనో వుండేవాడు. అన్నం తిన్నదగ్గరనుంచి వారపిడి, ఏగర్రా చావట్లోకి పట్టుకెళ్ళి పగ్గాలకు, ఎడ్ల సిగమోర్లకు చొప్పుపేనేవాడు. ఆ చొప్పు సవరగా వెండితీగలాగా వుండాలి. అందులో ఏమాత్రం వంక వచ్చినా సహించేవాడుకాడు. మళ్ళా మెదలెత్తుకోవలసి వచ్చినా బద్ధకించేవాడుకాడు.

అతనికే అప్పుడప్పుడు అనిపించేది. తనకంతమోజు దేనికి? తాడు అందంగా లేకపోతే ఏమిపోయింది? పనిగడవటమేకదా ప్రధానం. కాని అతన్ని మనస్సు ఒప్పుకొనేదికాదు.

ఆ గొడ్లు, వ్యవసాయం తనవి కాకపోయినా తానున్నంతకాలం సలక్షణంగా వుండాలి. అన్నట్లు ఆసామి తన్ను భరించలేనంటున్నాడుగా. ఎందుకన్నాడు? తన్ను గట్టిగా పొమ్మని చెబితే? ఆఁ ఏందుకంటాడు? ఆయనకుమాత్రం న్యాయం తెలీదా? ఇన్నాళ్ళు దొడ్లోవున్న మనిషిని ఎలా పొమ్మంటాడు? తాను ఒక్కడే ఆయనకు బరువవుతాడా? తనపిచ్చికాని ఎందుకు పొమ్మంటాడు?

వాస్తవం గుర్తించడానికి ఒప్పుకోని ఆ అమాయక హృదయం ఎన్నెన్నో మధురలోకాలు నిర్మించుకొంటున్నది. తనదొడ్డి కలకల లాడుతుండాలి. తన యెడ్లకు పోటీవచ్చేవి ఆవూళ్లోనే కాదు చుట్టుపక్కల వూళ్ళలోకూడా వుండకూడదు. తాను సేద్యంచేసినపొలం ముప్పందుం చొప్పున రాలాలి. ఈయేడు ఒకటికి రెండుసార్లు దమ్ముచేసి మొక్కవేశాడు. దుబ్బుకూడా బాగానే చేస్తున్నది. జాయగావుంటే ముప్పందుం రాలుతుంది. అందులో ఢోకాలేదు. అయినా విశాఖ చూడద్దూ? అది కొంపతియ్యకుండా వుంటేగదా?

కాలం సవ్యంగా సాగాలనీ, తానుచేస్తున్న చేలు (ఆసామివే అయినా) బాగా పండాలనీ లోలోన వేయిదేవుళ్ళకు రాఘవులు మొక్కుకుంటున్నాడు. అంత మమత అతనికెలా ఏర్పడింది? దీనివల్ల అతనికివచ్చే లాభమేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం శాస్త్రవేత్తలు చెప్పుకోవలసిందే.



ప్లీడరు. "నేను అడిగినదానికి వెంటనే సమాధానం చెప్పాలి. ఆలోచించుకోకూడదు. చెప్పు ;
నువ్వెక్కడ ఉన్నావా ?"

సాక్షి. ఆలోచించకుండా చెప్పటానికి నేనేమీ ప్లీడర్నికాను, అదీకాక ఆలోచించకుండా ఏదీ
చెయ్యవద్దని ప్రతి శాస్త్రమూ చేప్పుతూవుంది."

---

వర్షాలతోపాటు వెంకయ్య కుటుంబానికి మంచిరోజులుకూడా వెనకబట్టాయి. వియ్యంకుడు తనకొడుకు కట్నంతాలుకూ రావలసిన 68 వందలకు రిజిస్టరు నోటీసిచ్చాడు. ఊళ్ళోషావుకారు 1608 రూపాయలు ఆనెలలో కడితేగాని వీలులేదని నిలవేశాడు. గొల్లది తనకు రావలసిన 75 రూపాయాలకు లక్షమ్మ చుట్టూ తిరిగి పోతున్నది. నాటినుంచి లక్షమ్మకు సూర్య చంద్రులగతి సక్రమంగా లేదనిపించ సాగింది.

వెంకయ్యకూడా ఉబ్బసపు రోగిసీ, శ్లేష్మంలోపడ్డ ఈగనుచూచికూడా ఈర్ష్యపడవలసి వచ్చింది. పొరపాటున రాత్రి యేరెండు జాములకు ఒక కునుకుపట్టినా, ఋణదాతలు ప్రత్యక్షమై మాసంగతి ఏమిచేశావంటే మాసంగతి ఏమిచేశావని యమదూతల్లాగా పొడిచేవాళ్లు. వాళ్ళపోటు తప్పించుకొన్నా గొల్లదుగ్గి వూరుకొనేదికాదు. "ఇదికూడా నీ నెత్తినే కొట్టుకో." అని పెరుగుదుత్త అతనిమాదున ఎత్తిపెట్టినట్లయ్యేది.

ఈబాధ భరించలేక వెంకయ్య నిక్షేపంవంటి ఎనిమిదెకరాల రేగడ డెబ్భై అయిదు వందలకు రెండోవాడు వినకుండా సూరయ్యకుఅంటగట్టాడు. నిలవున్న 11 పుట్లధాన్యం నాలుగువందలకు తెగబరికాడు. అయినా ఆరువందలదాక చిల్లరబాకీ ఇంకా అలాగే మిగిలింది. వెంకయ్యకు ఇంక చెరవదలలా. ఒకనాడు రాత్రి ఆవుల్ని, ఎడ్లను అమ్మితానని భార్యతో చూచాయగా అన్నాడు.

"ఇంకా నయం. రేపు బిడ్డల్నికూడా అమ్మితామంటారు. అమ్మరూమరి." అంది లక్షమ్మ.

"బాకీల తొందర యెక్కువైతే యేమిచెయ్యను ?"

---

"ఏమన్నా చెయ్యండి కాని, గొడ్లనుమాత్రం అమ్మొద్దు....అంతగా అయితే ముందు పంటకల్లాల్లో తీర్చుకోగూడదా ?"

"రేగడచేను అమ్మేస్తే యింకా యెన్నివందల పుట్లొస్తా యనుకొంటున్నా ?"

లక్షమ్మ వెంటనే మాట్లాడలేకపోయింది.

"ఈనాడు అమ్మిన పొలం మూడేళ్ళనాడే అమ్మితే ఇంత బొందనపడేవాళ్ళం కాదుగా." భార్య ముక్కు చీదుకొన్నది.

"కర్మ యిలా నెట్టుకొస్తుందని ఎవరనుకొన్నారు ? పంటమీద బాకీలు తీరుతా యనుకొన్నాను."

"ఇంతకూ మాకర్మ అలావుంటే మిమ్మల్నని పనేముంది ?" లక్షమ్మ పైటకొంగుతో కళ్లొత్తుకొన్నది.

వెంకయ్య ఈ దుస్థితికి కారణం తన కర్మే ననుకొని, నెపం అంతా దానిమీదనే పారేసి విశ్రాంతుడైనాడు ; కాని లోకం అంతటితో వదులుతుందా ?

ఓడంటే అంతా ఓడే నంటారు. పొల మమ్మిన సంగతి పొక్కగానే బాకీదారులు మరీ తొందరపెట్టసాగారు. ఎన్ని అప్పులు లేనిదే ఎనిమిదెకరాల పొల మమ్ముతాడు ? అప్పులు తీరిపోయేటట్లుంటే అంత చాటుగా అమ్మవలసిన పనేమి వచ్చింది. తప్పకుండా ఎంతో అప్పు ఉండివుండాలి. ఈ పూహ తట్టగానే ఋణదాతలు మరీ రేగారు.

దానితో ఆసామికి నిప్పులమీద పొర్లాడుతున్నట్లయింది. ఒకరోజున ఎడ్ల బేరగాళ్లు వస్తే 350 రూపాయలు పుచ్చుకొని ఎద్దునూ, గిత్తనూ, తలతాళ్ళతోనే తోలిపెట్టాడు. చొప్ప తేవటానికి ఇంట్లోకి వెళ్ళితే లక్షమ్మ పడనిస్తుందీ ? అందువల్ల దొడ్లోవాళ్ళను దొడ్లోనుంచి గుప్పుడు చప్పుడు కాకుండా పంపించివేశాడు.

వచ్చిగడ్డి తేవటానికి వెళినరాఘవులు ఆనాడు మోయరాని మోపు వేసుకొని చెమటోడ్చు కొంటూ ఆలస్యంగా వచ్చాడు. పచ్చిమేత వేదామనిపోతే యెడ్లులేవు. అతని గుండె గుభేలు మంది. అవి ఎప్పుడన్నా ఊడదీసుకొన్నా దొడ్డి వదలిపోయే మచ్చుకాదు. ఇక ఆసామి అంటేను యెక్కడన్నా మొగమోటం ఉంటుందేమోకాని ఎడ్లదగ్గరమాత్రం ఉండదు. ఒకవేళ అంతగా కాదనటానికి వీలులేకపోతే రాఘవుల్ని యిచ్చి తోలిపెట్టేవాడు.

ఎడ్లు నేదేమైనట్టు ? తొందరపనివుండి దొరే బండికట్టుకు వెళ్ళాడేమోనని రాఘవులు చూచాడు. బండి, చిరతలు చావట్లోనే వున్నాయి. నాగలి, పట్టెళ్ళు వారణకూడా ఎప్పటి చోటనే వున్నాయి. గొడ్లు పచ్చిమేతకోసం తాళ్లు లాక్కొంటూ గందరగోళం చేస్తున్నా, అతడు గబగబా లక్షమ్మదగ్గరకు పరుగెత్తుకెళ్ళి "ఎడ్లు ఎవరు తోలికెళ్ళారు," అని అడిగాడు.

"చావిట్లో లేవురా ?"

"లేవే"

"మీ దొర బండి కట్టుకెళ్ళాడేమో."

"బండి చావిట్లోనే వుంది," అని రాఘవులు కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళి దొడ్లో నడిమధ్య చతికిలబడ్డాడు.

లక్షమ్మకూడా చేతిలోని పాలచెంబు దాయతాడు నట్టింటపడేసి "ఎడ్లున్నాయటరా," అంటూ అదరాబాదరా దొడ్లోకి వచ్చింది. సూదైతేగా ఉన్నా కనిపించకపోవటానికి ?

"ఎడ్లు ఎక్కడికో తప్పించుకుపోయాయని మీ నాన్నను పిల్చుకురారా," అని అప్పుడే వచ్చిన పెద్దకొడుకును పంపించింది.

"నాన్న లైబ్రరీ అరుగువద్ద లే"దని కొడుకు వెళ్ళివచ్చి చెప్పాడు.

అంతలో బాగా చీకటిపడ్డది. లక్ష్మమ్మ తిల్లికపెట్టి చిట్టాడికి పాలచెంబు, దాయతాడు ఇచ్చి రాఘవుల్ని దూడనిడవమని చెప్పిపంపింది. జీతగాడు చావట్లో బండికింద గడ్డి వనమీద పండుకొని మాట్లాడలేదు. లక్ష్మమ్మకూడా వచ్చి బ్రతిమాలింది. మందలించింది. కోపపడ్డది. లాభంలేకపోయింది. పెద్దకొడుకును విడవమన్నది. వాడు తనవల్ల కాదన్నాడు. ఆదుది తానెలా అవుపాలు తీస్తుంది? భర్తకోసం ఎదురుచూచింది. ఎంతసేపటికీ రాలేదు. ఆవు, కోడెదూడ దొడ్డి దద్దరిల్లేట్టు అరుస్తున్నాయి.

లక్ష్మమ్మ మనస్సు కటకటపడ్డది. చివరికి తెంపుచేసుకొని తానే దూడపలుపు తప్పించి రాఘవుల్ని అన్నానికి పిలిచింది. వాడు కదల్లా, మెదల్లా. పెద్దకొడుకును పిలిచింది. వాడు మొదట్లో బెట్టుసరి పోయినా, చివరికి ఎలాగైతేనేం రెండుముద్దలు తిన్నాడు. నిద్రవస్తున్నదని చిట్టాడు తొందరించాడు. పక్కగుడ్డలకోసం గదిలోకి వెళ్ళితే మంచంమీద భర్త ముసుగు పెట్టుకొని మూలుగుతున్నాడు.

పక్కగుడ్డలు పట్టుకెళ్ళి యిద్దరి కొడుకులకు పక్కవేసి పండుకోమని లాంతరుతో గదిలోకివెళ్ళి "సుస్తిగావుందా ఏమిటి?" అని భర్త కణతలమీద చెయ్యివేసింది. ఆమె వేళ్ళమీద వెచ్చని నీళ్ళు పడసాగాయి. ఆమె వులిక్కిపడింది.

"జ్వరం వచ్చినట్లుందే."

"లేదని వెంకయ్య మూలిగాడు."

"సరే, అన్నీ బాగానే కుదిరాయి. ఎడ్లుకూడా ఎక్కడికో తప్పించుకు పోయాయి."

వుండి వుండి "నేనే అమ్మివేశాను," అని వెంకయ్య నిట్టూర్పు విడిచాడు.

లక్ష్మమ్మ కొయ్యబారి కాసేపు అలాగే నిలుచున్నది. ఆమె నోటినుంచి పల్లెత్తుమాట రాలా. తరువాత ఆ లాంతరుతో చావట్లోకివెళ్ళి రాఘవులకు దూరంగా చతికిలబడి "ఎడ్లను మీదొరే అమ్మాడట," అని చెప్పింది.

రాఘవులు ఉలకలా, పలకలా. అతనిచూపులు వాసాలు చూస్తున్నాయి. లక్ష్మమ్మ ముక్కుచీదుకొంటూ కుటుంబ స్థితిగతులు, బాకీలసంగతి అంతా పూసగుచ్చినట్లు చెప్పింది.

"ఆయనమాత్రం ఏమిచేస్తాడురా, మాకర్మ అలావుంటే? మాపాపం బద్దలైంది నువ్వుమాత్రం ఎలా అడ్డుపడుతా? లే, మా నాన్నగా, లే! రెండుముద్దలు తిందుగాని! పగలల్లా రెక్కలిరుచుకొన్నావు, ఎంగిలిపడకపోతే తెల్లారిపాటికి శోషకొస్తుంది. లే అమ్మా లే!"

"నా కర్మకుమాత్రం మీరేమి చేస్తారులెండి," అన్నాడు రాఘవులు.

లక్ష్మమ్మ ఎన్నిచెప్పి రాఘవుల్ని తిండికి పిల్చుకెళ్ళలేకపోయింది. ఆమెకూడా తిండి సయించక దిగులుతో చిట్టాణ్ణి ఎదురుబార కదుముకొని పండుకొన్నది.

ఆ రాత్రి రాఘవులకు శివరాత్రి అయింది. గత జీవితమంతా అతని కళ్ళముందు సినిమా ఆడింది. ఇంతకాలం తాను ఎంకయ్యదగ్గర ఎందుకుంటున్నాడు? ఇన్నేళ్ళనుంచి చెమటోడ్చి పోస్తున్నాడే? దానివల్ల ఏమివచ్చింది? ఆసామన్నా బాగుపడ్డాడా అంటే అదీలేదు. తనకేమన్నా మిగిలిందా? లోపలి ప్రేవులుమాత్రం బేవు బేవుమంటున్నాయి. అయితే

యీచాకిరి దేనికి ? మరొక రైతుదగ్గరచేస్తేనో ? ఇంతకన్నా వచ్చేదేముంది ? అయినప్పుడు యీచేసెరుగనిపాటు దేనికి ? కడుపుకోసం. కేవలం పొట్టకోసమేనా ? అందుకోసమేనా తానిన్నాళ్ళు బ్రతికింది. ఇలాంటి బ్రతుకు బ్రతకకపోతేనేమి ? ఏదేవుడేడ్చాడు ?

ఇంతకూ తానుకోరుతున్న దేమిటి ? ఎడ్లూవ్యవసాయమేగా ? అందులో సందేహంలేదు. తానింతకాలం మేపి పని కలవార్చిన గిత్త పోయిందనేగా యింత కటకటపడుతున్నది. కాబట్టి తనకు ఎడ్లు, చేతినిండా వ్యవసాయం సలక్షణంగా వుంచేచాలు. దానితో తాను సంతృప్తి పడగలడు. తనజీవితం సుఖంగా వెళ్ళమారిపోయిందే. తన రెక్కలు, స్వాతంత్ర్యం అమ్ముకొన్నా యివి ఎందుకు దక్కటంలేదు ?

రాఘవలుకూడా దీని బాధ్యత కర్మమీదనే వేశాడు; కాని ఇంతకాలంవించీ అతన్ని బంధించి ఉంచిన బంధనాలను అతనికి తెలియకుండానే కోసివేయబడ్డాయి. పోతే ఇక వాడు ఇక్కడే ఎందుకు ఉండాలి ?

ఆ రాత్రి అతనికి కునుకువట్టలా. ఆలోచనతోనే తెల్లవారింది. లేచికాలకృత్యాలు తీర్చుకొని, ఉదికినగుడ్డలు కట్టుకొని, విడిచినవి మూటకట్టి ములుగర్రకు తగిలించుకొన్నాడు. నేరుగావెళ్ళి లక్షవమ్మను పిలిచాడు. ఆమె వెంట పెద్దదొర, చిన్నదొర, చిట్టాడు దొడ్లోకివచ్చి రాఘవుల వాలకంచూచి కొయ్యబొమ్మల్లాగా నిలబడ్డారు.

"వెళ్ళుతున్నానమ్మా ?" అని రాఘవులు తలవంచుకొన్నాడు.

"యీడకిరా ?" లక్షవమ్మ విస్తుపోయి అడిగింది.

"ఇంతవరకు ఫలానిచోటికని అనుకోలేదు."

"మీ బాబుదగ్గరకు వెళ్ళుతావా ?" అన్నాడు వెంకయ్య.

"పోను."

అతని ధోరణిచూచి ఎవరూ మాట్లాడలేకపోయారు.

"అయితే అన్నంతినిపోరా, రాత్రికూడా తినలేదు," అని లక్షవమ్మ అడ్డుతగిలింది.

అంతలో కోడెదూడ చెంగనాలు తీసుకొంటూవచ్చి రాఘవుల గోచి చెంగుపట్టుకొన్నది.

"వద్దులేండి, ఆమాటే చాలు."

"బాబూ నామాట వినరా" లక్షవమ్మ రాఘవుల గడ్డం పట్టుకొన్నది.

"కాదులేండి. వస్తాను." రాఘవులు దూడ నోట్లోనుంచి పంచెకొంగు లాక్కొన్నాడు.

చిట్టాడు బావురుమన్నాడు. ఆ కోడెదూడ అరిచింది. దానితో దొడ్లో ఆవులన్నీ ఒక్కసారిగా అంబా అన్నాయి.

అయినా రాఘవుల కాళ్ళకు పశువుల అరువులు నాడు బందాలు వేయలేకపోయాయి.



# ఒక ఘట్టం

నా చిన్నతనంలోని కొన్ని ఘట్టాలు నా కిప్పటికీ జ్ఞాపకమున్నై. నా తలిదండ్రులకు, అనేక సంవత్సరాలు, వారు చేసిన నోముల ఫలితంగ కలిగిన సంతానం నే నొక్కణ్ణే. చిన్నతనంలోనె పెద్దలు నన్నొక దురదృష్టవంతునిగ పరిగణించారు. దానికి తగిన కారణాలు లేవని నే ననను.

ఆ రోజు నాకు అక్షరాభ్యాసం చేయాలనుకొన్నారట. కావలసిన సన్నాహాలన్నీ చేయబడినై. ఉదయం 9-30 కి ముహూర్తం. ప్రొద్దున్నే మామిడాకులకోసం నా తండ్రి ఊరివెలుపల నున్న తోటలలోకి వెళ్ళారట. ఏడు గంటలయింది; ఎనిమిది గంటలయింది- మా నాన్న తోటనుంచి తిరిగి రాలా. ఇంత ఆలస్యం చేయటానికి కారణమేమిటా - అని కొందరు ఆయనకోసం బయలుదేరారు. రెండుమూడు తోటలలో వెతగ్గా 'భజగోవిందు' గారి తోటలో నా తండ్రి మృతుడై పడి ఉన్నాడట. తీరా పరిశీలించి చూచేసరికి పాముకాటు వల్ల చనిపోయాడని తేలిపోయింది. చనిపోయినవాడు నా తండ్రి. చంపింది పాము. మధ్య నన్నాడిపోశారు ఇరుగూ పొరుగూ - తమ సానుభూతిని జూపుతూ: నే పుట్టిన నక్షత్రమే మంచిది కాదన్నారు కొందరు. "ఈ వెధవ పుట్టక పోయినా బాగుండు. పాపం! ఆ యిల్లాలి గోడు చూస్తే కడుపు దహించుక పోతుంది" అన్నారు మరి కొందరు.

అప్పులవాళ్ళు ఊడగొట్టగా మిగిలిన రెండెకరాల పొలం; ఒక చిన్నయిల్లు— మాకుండిన సర్వసంపదలు. తెలిసిన వారిలో కొందరిని వేడి అప్పుదీసికొని రెండు బఱ్ఱెలను కొని ఒక హోటలుకు నమ్మకంగ పాలు పోస్తూ నా తల్లి - రెండేళ్లలో ఆ అప్పును తీర్చేసి దాదాపు 36 రూపాయలను కూడ బెట్టగలిగింది.

ఆ రోజుల్లో మా ఊళ్ళో "ఫలానా అతను చదువుకొన్నాడు." అంటే తక్షణం "ఎంత దూరం?" అనేవారు. ఈ 'దూరం' ఎంతయినా ఉండవచ్చు. ఈ దూరం అప్పుడప్పుడు 'లండన్' దాక కూడ పోతూంటుంది:

ఈ దూరం ప్రకారం మా ఊళ్ళో మద్రాసుదాక చదువుకొని వచ్చిన ఓ వెంకటరెడ్డి ఉన్నాడు. ఆయన దినానికి ఎలాలేదన్నా 25 తూర్లు తీరిగ్గా అద్దంముందు నిలుచుకొని 'క్రాపు' దువ్వుకొనేవాడు. అతని అసలు "క్వాలిఫికేషన్" అతడికీ, ఆ యిచ్చిన మహానుభావునికే తెలుసు; కాని మా ఊళ్లో, ఎవ్వరికీ తెలియదు. ఈ దువ్వడంవల్ల చెదరని అతని 'క్రాపింగు', మా పల్లెలోని ప్రజలకు - అతడు ఇంకా 'దూరం' చదువుకొని వచ్చాడేమో నన్న భ్రాంతిని కూడా కలుగజేసేది.

నా తల్లిదృష్టంతా నేను ఇంగ్లీషు చదువుకోటం మీదుంది. ఆ వెంకటరెడ్డి నాకు

'చారి'

గురుదేవు డయ్యాడు. ఒకనాడు "ఏయ్! నారాయణా" అని నన్ను పిలిచాడు.

"ఏమయ్యా?" అన్నాను విధేయతతో.

"అయ్యగాదు; కొయ్య. 'సార్' అన్రా: దొంగ నాయా...."

మద్రాసుదాక చదివిగూడ మా సార్ ఆ "దొంగ నా...." భాష మరచిపోలా. ఆ రోజు నుంచి ఊళ్ళోవి పిల్లలంతా అతణ్ణి "సారు, సారు" అనడం ప్రారంభించారు. ఆయన చాలా ఆనందించాడు కూడా.

క్రమంగ రెండేళ్లు గడచినై. రెడ్డిగారి చలవ వల్ల వళ్ళు గట్టిపడింది. చేసిన ప్రతి తప్పుకూ "ధభా–ధభా" మని వాయించడమే మా సారు పని. ఈ మాత్రం శిక్షనుకూడా అనుభవించలేని వారంతా, ఆ చదువుకు నమస్కరించగా-మిగిలిన శిష్యబృంద మంతా నేనొక్కణ్ణే మా సారుకు:

మొదట నాకూ కష్టంగానే ఉండేది—ఈ "ధబధబ"ను రుచి చూడడానికి. ఒకనాడు నా తల్లివద్దకు పోయి:- "అమ్మా! మా సారు చూడే ఎంతగ గొట్టాడో." అంటూ ఆమెకు కనికరం కలుగుతుందేమోనని కొంతగట్టిగ ఏడ్చాను. నన్నోదారుస్తూ:-"ఆమాత్రం దెబ్బ లన్నా తినకుంటే సదు వెట్లొస్తుంది నాయనా!" అంది నా తల్లి. నేను చదవనీ, చదవక పోనీ-దెబ్బలు తింటూంటె క్రమంగ అదే వస్తుంది: అన్న దృఢమైన విశ్వాసం కలిగింది - నా లేత హృదయానికి. ఆ నాటి నుంచి మా 'సారు' చావబాదనీ; ఏడ్చేవాణ్ణి కాను.

ఒకనాటి రాత్రి మా సారు:—

"ది ర్యాట్ ఈజ్ ఆన్ ది మ్యాట్." అంటూ ప్రారంభించి - సర్వశక్తులను విని యోగించి ఆ వాక్యాన్ని వర్ణించి, ప్రతి పదార్థం చెప్పి అడిగారు.

"చాపమీద ఏముంది? ఇంగ్లీషులో జెప్పు"

"ది మ్యాట్." అన్నాను ఉత్సాహంగా.

ప్రతిధ్వనించేలాగ "ధభా" మని వీపుమీద వాయించాడు. మామూలుగ పడేవాటికన్న కొంచెం తక్కువ రకంగానే తోచింది. ఇంకో తూరి దాన్ని వివరించి:- "చాపమీద ఏముం ది? తెనుగులో జెప్పు." అన్నారు.

"ఎలక సార్"

"గుడ్. ఇపుడు బాగ అర్థమయిందా?"

"ఊ సార్."

"మ్యాట్ అంటె అర్థమేం?"

"ఎలక సార్."

అకస్మాత్తుగ ఎవరన్నా ఒకని ముక్కు, నోరు, చెవులు - మూసేస్తే, ఊపిరాడక అత నెంత బాధ ననుభవిస్తాడో - నా ప్రత్యుత్త రంతో మా సార్ అంత బాధ ననుభవించాడు.

కాని అది ఒక క్షణమే. ఆతర్వాత ఆయన పిడికిలి బిగబట్టి నా ముక్కు చదునుచేశాడు. ఆ దెబ్బతో నా ముక్కు బెదిరి చొక్కా అంతా నెత్తురయింది. ఇంటికిపోయి మా అమ్మతో కంప్లెంటుకూడా చెయ్యలేదు.

చెయ్యవలసిన అవుసరమేముందీ? ప్రత్యక్ష ప్రమాణం కనపడుతూ ఉంటే!

మర్నాడు నేను బళ్ళోకి పోవటానికి పలకా పుస్తకాలకోసం వెదికాను. కనిపించలేదు! మా అమ్మను అడిగాను. "వచ్చిన చదువు చాల్లే, ఇక మానుకో" అంది.



# అనువాద సాహిత్యం

దండెత్తి వొచ్చిన సైన్యం ఫ్రాన్సులో ప్రవేశించినప్పటినుంచీ—మానవజాతిలో తనకన్న దౌర్భాగ్యుడు లేడని - వాల్టర్ తలిచాడు. అతను లావుగా ఉండటంవల్ల అతికష్టంతో నడిచేవాడు ; త్వరలోనే ఆయాసంవొచ్చేది. బొద్దుగా, లావుగా ఉండేకాళ్లు బాగా నెప్పిచేసేవి. ఇవిగాక అతనికి శాంతిమీదా, దయమీదా, ఎక్కువ ఇష్టం. ఒళ్లూ పై తెలియకుండాచేసే రక్త స్రావంమీద అతనికి గొప్ప హేయభావం ఉండేది. నలుగురు బిడ్డల తండ్రిగా అతను ఇంటిదగ్గర అనుభవించే ఆనందమూ, యవ్వనంలోవున్న అందమైనభార్య ఆదరింపులూ, ఆమెముద్దులూ, కౌగిళ్ళూ - ఇవేమీ లేకుండానే అతను ప్రతి సాయంత్రమూ గడపాల్సి వొచ్చింది. రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమించి, ఉదయం ఆలస్యంగా మేల్కొవటమూ, కొంతకాలాన్ని సారాకొట్లో స్నేహితుల్తో కబుర్లుచెప్పుకుంటూ కులాసాగా గడపటమూ, మంచిరకం ఆహారంతో శరీరాన్ని పోషించటమూ - వీటికి అతను బాగా అలవాటుపడి వున్నాడు.

తనజీవితంలోని మంచి రోజులన్నీ వెనుకనే గడిచిపోయి నయ్యని అతను భావించాడు ; ఫిరంగులూ, తుపాకులూ, రివాల్వర్లూ, కత్తులూ, తుపాకుల చివరవుండే పదునైన బాకులూ - వీటిమీద, భయంతోకూడిన గొప్ప హేయభావం అతని హృదయంలో వృద్ధిపొందింది. తుపాకిచివరవుండే బాకు అంటే అతనికి మరీభయం. అది తనపెద్ద పొట్టలోకి తేలిగ్గా, మెత్తగా దిగబడి పోతుందని అతనికి గట్టినమ్మకం.

రాత్రిపూట దుప్పటికప్పుకొని, మిగతా సిపాయిల్తోపాటు కటిక నేలమీద పడుకున్నప్పుడు- ఇంటిదగ్గరి తన కుటుంబాన్నిగూర్చీ, తనకుకలిగిన యీ క్షణక్షణ ప్రాణగండాన్ని గూర్చీ - అతను తీవ్రంగా గంటల తరబడి ఆలోచించేవాడు. తను చంపబడ్డట్టయితే ఇంటిదగ్గర తన పిల్లలగతి ఏంకాను ? వాళ్ళను ఎవరు పోషించి పెద్దవాళ్ళను చేస్తారు ? కుటుంబ సౌఖ్యం కోసం తను అప్పుచేసి కొంతడబ్బు ఇంటిదగ్గర ఇచ్చాడు ; ఐనా అది వాళ్ళకు పెద్ద ఆధారంగా వుంటుందనేందుకు వీల్లేదు. కొన్ని సమయాల్లో వాల్టర్ ఏడ్చేవాడు.

యుద్ధం ఆరంభమైనప్పుడు అతని కాళ్ళల్లో శక్తిపోయి బలహీనంగా వుండేది. నేలమీద చచ్చిన వాడిలాగు పడిపోదా మనిపించేది - కాని అలాచేస్తే తన వెనుకవున్న సైన్యం అంతా తన మీదినుంచే నడిచిపోతుంది. తుపాకీగుళ్ళు వడిగా దూసుకుపోతూ చేసేశబ్దానికి అతని తలమీది వెంట్రుకలు ఒంటికాలిమీద లేచి నిలబడేవి :

---

## యుద్ధఖైదీ

### మొపాసా

---

ఇప్పటికి కొన్ని నెలలనుంచీ అతను భయంతోకూడిన యీ జీవితాన్ని గడుపుతున్నాడు. అతను పనిచేసే సైన్యం నార్మండీవైపు సాగింది. ఒకనాడు అతను కొద్దిపటాలంతో - ముందున్న ప్రదేశాన్ని తణిఖీచేసి వెనక్కు వొచ్చేందుకు పంపబడ్డాడు. ఆ ప్రదేశమంతా షుహా శాంతిమంతంగావుంది; ఎట్టి ఆటంకమూ వారికి కనబడటంలేదు.

జర్మనులు నిరాటంకంగా హాయిగా ఒకలోయవైపు నడుస్తూండగా - పెద్దమోతతో తుపాకులు మోగినయి. వాటిలో ఇరవైమందిలో కొంచెంసేపు అసలు చలనమే లేకపోయింది. కాస్సేపటికి - పక్కనేవున్న చిట్టడవిలోంచి కొంతమంది అడివిజాతి పటాలంలోని సైనికులు ఉరికి - తుపాకుల చివరవుండే దళసరి బాకుల్ని జర్మన్లవైపు తిప్పిపెట్టి పరుగెత్తుకుంటూ రాసాగారు.

మొదట అమిత ఆశ్చర్యంవల్ల వాల్టర్‌కు పరుగెత్తుదామనే అభిప్రాయంకూడా కలగలేదు. తరువాత పారిపోదామనే పిచ్చికోరిక అతనిలో గాంఢంగా పనిచేసింది. కాని తను వడిగా పరుగెత్తలేడు. సన్నగావున్న ఫ్రెంచివాళ్ళు మేకల్లాగు వడిగా, తేలిగ్గా, ఎగురుకుంటూ తమకు దగ్గరవుతున్నారు. వాళ్ళతో పోలుస్తే తనది తాబేటి నడక అవుతుంది. అతనికి కొద్దిదూరంలోనే దట్టంగా పెరిగిన చెట్లతోనూ, ఎండుటాకులూ, చెత్తా చెదారంతోనూ నిండిన ఒకపెద్ద గొయ్యివుంది. దాని లోతునుకూడా చూడకుండా - వొంతెన మీదనుంచి నదిలోకి దూకినట్టు - వాల్టర్ రెండుకాళ్ళనూ దగ్గరికిజేర్చి దభీమని దూకాడు.

దట్టంగా పెరిగిన పాకుడు మొక్కలూ, కొన్ని వెదురుపొదలూ వాల్టర్‌ముఖాన్ని చేతుల్ని గాయపరిచినయ్. దూసుకుపొయ్యే బాణంలాగు వాల్టర్ ఎక్కడా ఆగకుండా దభీమని కిందవున్న రాళ్ళమీద పడ్డాడు.

వాల్టర్ పైకిచూశాడు. ఇప్పుడే తనవల్ల ఏర్పడ్డ కంతకుండా ఆకాశం కనిపించింది. ఈ కంతే తనకు కొంత శాంతినికూడా ఇస్తోంది; ఇందులోంచే తను తరువాత మెల్లిగా బైట పడవొచ్చు. యుద్ధభూమికి దూరంగా వుందామనే ఉద్దేశంతో - అతను కాళ్ళమీదా చేతులమీదా పాకుకుంటూ ఆ పెద్దగోతిలోని అవతలి భాగానికిజేరి పొడుగ్గా పెరిగిన గడ్డి పక్కన - కుందేలులాగు - ముడుచుకొని కూర్చున్నాడు.

తుపాకీగుళ్ళ శబ్దమూ, ఏడుపులూ, పెడబొబ్బలూ కొంతసేపు వినిపించినయ్. ఆ శబ్దం క్రమ క్రమంగా దూర దూరంపోతూ కొంతసేపటికి ఆగిపోయింది. వాతావరణమంతా మళ్ళీ శాంతియుతంగా, నిశ్శబ్దంగావుంది.

రాత్రి ప్రవేశించింది. క్రమంగా ఆగోతిలో కటిక చీకట్లు కమ్ముకున్నయి. ఈ ప్రస్తుత పరిస్థితిని గూర్చి వాల్టర్ ఆలోచించ సాగాడు. తను ఏం చెయ్యాలి? తను ఏమౌతాడూ? మళ్ళీ తను సైన్యంలోకి వెళ్ళటమా?.... వెళ్తే మంచిదే; కాని ఎట్లా? ఎక్కడికని పొయ్యేట్టూ? ఈ యుద్ధంలో జేరినప్పటినుంచీ - భయంతో, ఆయాసంతో, బాధతో తను

గడిపిన భయంకర జీవితం మళ్ళీ ప్రారంభమవుతుంది. మళ్ళీ సైన్యంలోకి వెళ్ళేందుకు అతనికి ధైర్యం చాలలేదు. దారీ డొంకా లేకుండా యీ మైళ్ళమైళ్ళ ప్రయాణాల్తో ప్రయాసపడుతూ- క్షణక్షణ ప్రాణగుండాన్ని ఎదుర్కొనే అపాడు జీవితం - తనకిక వొద్దనే వొద్దు!

కాని తను ఏంచేసేట్టూ? ఈ యుద్ధం అయ్యేదాకా ఇక్కడ యీగోతిలోనే ఉండటం అసంభవం! ఒక్క భోజన సదుపాయంతప్ప మిగతావన్నీ ఇక్కడ అనుకూలంగానే వున్నయ్; కాని తను రోజూ - ప్రతిరోజూ - భోజనంచేసి తీరాల్సిందే!

తనను కాపాడే వాళ్ళందరికీ దూరంగా - ఈ శత్రుభూమిలో తను - యూనిఫారంలో, ఆయుధాలతో - ఒక్కడేవున్నాడు. తనలోని కండరాలకుకూడా చలనంకలిగి అవ్వి పైకి పాకుతూన్నట్టు అతనికి తోచింది.

ఉన్నట్టుండి అతనికొక ఆలోచన తట్టింది. తమ శత్రువులచేత వొక యుద్ధ ఖైదీగా తీసుకోబడితే! ఈ అభిప్రాయం అతనిలో బలంగా పనిచెయ్యసాగింది. ఖైదీ! తను నిరపాయకంగా హాయిగా ఖైదులోవుంటాడు. భోజన సదుపాయం సక్రమంగా వుంటుంది. ఈ తుపాకీగుళ్ళనూ, కత్తుల్నీ, బాకుల్నీ తను ఎదుర్కొ నక్కర్లేదు. చుట్టూ చాలామంది తనను రక్షిస్తూంటారు. తనకిక ప్రాణభయమే వుండదు. తనుఖైదీగా తీసుకోబడటం! ఎంత ఉజ్వలమైన కల!

వెంటనే అతనొక నిర్ణయానికి వొచ్చాడు. తనకుతానై శత్రువుకు చిక్కుతే -!

ఇక ఒక్కక్షణంకూడా వృధాచెయ్యకూడదని - తననిర్ణయం కార్యరూపానికి తీసుకు రావాలని చప్పునలేచి నిలబడ్డాడు. వెంటనే మరికొన్ని కొత్తభయాలు మనసులో ప్రవేశించి - అతనిలో చలనంలేకుండా చేసినయ్.

తను ఖైదీగా చిక్కటం ఎక్కడ? ఎట్లా? కొన్ని రూపాలు - వికృతాకారాలు - బహుశా మృత్యుదేవత భయంకర అవతారాలు అతని కళ్ళముందు ఆడి, అంతరాత్మను కెలకసాగినయ్.

తుపాకిని ముందుకు జాచి పట్టుకొని - ప్రాణానిక్కూడా తెగించి - పొలాలగట్టునపడి పరుగెత్తుతే -?

తనకు కొంతమంది కర్షకులు ఎదురైతే? దారితప్పిన జర్మన్ సైనికుణ్ని ఒంటరిగాచూచి- వాళ్లు పిచ్చికుక్కను బాదినట్టు తనను బాది చంపటం తప్పదు! తమ గునపాలతోనూ, పారలతోనూ, కొడవళ్ళతోనూ తనను ముక్కలు ముక్కలుచేసి పారేస్తారు! తనశరీరాన్నంతట్నీ మరామత్తుచేసి - అంతా ఒక్కటే పెద్ద మాంసంముద్దగా తయారుచేస్తారు!

ఒకవేళ అడివిజాతులే తనకు ఎదురైతే -? సంస్కారమూ, చట్టమూ లేనివాళ్ళు - అడివి జంతువును తమాషాకు వేటాడినట్టు తనలాటి నిర్భాగ్యుడి ఎద్దుమొద్దు స్వరూపాన్ని ముక్కలు ముక్కలుచేస్తూ ఒకడికి పదిమందిగా నవ్వి ఆనందించి కాలాన్ని చంపుకుంటారు!

ఒకగోడకు తను కట్టబడ్డట్టూ - పది తుపాకులు తనపై పే గురిచేయబడ్డట్టూ, ఆపది నల్లటి బుల్లి రంధ్రాల్ని తను చూస్తునట్టూ భావించి - అతను కంపించాడు.

ఒకవేళ మొత్తం ఫ్రెంచి సైన్యాన్నంతట్నీ తను ఎదుర్కోవాల్సివాస్తే? తనొక వేగుల వాడని తలిచి ఎవడోవొక సిపాయి తనను ఒక్క దెబ్బకుకాల్చి పారేస్తాడు. వాణ్నిచూసి మిగతావాళ్ళుకూడా అదేపనిచేస్తారు. యుద్ధభూమిలో తను నిలబడ్డట్టూ, తుపాకీగుళ్ళు ఒక్కొక్కటే తనకండరాల్ని ఛేదించుకుంటూ అతివడిగా సాగిపోతున్నట్టూ భావించి - అతను తనలో తను కుంగిపోసాగాడు.

నిరాశతో అతను కూలబడ్డాడు. ఆశగొల్పే ఆలోచన ఏదీ అతని బుర్రలో తోచలేదు.

ఇప్పటికి బాగా చీకటిపడ్డది; నిశ్శబ్దమైన కటిక చీకటి: అతను కదిలేందుకు సాహసించ లేదు. ఆ చీకట్లో ఏమూలనుంచో వినబడే ప్రతిచిన్న శబ్దానికీ అతను వొణకసాగాడు. తన కలుగులోకి పోవాలని ప్రయత్నించే కుందేలు అతన్ని అదిరి పరుగెత్తేవరకూ తెచ్చింది. గుడ్లగూబల అరుపులు అతన్ని విపరీతంగా భయపెట్టినయ్; అతను బాగా దెబ్బలు తిన్నంతగా బాధపడ్డాడు. తన పెద్దకళ్ళను బాగా తెరిచి ఆ చీకట్లోకి చూసేందుకు ప్రయత్నించాడు; కాని అతనికేమీ కనిపించలేదు. ప్రతి క్షణమూ తను మనుష్యుడి కాలి చప్పుడు వింటూన్నట్టే భావించాడు.

ఇలా గంటల తరబడి భయంతో కూడిన బాధను అనుభవించాక—తెల్లవారుఝామున ఆకాశంలో తెల్లని కాంతిని అతను చూడగలిగాడు; ప్రాణ గండం నుంచి ఇప్పుడే బైటపడ్డ ట్టనిపించింది. అమిత శ్రమకు ఓర్చిన అవయవాలకు ఇప్పుడే విశ్రాంతి లభించినట్టుంది: అతని హృదయం శాంతించింది. అతని కళ్ల మూతలు పడసాగినయ్; అతన్ని క్రమంగా నిద్ర ఆవరించింది.

అతనికి మెలకువ వొచ్చేప్పటికి సూర్యుడు నెత్తిమీదికి వొచ్చాడు. అది మధ్యాహ్నమై వుంటుందని అతనికి తోచింది. ఆ వాతావరణంలోని శాంతిని ఏ శబ్దమూ భంగపరచటంలేదు. ఇప్పుడు వాల్టర్ అమిత ఆకలితో బాధపడసాగాడు.

పటాలంలో తనకు వేళకు ఇచ్చే మంచిరకం భోజనం గుర్తుకురాగానే అతని నోరు ఊరింది; అతని పొట్టలోని ఆకలి మంటలు బాధపెట్టసాగినయ్.

అతను లేచి అటూ ఇటూ తిరిగేందుకు ప్రయత్నించి, కాళ్ళల్లో, బలంలేకపోవటంవల్ల— మళ్ళీ ఆలోచించేందుకు నీరసంగా కూలబడ్డాడు. రకరకాల ఆలోచనలూ అతని బుర్రలో ప్రవేశించినయ్. రెండు మూడు గంటలవరకూ అతను తన గతినిగూర్చి ఆలోచించాడు; గాని ఏ ఒడ్డూ తేలలేదు.

చివరకు ఒక మంచి ఆలోచన—కార్యరూపంలో చేయగలిగేది, హేతువాదకమైనదీ తట్టింది. మెల్లిగా యీ గోతిలోంచి బైటపడి, ఏ పల్లెటూరి వాడన్నా—ఆయుధాలుకానీ, ఏ ఇతర ప్రమాదకరమైన పనిముట్టుకానీ లేకుండా ఎదురైతే—వెంటనే పరుగెత్తి అతనికి లొంగిపోవటం తనకు అన్నివిధాలా శ్రేయస్కరం, అని.

తన ఇనప కిరీటం తన నిజస్వరూపాన్ని బైటపెట్టి తనకు ద్రోహంచెయ్యొచ్చనే ఉద్దేశంతో దాన్ని తీసి అవతల పారేశాడు. మెల్లిగా పైకి పాకి, అతి జాగర్తగా తలను ఆ రంధ్రంలోంచి బైటికి పెట్టాడు.

మొదట అతనికి—దిగంతాల వరకూ ఒక్క ప్రాణికూడా కనిపించలేదు....ఎడంచేతి వైపున దూరంగా ఏదో పెద్ద మేడ తాలూకు స్తంభాలు కనిపించినయ్.

సాయంత్రంవరకూ అలా బాధపడుతూనే గడిపాడు. కాకులగుంపులుతప్ప అతనికేమీ కనిపించలేదు. తన పొట్టలోని గోలతప్ప అతని కేమీ వినిపించలేదు.

మళ్ళీ రాత్రి వొస్తోంది.

మామూలు స్థలం జేరి....క్రూరంగా బాధపడుతూ ఆకలి బాధపడేవాడి నిద్ర—చెడు కలల్తో కూడిన కలత నిద్రకు ఉపక్రమించాడు.

మళ్ళీ తెల్లవారింది. విషయాన్ని గ్రహించేందుకు వాల్టర్ మళ్ళీ రంధ్రద్వారాన్ని జేరాడు. ఆ వాతావరణమంతా అంతా నిన్నటిలాగే - వుంది. ఇప్పుడు వాల్టర్‌ను ఇంకో పెద్దభయం చుట్టుకుంది. జనరహితమైన యీ ప్రదేశంలో తను కూటికి మాడి చావాల్సిందేనా? ఆగోతి అడుగుభాగంలో వెల్లకిలాపడుకొని కళ్ళుమూసుకుపోయిన తన శవాన్ని చూసినట్టూ, రకరకాల పురుగులు మెల్లిగా తనదుస్తుల కిందినుంచిపాకి, శరీరంలో చిన్న చిన్న రంధ్రాల్నిచేస్తూ చల్లని తన మాంసాన్ని తింటూన్నట్టూ - ఒక పెద్దకాకి తన కళ్ళను పొడుచుకు తిన్నట్టూ - తోచి అతని తలతిరిగిపోయింది!

బలహీనంతో కదలలేక మూర్ఛపోతున్నట్లనిపించింది. దూరానకనిపించే ఆ మేడవైపు అమితమైన ధైర్యంతో పరుగెత్తి ప్రాణాన్ని రక్షించుకుందామనే ఆశకలిగింది. ఈసందర్భంలో తమ దేన్నయినాసరే, ఎవర్నయినాసరే ఎదుర్కొనితీరాలి!....దూరాన ముగ్గురు కర్షకులు చేతుల్లో పలుగుల్తో వెళ్ళటం కనిపించింది; అతను వెంటనే తన స్థానానికిజేరి, భయంతో ముడుచుకొని కూర్చున్నాడు.

కాస్త చీకటిపడగానే గోతిలోంచి బైటపడి - భయంతో ఆగుతూ, మెల్లిమెల్లిగా నడవ సాగాడు. ఆ గ్రామాన్ని జేరటంకన్న ఊరిబైటవున్న కనిపించే ఆ పెద్దమేడను జేరటమే అతనికి శ్రేయస్కరంగా తోచింది. గ్రామం అంటే - అతని దృష్టిలో పెద్దపులులు నివసించే ఒక పెద్దగుహ!

మేడ కిందిభాగంలోని కిటికీల్లో కొవ్వొత్తిదీపాలు వెలుగుతున్నయ్. ఒకకిటికీ పూర్తిగా తెరువబడేవుంది, అప్పుడే వండబడ్డ మంచిరకం మాంసపువాసన ఆ కిటికీలోగుండావొచ్చి వాల్టర్ నాశికా రంధ్రాల్లోదూరింది. నిరాశలో కనిపించే మొండిధైర్యం అతనిలో మేల్కొంది. అవశక్యంకాని వాంఛ అతనికి దాదాపు పిచ్చిఎక్కించింది.

ఆలోచనలేకుండానే - చప్పున కిటికీలోకిపాకి లోనికి చూడసాగాడు. ఆ తొందరలో తలమీద ఇనపకిరీటాన్ని తియ్యటంకూడా మరిచిపొయ్యాడు.

ఎనిమిదిమంది సేవకులు టేబిల్‌కుచుట్టూ కూర్చుని భోంచెయ్యబోతున్నారు. కాని ఉన్నట్టుండి ఒక సేవకురాలు - తనకు ఎదురుగావున్న దృశ్యాన్ని ఆశ్చర్యంతో నోరుతెరుచుకొనిచూస్తూ నిలబడిపోయి - చేతిలోని గాజుగ్లాసును జారవిడిచింది. మిగతా కళ్ళన్నీ ఆవైపుకే తిరిగినయ్.

వారందరూ శత్రువును చూశారు.

ఇంకేముంది - జర్మన్లు ఇంటిని ముట్టడించారు !

మొదట ఒక సన్ననిగొంతు మెల్లిగా అరిచింది; తరువాత ఎనిమిదిగొంతులు - ఒకదానికొకటి సంబంధంలేని స్థాయిల్లో అమితభయంతో పెద్దగా అరిచినయ్. టేబిల్‌దగ్గర చిన్న చప్పుడు పెద్దగోల - గది అవతలివైపునవున్న ద్వారందగ్గర పెద్ద గందరగోళం ! కుర్చీలన్నీ, బల్లలన్నీ, పడతోసుకుంటూ - అడ్డంవొచ్చిన స్త్రీలను తోసుకుంటూ పురుషులు పరుగెత్తి బైటపడ్డారు. రెండునిమిషాల్లో గదిఅంతా ఖాళీ అయింది. టేబిల్‌మీద అప్పుడే సిద్ధంచేయబడ్డ ఆహారానికి ఎదురుగా వాల్టర్ గుడ్లు మిటకరిస్తూ, ఆశ్చర్యపోతూన్నాడు.

ఒక్కక్షణం ఆలోచించి—కిటికీలోంచి మెల్లిగా లోనికి దూకి టేబిల్‌దగ్గరకు వెళ్ళాడు. ఆకలితో దాదాపు పిచ్చివాడుగా తయారవటంవల్ల - ఆ మంచిరకం ఆహారాన్ని చూసి, చలిజ్వరపు రోగిలాగు వణకసాగాడు. కాని అతనిలోని భయం ఇంకా పూర్తిగా మాయమవలేదు; అది అతనిలోని సగం శక్తిని అరికట్టింది.

జాగర్తగా వినసాగాడు; ఇల్లంతా గల్లంతుగావుంది. పైభాగంలో భయంతో పరుగులెత్తే, కాళ్ళచప్పుళ్ళు వినబడుతున్నయ్. ఈ గందరగోళాన్నంతట్నీ భయంతో వినసాగాడు. తరువాత మెత్తటి శబ్దాలు - మొదటి అంతస్థు మీంచి మనుషులు కింది మెత్తటి నేలమీదికి దూకినప్పుడు కలిగే శబ్దాలు - వినబడినయ్.

క్రమంగా తిరుగులాడే శబ్దాలూ, మాటలూ, గోల అంతా ఆగిపోయింది. ఆ పెద్ద ఇల్లు సమాధిలాగు నిశ్శబ్దంగావుంది.

తినేవాళ్ళకోసం ఎదురుచూసే భోజనంమీదికి వాల్టర్ ఉరికాడు. కడుపునిండకముందే ఎవరైనా అడ్డంవొస్తారేమోనని నోట్లో కుక్కుకోసాగాడు. బోనుతలుపులాగు తెరిచిపెట్టిన నోట్లోకి రెండుచేతులతోనూ భోజనాన్ని నెట్టసాగాడు. ఆ ముద్దలు ఒక్కొక్కటిగా కడుపులోకి దారితీసినయ్. నిండా గాలికొట్టినట్యూబు పగులుతుందేమోననే భయంతో ఆగిచూసినట్లు— వాల్టర్ మధ్యమధ్య కాస్త ఆగి పొట్ట చూడసాగాడు. సారాబుడ్లలోని సారాయిని గుటగుటా తాగాడు.

అక్కడవున్న ప్లేట్లనూ బుడ్లనూ ఖాళీచేశాడు. మస్తుగా తినివుండటంవల్ల లాగుగుండీలన్నీ, చొక్కానూ వొదులు చేస్తేనేకాని—గాలిని కాస్త తేలిగ్గా పీల్చేందుకు వీల్లేకపోయింది. ఒక్క అంగుళంకూడా వాల్టర్ కదలలేని స్థితికి వొచ్చాడు. అతని బుర్రలోకూడా సందేహీ

లేదన్నట్టు అది పనిచెయ్యటంలేదు. ముఖమంతా ఎర్రబడి, కునికిపాటు పడసాగాడు. రెండు చేతుల్నీ టేబిల్‌మీద ఆనించి, బరువాటి తలను చేతులమధ్య మోపి, కళ్లమూసాడు. క్రమంగా అతను లోకాన్నే మరిచిపొయ్యే నిద్రకు తలపడ్డాడు.

చల్లని గాలి హాయిగా వీస్తోంది. అది తెల్లవారుజాము, చాలా వీడలు నిశ్శబ్దంగా మెల్లిగా చెట్లసందున కదులుతున్నయ్. అప్పుడప్పుడు పదునైన ఆయుధాల్ని చంద్రకిరణాలు మెరిపిస్తున్నయ్.

నిశ్శబ్దంగావున్న ఆ పెద్ద మేడలోని కింది భాగంలోని రెండు కిటికీల్లో ఇంకా కొవ్వొత్తి దీపాలు వెలుగుతూనే వున్నయ్.

చప్పున ఒక కంఠం ఉరిమింది : "ముందుకు సాగండి; మేడను ముట్టిడించండి !"

క్షణంలో తలుపుల్లోనూ, కిటికీల్లోనూ మనుషులు కమ్ముకున్నారు. అడ్డం వొచ్చిన వాటన్నింటినీ నాశనంచేస్తూ ముందుకు సాగారు. శాంతంగా, హాయిగా వాల్టర్ నిద్రపోతున్న వంట ఇంటిలోకి యాభై మంది సైనికులు ఉరికారు. యాభై తుపాకుల్ని అతనివైపు గురిచేసి, మెల్లిగా అతన్ని ముట్టడించి, కిందపడేసి, నేలమీద దొర్లించి, గట్టిగా పట్టుకొని - అతని ఆపాదమస్తకాన్నీ గట్టితాళ్ళతో బంధించారు.

ఆశ్చర్యంతో వాల్టర్ మూగవోయాడు. అతనికి ఇదేమీ అర్థమవలేదు, తుపాకి మడమల్తో అతనుతిన్న దెబ్బలు బాగా భయపెట్టినయ్.

ఉన్నట్టుండి ఒక ఆజానబాహువు వాల్టర్ రొమ్ముమీది కాలువేశాడు; అతని యూనిఫారమ్ మీది బంగారపు అక్షరాలు అతన్నొక పెద్ద సైనికోద్యోగిగా తెలియపరుస్తున్నయ్. అతను అన్నాడు. "నువ్వు మాకు ఖైదీవి; లొంగిపో——"

వాల్టర్‌కు 'ఖైదీ!' అనే ఒక్కమాటే అర్థమైంది. "జా.....జా.....జా....." అని వాల్టర్ మూలిగాడు.

అతన్ని బలవంతంగాలేపి ఒకకుర్చీమీద కూర్చోపెట్టి జాగర్తగా వెతికారు. సైనికులందరూ భయంతోకూడిన కోపంతో అతనివైపు చూడసాగారు; చాలామంది యీ పోరాటంలో అలసిపోయి కూలబడ్డారు.

వాల్టర్ ముఖంలో చిరునవ్వు తాండవించింది. తను ఖైదీగా చిక్కగలిగాననే సంతోషం అతని ముఖంలో తాండవమాడుతోంది.

ఇంకో సైనికోద్యోగి వొచ్చి అన్నాడు; "కలొనెల్ ! శత్రువులు పరారైనారు. చాలమందికి గాయాలు తగిలివుంటయ్. ఈ ప్రదేశమంతా పూర్తిగా మనకు వశమైపోయింది."

కలొనెల్ ఫాలభాగాన్ని తుడుచుకుంటూ అన్నారు.

"ఈ రోజు మనది ! మనం జయించాం !" తరువాత జేబులోంచి చిన్న నోట్‌బుక్ తీసి ఇలా రాయసాగాడు.

"చాలా ఘోరంగా పోరాటం జరిగింది. జర్మన్లు గాయపడ్డవార్నీ, చనిపోయినవారినీ తీసుకొని పారిపొయ్యారు. ఒక యాభైమందన్నా చచ్చివుంటారు. చాలమంది మనకు ఖైదీలుగా చిక్కారు."

ఉద్యోగి అడిగాడు, "కలొనెల్ ! నేను చెయ్యాల్సిన సన్నాహాలేమిటి ?"

కలొనెల్ జవాబు చెప్పాడు. "ఇక మనం కాళ్ళకు బుద్ధిచెప్పటం మంచిది. లేకపోతే— వాళ్ళు ఫిరంగులతో అధిక సంఖ్యాకులుగావొచ్చి మనను ఎదుర్కొంటారు."

ఉద్యోగి వెంటనే బయలుదేరి వెళ్ళేందుకు ఆజ్ఞ ఇచ్చాడు. ఆ ఇంటి గోడలదగ్గర సైనికులు వరుసల్లో నిలబడ్డారు. ఆరుగురు సైనికులు వాల్టర్‌ను బంధించి - చేతుల్లో రివాల్వర్లతో కాచివున్నారు....ముందున్నదారిని చూసేందుకుగాను స్కౌట్, పంపబడ్డారు. ఏక్షణానికి ఏమౌతుందోనని భయపడుతూ, అక్కడక్కడ ఆగుతూ నడవసాగారు.

తెల్లవారేప్పటికి వారు మిలిషియాపట్టణం జేరారు. ఆ పట్టణ ప్రజ యీ సమాచారాన్ని విని వీరందర్నీ చూసేందుకు ఆతృతతో లేచి కూర్చున్నారు. ఖైదీ తలమీది ఇనపకిరీటాన్ని చూసేప్పటికి వారు ఒణికారు! స్త్రీలు తమ చేతుల్ని పైకి ఎత్తి ఫ్రెంచి సైన్యాన్ని అభినందించారు. ముసలివాళ్ళు ఏడ్చారు. ఒక ముసలివాడు కోపంతో రాయివిసిరి వాల్టర్ ముక్కుకు గాయంచేశాడు.

కలొనెల్ అరిచాడు: "ఖైదీ క్షేమాన్నిగూర్చి జాగర్త తీసుకోవాలి !"

జైలు దగ్గరకు వొచ్చాక, వాల్టర్ కట్లను విప్పారు. అతన్ని లోపలికి నెట్టి ఆ జైలుచుట్టూ రెండువందలమంది సైనికులు ఆయుధ సమేతంగా కాపలా కాయసాగారు.

వాల్టర్ కిందటిరాత్రి భోజనం కలిగించిన అజీర్తితో బాధపడుతున్నా - సంతోషంతో అతనికి కైపు ఎక్కింది. దయ్యంపట్టిన వాడిలాగు కాళ్ళనూ చేతుల్నీ విసరుతూ, అర్థంకాని మూలుగుల్తో నాట్యంచేశాడు. చివరకు అలిసి గోడకు ఆనుకొని నిద్రపొయ్యాడు.


అతనొక యుద్ధఖైదీ ! క్షేమంగా ఉండగలడు !

ఈవిధంగా ఆరుగంటల ఘోరయుద్ధంతో - ఫ్రెంచిసైన్యం ఛాంపిగ్నెట్ అనే ప్రదేశాన్నీ, ఆ ప్రదేశంలోని పెద్ద మేడనూ వశం చేసుకోగలిగారు. ఆనాటి యుద్ధంలో అమిత ధైర్య సాహసాల్ని చూపిన కలొనెల్ రాటియర్‌కు, విజయసూచికంగా అభినందిస్తూ - దేశీయ యుద్ధరంగంవారు ఒక బంగారు పతకాన్ని బహూకరించారు.



# మార్చి నెల భావపరిచయ పోటి

బహుమానం 10-0-0.



విబంధనలు:-ఆంధ్రజ్యోతి పాఠకులందరూ యీ పోటీలో పాల్గొనవచ్చును.

వ్యాఖ్య కార్డుమీదనే వ్రాయాలి.

బహుమతి నిర్ణయంలో సంపాదకునిదే తుదితీర్పు.

దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. వ్యాఖ్యచేరు తుది తేది 22-3-47

# ఫిబ్రవరి నెల భావపరిచయ పోటి

## సమాధానం




ఫిబ్రవరి బహుమానం 10/- ఈ క్రింది ఇద్దరికీ పంచాము

మిత్రలాభము!

డి. వి. హెచ్. ఎస్. సూర్యనారాయణ

డి. ప్రొహిబిషన్ అఫీసు, జమ్మలమడుగు.

'త్యాగయ్య'

కె. గోవిందస్వామి, జి. ఎ. కాలేజిహాస్టల్, అనంతపురం.

# భావపరిచయ పోటీ

ఆంధ్రజ్యోతి భావపరిచయ పోటీ పెట్టినప్పటినించీ పాఠకులు ఈ పోటీలో ఎంతో ఉత్సాహం కనపరుస్తూ వచ్చారు. ఇందులో హైస్కూలు విద్యార్థి. విద్యార్థినులు మొదలుకొని కాలేజీ విద్యార్థులు, రచయితలు, పండితులూ అందరూ మాకు సహకారం చూపుతూ వచ్చారు. దాదాపు మూడువందల సమాధానాలతో మొదట ప్రారంభమైన ఈ పోటీకి ఈనాడు 1037 సమాధానాలు వచ్చినవి. ఇందుకు మేము పాఠకులను అభినందిస్తున్నాము. ఇంతకాలమూ కాగితం ఇబ్బందులవల్ల మేము ఇంకో అదనపు పేజీ ఈ పోటీక్రింద వినియోగించలేక పోయాము. ఇకముందు, బహుమతి పొందినవారు వారి ఫొటోలు పంపితే ప్రచురించదలచుకున్నాము. బహుమతిదారులు తమ ఫొటోలుపంపి మాకు సహకరిస్తారని నమ్ముతున్నాము.

పోతే ఈ పోటీకి 1037 సమాధానాలు వచ్చినవని ముందుగానే చెప్పాము. వీటిలో "మిత్రలాభము!" "త్యాగయ్య" అనేవి ఇద్దరే పంపారు. వీటిలో ధ్వనితోకూడిన సున్నితహాస్యం కనిపిస్తోంది. అంచేత వీరికి బహుమానం పంచదలచుకున్నాము.

కాగా "సొంతలాభం కొంత మానుకు పొరుగువారికి సాయపడవోయ్!" అని ఇరవై మంది పంపారు. "పరోపకారార్థ మిదంశరీరం" అని 212 మంది పంపారు. "ప్రేమమయమే జీవనము, త్యాగమయమీ జగము" అని 437 మంది పంపారు! ఎక్కువమంది ఈ సమాధానమే పంపటంవల్ల వీరిలో ఒకరికి ఒక సంవత్సరం ఆంధ్రజ్యోతి ఉచితంగా పంపదలిచి లాటరీవేశాము. లాటరీలో ఈక్రిందివారు నెగ్గారు.

తాయి రత్నమాల
ఉండి,
భీమవరంతాలూకా.

వీరికి ఒక సంవత్సరం ఆంధ్రజ్యోతి పంపుతాము.

# దీక్షితులుగారికి చలంగారి ఉత్తరాలు

## 107

బెజవాడ
My Prophet, 9-10-49

జ్వరం - కాని, రాత్రి వొచ్చిన ఈ కల వ్రాయకండా వుండలేను.

గొప్పవుత్సవం జరుగుతోంది భగవాన్‌కి. తెలుగువాళ్లుకూడా వేలకొలది నేలమీద గుంపులు గుంపులుగా కూచున్నారు రాత్రిచీకట్లో. అక్కడక్కడ దీపాలు, భజనలు, వేదం, పూజలు. శూన్యంవంక చూస్తో, నిర్లక్ష్యంగా, నడిచిపోతున్నాడు చలం ఆమనుషుల్లోనించి. మనుషులు అతన్ని గుర్తుపట్టి, అతనిపేరుని గుసగుసలు పలుకుతున్నారు. అతను తమవేపు చూడాలని 'జోక్' చేస్తున్నారు. ముఖ్యం మన సారస్వతమిత్రులు. అతను తల కిందికివొంచి చూడనన్నా చూడడు. గుర్తుపట్టడు. అట్లా నడుస్తో వెడుతున్నాడు.

గొప్పపూజ. అందరికీ ప్రసాదం పంచిపెడుతున్నారు. ఆపూజ ఉదకం గ్లాసులతో తాగుతున్నారు. ఆ ప్రసాదమూ, ఆ ఉదకమూ, ఏదీ లక్ష్యంలేదు చెలానికి. తనవేళ్లచివర్లు మాత్రం పూజ నీటిలో ముంచి, వెళ్లిపోతున్నాడు చాలా ఠీవిగా.

దూరంగా భగవాన్ ఎత్తైన dias డయాస్‌మీద, నల్లని ఆకాశంముందు silhouette (సిలూటీ) గా కనపడుతున్నారు. నల్లటికుర్రాళ్లు ఆయనకి పూలూ, పూజాద్రవ్యాలూ తయారు చేస్తో, ఆయనదగ్గిరిగా తిరుగుతున్నారు.

తెల్లటి frock and skirt వేసుకుని సౌరీస్ తిరుగుతోంది. అక్కడ ఎట్లా ఉన్నదా అని ఆశ్చర్యపోతున్నాడు చలం.

మామూలుప్రకారం భగవాన్ "ఆ అమ్మాయిని 'సౌరీస్‌ని' రమ్మనండి." అన్నారు గావును అని జ్ఞాపకం తెచ్చుకున్నాను.

చలానికికూడా భగవాన్‌దగ్గరికి వెళ్ళాలని వుంది. వాళ్ళు పిలవకండా అక్కడికి వెళ్ళడానికి గాని; సౌరీస్ తండ్రినని వెళ్ళడానికిగాని చలానికి చాలా గర్వం.

"భగవాన్‌కి చలం అక్కర్లేకపోతే పోనీ. చలానికి ఏంలెక్క!" అనుకుంటో వెళ్ళిపోయినాడు చలం.

అట్లావెళ్ళి మాతృ భూతేశ్వరి ఆలయద్వారంవంటి దేవాలయంద్వారం దగ్గిరికి వెళ్ళాడు. లోపల అరుగురుమీద ఓ కుర్రాడు ఒక లింగాన్ని ఒక కొయ్యతొట్టిలోపెట్టి పూయిస్తున్నాడు. భగవాన్ తనకికావాలని చలానికి పెద్ద వాంఛ (longing) పట్టుకుంది.

ఆ కుర్రాడు "భగవాన్‌ని ఆరాధించాలనివుందా నీకు?" అన్నాడు. చలం తలవూయించాడు. ఆ కుర్రాడు ఆ శివలింగాన్ని చూపి "ఇదే భగవాన్. రా పూజచెయ్యి." అని ఆ వుయ్యాలవి

చలానికిచ్చి వూయించమన్నాడు. పైగా "పాడు" అన్నాడు. చలం ఓపాట యీలలో ఊదుతున్నాడు. ఆ కుర్రాడూ ఈలతో పాడాడు. ఆకుర్రాడి ఈలలోంచి ఒకపెద్ద ఆర్కెస్ట్రా వాయిస్తున్నట్టు వినబడ్డది.

"నువ్వు నామల్లే ఊదు" అన్నాడు ఆ కుర్రాడు.

తనచాత కాదన్నాడు చలం. అయితే పాడమన్నాడు ఆ కుర్రాడు. చలం "వరములొసగి బ్రోచుటనీ" అని పాడుతున్నాడు. ఆపాట చలానికి అసహ్యం, సాధారణంగా. భగవాన్‌ని తలుచుకుంటూ పాడుతూ, "అయినా భగవాన్‌ని అడగవలసిన వరమేముంది నాకు ? పోనీ యీజబ్బు పోగొట్టమంటాను." అనుకుంటున్నాడు చలం. ఇంకా బిగ్గిరిగా, యింకా బిగ్గిరిగా, పాడించాడు చలంచేత ఆ కుర్రాడు. ఇంతలో బైట భగవాన్‌దగ్గిర గొప్ప వాయిద్యాలు ప్రారంభించారు. వాటి ధ్వని పైన వినబడేట్టు అరిచి పాడాల్సి వచ్చింది చలం. లేకపోతే, ఆలింగాన్ని, ఆ కుర్రాడు వూపనియ్యడని భయం.

ఆ కుర్రాడు సంతోషించి "నీకు భగవాన్ ప్రసాదం కావాలా ?" అని అడిగాడు, ఆ ద్వారంలోంచి దూరంగా కనబడే భగవాన్‌ని చూపుతో. ఆత్రుతతో కావాలన్నాడు చలం.

ఆ మూలనున్న ముసలి ముష్టివాణ్ణి చూపి,

"ప్రతిరోజూ భగవాన్ ప్రసాదం అతనికి వస్తుంది. ఇవాళరానీ, అతన్ని బతిమాలి నీకు కొంచెం యిప్పిస్తాను." అన్నాడు.

ప్రసాదం వొచ్చింది. విభూతిముద్ద, వొంగిన ఇనపచువ్వ చివర నూనె. అవి కొంచెం ఇచ్చాడు చలాన్ని నుదుటపెట్టుకోమని.

మెళుకువ వొచ్చింది.

చాలా స్పష్టంగా వొచ్చింది యీ కల:

నా జ్వరంలో మొన్న అకస్మాత్తుగా వినబడ్డది.

"If you depend on experience alone,
you will have to take other's experience
as your own experience'' అని

దేనికో ఇది సంబంధం తెలీటంలేదు.

నా సందేహాలకి జవాబేమో ?

## 108

ఏలూరు

My dear Bhagvan dass, 18-10-40

అరుణాచలం వెళ్లారు మీరు అదృష్టవంతులు. భగవాన్ హాలులో చదువుతానని నన్ను వుత్తరంవ్రాయమని మీరేమో వ్రాశారు, నిన్నరాత్రే పదింటికి, నిస్సహాయుడైన భగవాన్ (helpless Bhagvān) జోక్యం వొదులుకోవాలని నిశ్చయించుకున్నాను. ఏందుకంటే, గమ్యస్థానం ఏదైనా, భగవాన్ బోధించేమార్గం, వ్యధామయం. ఈ ధ్యానం గోల నాలో ప్రారంభించకముందు ఎట్లా వున్నానో, ఆ స్థితికి వెళ్ళిపోవా లనిపిస్తోంది. కాని తిరిగి వెళ్ళడం చాతకాకండావుంది. చాతకాకండా చేశారని భగవాన్‌మీద కోపంగావుంది.

## 109

ఏలూరు

My dear Deekshitar, 21-10-40

I have been going through another spiritual crisis, revolt, rebellions resignation and agnosticism.

మళ్ళీ ఓ ఆధ్యాత్మిక అపాయస్థితిలో పడ్డాను. తిరగబాటు. నిస్పృహత్వం. నిరీశ్వరత్వం.

మీ ఉత్తరంతో బాగుపడ్డాను మళ్ళీ. ఇరవైయేళ్ళు పనిచేశాను. చాలు. వొదులుకోవాలని వుంది. I am tired of this work. పని దుర్భరంగావుంది. వొచ్చిన ఖర్మం ఏమిటంటే తాత్కాలికంగా భగవాన్ మనచెయ్యి వొదిలితే మనం నిస్సహాయులమై పోతాం. మన పాత పద్ధతులూ, సంతోషాన్నిచ్చే సంగతులూ, మనకి సహాయంచెయ్యవు, ఇప్పుడు.

మనని అందర్నీ ఒకేసమయంలో ఒదిలేశారు భగవాన్. కాని మళ్ళీ కావిలించుకోడానికే.

భగవాన్ కలల్లోవొస్తే, కలలో ప్రతి చిన్నవిషయం చాలా స్పష్టంగా జ్ఞాపకంవుంటుంది.

సౌరిస్‌కి ఒక కల వచ్చింది. భగవాన్ ఆమెకి నిశ్శబ్దం అర్థం చెపుతున్నట్టు....

నిశ్శబ్దం అంటే నిర్ + శబ్దం, అంటే శబ్దం లేకపోవడం, శబ్దం వుంటేనేగాని నిశ్శబ్దం ఎట్లా వుంటుంది?

"నిశ్శబ్దం అంటే ఏ శబ్దమూ లేకపోవడం కాదు—శబ్దంలేని శబ్దం అన్నమాట" అన్నారుట భగవాన్.

నా అనారోగ్యమూ అహమూ అనే మబ్బుల్ని చీల్చుకుని భగవాన్ కాంతివొస్తోంది నామీదికి.

తక్కిన ఉద్దేశ్యాలనీ, ఆశయాల్నీ నాశనంచేశారు భగవాన్, తనమీదా, కొంతవరకు పిల్లలమీదా తప్ప తక్కినవన్నీ—కాని మళ్ళీ మళ్ళీ స్త్రీ సౌందర్యంకోసం కాంక్ష తలెత్తుతో వుంటుంది. కాని క్రమంగా దూరమౌతోంది.

That is How "I am"

## 110

ఏలూరు

My dear Bob, 28-11-40

లేవడమే తలనొప్పితో లేచాను. విరేచనాలకి ఉప్పుతీసుకుని స్పెన్సరులో టీ తాగడానికని రైలుస్టేషన్‌కి వెళ్ళాను. ఆ స్పెన్సరే నా ముఖ్యమిత్రుడు యీ వూళ్ళో. ముందు టీ కప్పు పెట్టుకుని కూచుంటే, నాలోంచి గుబులు, లోకాలు అన్నీ ఛండాలం, భగవాన్ దూరం, నిస్సహాయుడు. అంతులేని ఖేదం, లోకమంతా ఖేదం.

ఇంటికి వొచ్చాను. విరేచనమయింది. తలనెప్పి చెదిరిపోయింది. లోకం చాలా అందంగా కనపడ్డది; పక్షులు పాడాయి. ఉదయించే సూర్యుడు, అద్భుతంగా కనపడ్డాడు. నేను చాలా సంతోషవంతుణ్ని. భగవాన్ చాలా గొప్పవారు. ఆయన లేకపోతే నేనేమయ్యేవాణ్ణి!

కనక, జాపీ, లోకపురంగు చక్కని విరేచనంమీద ఆధారపడివుంది. ఐనా తాము చూసేదీ అనుభవించేదీ, సత్యమనీ, వాటికి శాశ్వతమైన విలవలున్నాయనీ అనుకుంటారు ప్రజలు. ఇంకా.

నన్ను వుత్త ఫూల్‌ని చేస్తున్నారు మీరు. నేను వీటిని (విన్నపాలు) నా కోసం వ్రాసుకున్నాను. ఎట్లావున్నాయో చూడమని మీకు పంపాను. రాధ గీతంకూడా ఒకటి తయారౌతోంది. ఏం గతి పట్టింది చలం నీకు ? ఈ పతనానికంతా కారణం మీరు ?

ఓ రాత్రంతా పడ్డ ఆత్మక్షోభకి పర్యవసానం యీ గీతం. ఏ ప్రయత్నం లేకండా వొస్తున్నాయి యీ గీతాలు. అందువల్లనే ప్రజలహృదయాల్లో శబ్దించాలి. కాక—నిశ్శబ్దించాలి.

ఈనాడు నేను భగవాన్ భక్తుణ్ణని నిశ్చయంగా బహిరంగంగా అనగలను. నీకు పిచ్చెక్కిందా అంటే భగవాన్ వర్షించే అమృతం తాగి మత్తెక్కిందంటాను.

ప్రతిభరాళ్ళు నా piece ని వెయ్యరు. నామీద వుండే ద్వేషమేకాదు. ఇంకా కారణాలుంటాయి. కాని మీరెందుకు వాళ్ళకి పంపారా అని నా ఆశ్చర్యం.

హరీన్ చటోపాధ్యాయ ఇక్కడ వున్నారు, ఆయన స్నేహితురాలు సునీతతో. వాళ్ళిద్దరూ భగవాన్‌మయం. వాళ్ళు అరుణాచలంలో కుటీరం కట్టుకుంటున్నారుట.

ఇంకా గీతాలు వ్రాస్తాను. call రానీంది. అరుణాచలానికి మనుషుల్ని canvas చేస్తున్నాను.

## 111

ఏలూరు

My dear George, 11-12-40

I had a dream of a dream, a dream, great dream. నాకో గొప్ప కల వొచ్చింది.

ఆశ్రమంలో చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భగవానూ అందరూ ఏదో మందిరానికి, ఉత్సవాలకి వెడుతున్నారు. నాకు భోజనంలేదు. ఒంటిగంటయింది. వూళ్ళోకి వెడదామనుకుంటున్నాను. భగవాన్ నా వంకకి వొచ్చారు. ఏం చెయ్యడానికి తెలీలేదు. సాష్టాంగ పడ్డాను. ఆయన అన్నారో, తెలిసేట్టు చేశారో నాకు "ఆ స్థలానికి (మందిరానికి) వెళ్ళు" అని.

తిండి లేకండానే వెళ్ళాను. హాలులో గొప్ప పారవశ్యంలో నృత్యంచేస్తున్నారు భగవాన్ (పాడుతున్నారేమో కూడానూ). ఎట్లాగో కదులుతున్నారు, తేలుతున్నారు. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

చప్పున చిన్నవారైనారు. జుట్టు అంత నల్లగా ఎట్లావుందా అని ఆశ్చర్యపోతున్నాను.

...............

హాల్లో ఎవరూలేదు. నేనే వున్నాను. భగవాన్‌కోసం వెతుకుతో వెళ్ళాను. నవీన సాంప్రదాయంలో అలంకరించుకున్న స్త్రీ కనపడ్డారు. మొహానికి 'క్రీం' పక్కన దాసీతో సహా. ఎట్లాగో తెలుసు ఆమె భగవాన్ అని నాకు. ఆమె దగ్గిరికి వెళ్ళడానికి గాని, తాకడానికి

గాని భయపడ్డాము. ఆమె నా చెయ్యిపట్టుకుని, ఓ గదిలోకి లాక్కెళ్ళారు. రంగుల చీరెలతో నిండిన ట్రంకు చూపి "చూడు. ఇవన్నీ నా బట్టలు" అన్నారు.

మళ్ళీ వొంటరినైనాను. ఆమెకోసం వెతుకుతున్నాను. ఆమె స్తంభం దగ్గిరిగా సగం బట్టలు వేసుకుంటో, సగం వొంటికి ఏమీలేకండా వున్నారు. దాసీ బట్టలు అందిస్తోంది. వొణికి వెనక్కి వెళ్ళాను.

అదీ కల.

అరుణాచలం ఎవరెవరం వెడతామో తెలీదు ఇంకా. భగవాన్ ఆజ్ఞకోసం సౌరిస్ చూస్తోంది. నాకు ఆజ్ఞ అయింది.

## 112

ఏలూరు

My dear Jack, 18-12-40

Why do you complain of sex in my stories! Is it a new thing that Chalam is sex-ridden? If you question,

'Still ?!!' I say, that మంగమ్మ and కలం are all old things written more than six years back. Not that I plead guilty of sex-crime even now; but that I am not so preoccupied with sex as before. I also believe that any man who is completely immersed and submerged in anything to its logical and psychological end will speedily reach the road. Sex has been my Salvation. Every attractive woman reminds me of Bhagvan, though I am not impervions to even her pluysical charms.

Perhaps as my path is woman, yours is child. Would I complain that your stores are child-ridden. And is there much difference between the love for woman, and love for child.

My dear boy, rise above these prejudices.

Sex is divine.

నాకథల్లో "సెక్సు" వుందని కోపడతారెందుకు? చలం నిండా "సెక్సు" వుంటుందనేది యీనాడుతెలిసిన కొత్తవిషయమా? "ఇంకానా? ఈనాటికీనా?" అంటారా, "మంగమ్మా, కలం" ఆరేళ్ళకిందట వ్రాసిన పాత కథలు. ఇప్పటికైనా సెక్సు వ్రాయడం నేరంకింద వొప్పుకుంటున్నాననికాదు. ఇదివరకంత "సెక్సు"లో మునిగివుండటలేదు. అంతే. అదికాక యేవిషయంలోనైనా, పూర్తిగా మునిగి దాని తార్కిక మానసిక పర్యవసానాలదాకా తరిచి చూచేవాడు త్వరలో సత్యమార్గం అందుకుంటాడని నా నమ్మకం. సెక్సు నా ముక్తిమార్గం. ప్రతి స్త్రీ లావణ్యమూ నాకు భగవాన్‌ని జ్ఞాపకంచేస్తుంది. ఆమె శరీర ఆకర్షణకి అంధుణ్ణీకాను. నామార్గం స్త్రీ అయినట్టు మీ మార్గం శిశువుగావును. మీ కథలనిండా శిశుత్వమని నేను ఆమార్గం నిందిస్తానా? స్త్రీమీది ప్రేమకూ, శిశువుమీది ప్రేమకూ అట్టే బేధంవుందా?

అబ్బాయీ, యీ అల్పబేధాలనించి అతిక్రమించండి. స్త్రీ సంబంధం దివ్యం.

## 113

ఏలూరు
20-12-40

When you cannot know—you think
When you cannot think—you do
When you cannot do—you talk
When you cannot talk—you weep

నాగీతాలు మీరుచూడడానికే పంపాను. ప్రచురణకికాదు. అల్లరి భగవాన్ మల్లే మీరూ అందరూ నవ్వేట్టు నన్ను అచ్చులోకి లాగారు. నవ్వుతున్నారా బాగా మీరు? నేను వ్రాసిన వన్నీ కాపీచెయ్యవలిసి వొచ్చిందని సణుకుతున్నారా?

శ్రీ శ్రీ అశాంతి అనే పత్రిక పెడతాట్ట. దానికి యీ గీతాలు కావాలిట.

పరిక్షహాలులో, వాచింగ్, వాచింగ్, వాచింగ్, అరుణాచలానికి మాతోవసద్దుతున్నారు భగవాన్. వెడతామన్నమాటే తప్పకండారండి.

Hip Hip Hurrah అంటే అర్ధం, Glory to Bhagvan.

From Dronachalam
Somebody comes to Venkatachalam
To take him to Arunachalam

## 114

అరుణాచలం
24-12-40

Greetings from Arunachalam.

## 115

ఏలూరు

My dear Peacock, 7-1-41.

అరుణాచలంలో మూడు తమాషాలు జరిగాయి నాకు యీసారి. రైల్లో మాతో కొందరు మహరాష్ట్రులు ప్రయాణంచేస్తున్నారు. చదువుకున్నవాళ్లు. నా స్నేహితులతో అన్నాను "వాళ్లతో మాట్లాడి వాళ్ళని తిరువన్నామలైకి "కాన్‌వాస్" Canvass చేస్తానని. వాళ్ళని పలకరించాను. ఎక్కడికి వెడుతున్నారని వాళ్లు అడిగితే, తిరవన్నామలై అన్నాను. అంతే. వాళ్లెక్కడికో వెడుతున్నారు. మేము అరుణాచలం వెళ్ళిన రెండురోజులకి వాళ్ళూ వొచ్చారు. ఏమిటని అడిగితే, మా Plans మార్చుకున్నాము అన్నారు.

ఓ మధ్యాన్నం సౌరిస్‌తో మామూలు ప్రకారం గోల పెడుతున్నాను. "ఎందుకొచ్చానో ఇక్కడికి? ఇంటిదగ్గిర వుంటే రేడియోలో "అకించన్" పిడేలు సంగీతమన్నా వింటోవుండే వాణ్ణి" అన్నాను. ఆ అన్నానన్న సంగతే మరిచిపోయినాను. సాయింత్రం బైట కూచున్నాము

నేనూ సౌరిస్. భగవాన్ హాలులోంచి ఫిడేలు సంగీతం వినపడ్డది. అటువంటి సంగీతం ఎన్నడూ వినలేదనిపించింది—రాత్రి భోజనందాకా, మర్నాడూ వాయించారు ఫిడేలూ, వీణా. శర్మ సోదరులు. వాళ్ళు నాతో స్నేహంచేసుకున్నారు. నాకేం తెలీకుండానే వాళ్ళతో "ఎన్నడూ ఇట్లాంటి సంగీతం ఎక్కడా వినలేదు - బెంగాలునించికూడా" అన్నాను, సౌరిస్ నేను ఆ మధ్యాహ్నమన్న మాటలు నాకుజ్ఞాపకం చేసింది.

"ఇక్కడ నీకు సంగీతం లేదని కొంచపడుతున్నావా! వినిపిస్తాను వట్టు" అని భగవాన్ అన్నట్టయింది.

సాయంత్రం భోజనానికి ఇబ్బందుల్లో వున్నాము. సౌరిస్‌తో అన్నాను "ఇదంతా శివుని వూరయిందిగాని, వైష్ణవ ఆలయం వుంటే, పులిహోర, దద్ధోజనం దొరుకునుకదా!" అని. ఆ సాయంత్రమే మేము కొత్త హోటలుకోసం వెతుక్కోవలసివొచ్చింది. అక్కడ పులిహోర సిద్ధంగావుంది. మర్నాటి సాయంత్రానికి దద్ధోజనం సిద్ధం. భగవాన్ మాకో మంచి ఇల్లుకూడా కుదిర్చారు - భోగం అమ్మాయి నాట్యానికి కట్టిన చలవరాతి అందమైన మేడ.

హాలులో మిమ్మల్ని తలుచుకున్నాను. భగవాన్ నన్ను రెండు చక్కని తన్నులు పైకి తన్నారు. ఆశ్రమంవాళ్ళు వాళ్ళలో వాళ్ళమల్లే చూశారు మమ్మల్ని. భగవాన్‌కూడా పాత స్నేహితుల్ని, మిమ్మల్ని, పలకరించినట్టు. పలకరించారు మమ్మల్ని.

మీ T. D. C. స్నేహితుడు తన పిల్లకి భగవాన్‌చేత అన్నప్రాశన చేయించుకున్నారట.

## 116

ఏలూరు.

My dear Bob, 10-2-41.

నరకంనించి నిన్న మీకో వుత్తరం వ్రాసి చింపేశాను. నెలరోజునించి ఒకటే తల నొప్పి. దానివల్లనో ఎందుకో, లేక భగవాన్ నన్ను పరిశీక్షిస్తున్నారో, లేక నాలో మురికిని కెలుకుతున్నారో, నా మనస్సు చాలా బాధపడుతోంది. రెండురోజులకిందట Crisis వొచ్చింది. ఇంక ఆశ లేదనిపించింది.

నాకు "ప్రతిభ" పంపలేదు. పంపకపోవడం తప్పుకాదు. నా పదాలుపద్ద కాయితమన్నా పంపమని వ్రాయండి. అవును. అట్లాంటి పదాలు ఇంకా వున్నాయి. వాటికి పిచ్చిపోకిళ్ళు అని పేరుపెట్టాను. కాని మీ ఇష్టం - అది తీసేసి, ఏ పేరన్నాపెట్టండి - మంచిపోకిళ్ళు అని అనన్నా అంటారేమో!

## 117

ఏలూరు.

My dear jors 14-2-47

Bhagvan visits me in misery, head - ache heart - ache and unrest.

ఆయన చాలా తమాషా రూపాలలో కనపడతారు. కల ఒకటి వొచ్చింది. మీరూ, నేనూ, స్నేహితులూ ఓ తోటలో కూచున్నాము. దానినిండా కోతులు – ఓ కోతి ఒకర్ని కరుస్తానని బెదిరించింది. వాటిల్లో ఏదన్నా ఒకటి నన్ను కరుస్తుందేమోనని భయపడుతున్నాను నేను. వినంగానే, ఓ చిన్న కోతి వొచ్చి, నన్ను కరుస్తానని బెదిరించింది.

"ఆ కోతి భగవాన్ నేను భగవాన్. అది నన్నెట్లా కరుస్తుంది?" అనుకున్నాను. కాని కరచేట్టు బెదిరించింది ఆ కోతి.

"భగవాన్" అన్నాను ఆ కోతిని. బిగ్గరిగా.

"భగవాన్" అని సన్న గొంతుకతో తిరిగి అంది ఆ కోతి.

అట్లా ఇద్దరమూ "భగవాన్, భగవాన్, భగవాన్" అంటున్నాము. ఏదో పాఠం చెప్పుకున్నట్టు. నాకు ఆ పాఠం సంతోషంగానే వుంది. కాని అవితే ఆ కోతి కరుస్తుందని భయం-ఇంతలో ఓ పెద్దకోతి, మనిషిలాగే వుంది; పెద్ద కుంకంబొట్టు పెట్టుకుంది. నాపక్కన వొచ్చి కూచుంది. మీరు నవ్వుతో ఆ తమాషా చూస్తున్నారు. ఆ పెద్దకోతి "అది భగవాన్ ఐతే నేనెవ్వరు?" అంది నాతో.

"నువ్వూ భగవానే" అన్నాను.

"ఎట్లాగేం? మే మిద్దరమూ భగవాన్ ఎట్లా కాగలం?" అంది నన్ను బెదిరిస్తో.

మీరు నవ్వారు.

నేను మేలుకున్నాను. దీని అర్థం వ్రాయండి.

## 118

ఏలూరు

My dear Patience 5-3-41

మీకు వ్రాయతగ్గది ఏమీలేక వ్రాయలేదు. ప్రతిభలో మీ కథ చాలా బావుంది. చక్కగా సాధించారు టెక్నిక్.

నాకో కల వొచ్చింది, నేనూ సౌరిస్ రైలులో వున్నాము. రైలాగింది. రమణాశ్రమం సమీపంలో వుందిట. కాని మేము కదలలేదు. మాపక్కన వున్న సన్యాసి ఒకడు రైలు దిగి, ఆశ్రమానికి వెళ్లి తిరిగి వొచ్చాడు. ముఖాన దివ్యమైన ఆనందం తాండవిస్తో, తను తీసుకొచ్చిన పువ్వులు అందరికీ పంచిపెడుతున్నాడు. ఆ దృశ్యంతో నా హృదయశూన్యత్వం తలుచుకుని కాలిపోయినాను. నెమ్మదిగా రైలుదిగి నడుస్తున్నాను. తోవకి రెండువక్కలా పువ్వులు. నిశ్శబ్దంగా నున్న ఓ ఇంటిదగ్గిర ఆగాను. లోపల భగవాన్ ఉన్నారని తెలుసు. కాని లోపలికి వెళ్ళలేదు. ఆ ఇంటిముందు సాష్టాంగంగా నేలమీదపడి. "నాకింక ఆశలేదా? నాకు శాంతి నిచ్చేందుకు నువ్వూ నిస్సహాయుడివా?" అని బిగ్గిరిగా వెక్కివెక్కి ఏడ్చాను. నిద్రలో నిజంగా ఏడ్చాననిపించింది. అక్కణ్ణించి రైలు వెళ్ళిపోతుందేమోననే భయంతో తొరగా వొచ్చాను. రైలు అట్టానే వుంది, అంతే కల.

ధర్మపురి భగవాన్ దగ్గిరికి వెళ్ళారుట. భగవాన్‌కి నమస్కారం పెట్టేదేమిటని తిరిగాట్ట. కాని సాయంత్రం నిలవలేక సాష్టాంగపడితే, భగవాన్ దిగ్గరిగా నవ్వారుట. ఆశ్రమంనించి తన వూరికి వొచ్చేప్పటికి తన గదిలో భగవాన్ ఉన్నారుట కూచుని.

ఏమిటి విశేషాలు? ఎట్లా వున్నారు?

చాలా బాధలోంచి నడిచి, క్రమంగా మళ్ళీ స్తిమితపడుతున్నాను.

ఎందుకు అంత దిగులుగా వున్నారు? కాంతిని సమీపించిన మనబోటివాళ్ళం, ఈ శరీరం, ఈ మనసు ఏం చేస్తున్నా గొడవ పడకూడదు. పాపం చేశామని దిగులుపడడం, ఆ పాప కార్యంకన్న, పాపపు ఆలోచనకన్న ఘోరం. ఈ ఇంద్రియాలూ, వాటి జన్మస్థానమూ, అదంతా వాటి తోవన వాటిని పోనియ్యండి. మనకేం పని వాటితో?

అదంతా భగవాన్‌కే వొదిలేసి, ఆయన్నించి విరహాన్నికూడా గుర్తించనంత నిర్లక్ష్యంగా వుండండి. ఆయనకి మీరు మరీ దగ్గిరిగా వున్నప్పుడు, మీకు ఆయన ముఖం కనపడదు.

My boy we were selected long back, no more selections grade for us. Yes, Nanduri wrote to me. (to attend some SAMITHI anniversary meetings) I said I would not meet the Poetic crew. Why should you? They wish to exhibit us.

## 119

ఏలూరు

My dear Goose, 23-4-41

ఈ వసంతంతో భగవాన్ అందరియడలా నిర్దయులైనారు. ఇతరత్రా పనిమీదవున్నారేమో?

I have been feeling miserable, groping in the dark. చాలాఖేదంలో వున్నాను. చీకట్లో తడుముకొంటో. కాంతిరేఖ దర్శనమన్నా ఈ జీవితంలో ఎప్పటికన్నా అవుతుందా అని సందేహం. All our lives are running through a tunnel of misery one way or other. మన జీవితాలన్నీ ఏదో ఒకవిధాన ఖేదమనే చీకటి కొండగుహామార్గాన నడుస్తున్నాయి. ఆచివరనన్నా ఏమన్నా కాంతివుందా? భగవానే సత్యమైతే యీ బాధా, ఖేదమూ మనని కడగడమూ, రుద్దడమూ అయివుండాలి. కాని ఎన్నాళ్లు? మనలో ప్రతివారూ అడుగుతున్న ప్రశ్నే అది. భగవాన్‌కూడా మనపట్ల అసహాయులా? మనలో ప్రతివారూ అవస్తపడుతున్నారనడం కొంత ఆశాజనకంగావుంది. Wait, watch, and think not.





# ఆత్మకథ

## రాజేంద్ర ప్రసాద్

### సముద్ర ప్రయాణానికి సంబంధించిన ఉద్యమం

**1904** లో ఎఫ్. ఎ. పరీక్షకు కూర్చుని వేశవికాలం శలవుల్లో స్వగ్రామం జీరాదేయి వచ్చినప్పుడు మా అన్నగారు ఇంటిదగ్గరే ఉన్నారు. పరీక్ష ఫలితాలకు ఎదురుచూస్తున్నాను. డాక్టరు గణేశప్రసాద్‌గారు విదేశంలో చదువుకొని తిరిగివస్తున్నారని వార్తాపత్రికలలో చదివాము. మా జిల్లాలతో కలిసిఉన్న బలియా గ్రామస్తుడతను. అతని తాతగారి ఊరు ఛాప్రా. అతడుకూడ కాయస్తకులజుడే. అతడు అలహాబాద్‌లో డి. ఎస్. సి. పరీక్షలో ప్యాసయి, డిగ్రీపుచ్చుకొని ఇంగ్లండువెళ్ళి అక్కడనుంచి జర్మనీ వెళ్ళాడు. గణితశాస్త్రంలో పెద్దపేరు సంపాదించాడు. అతడక్కడ బయలుదేరుతూ ఉండగానే, అతన్ని కులంలో ఉంచుకోవాలా వెలివేయాలా అనే గోల పుట్టింది. ఛప్రాలో రెండుపార్టీలు ఏర్పడినాయి. ఒకరు సంస్కరణవాదులు. వీరికి లీడరు బాబూ వ్రజకిశోర్ ప్రసాద్, క్రొత్తగా పైకివస్తున్న ప్లీడరు. సనాతన దళానికి చేరిన వారిద్దరు ప్లీడర్లు - వృద్ధులు. వ్రజకిశోర్‌బాబు మా యింటికి వచ్చాడు. గణేశప్రసాద్‌కు విందు ఏర్పాటుచేయాలని, అతనిని వెలివేయకూడదని, విందుకు మేము తప్పక రావాలని కోరాడు. ఇంతవరకు విదేశాలు తిరిగివచ్చినవారు మా బీహారులో ఒక్క సచ్చిదానంద సింహాగారు మాత్రమే. అతడువచ్చి పది పన్నెండేళ్లు అయింది. అప్పుడు కూడా ఆందోళన జరిగింది కాని కులాచార ప్రకారం ప్రాయశ్చిత్తం చేసుకోటానికి ఆయన యిష్టపడలేదు. అందువల్ల ఆయన్ని వెలివేశారు. గణేశప్రసాద్ ఇంకా బయలుదేరకముందే కుల కట్టుబాట్లకు లొంగి ఉంటావా లేదా అని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. గణేశ్‌బాబు విదేశాలలో చాలా సాదాగా ఉండేవాడు. మాంసమూ మద్యమూ ముట్టుకోనేలేదు. ఈ విధంగా ఉండకలిగితే విదేశాలకు పోవుట కే అభ్యంతర ముండకూడదని సంస్కర్తల వాదము. సింహా తిరిగివచ్చిన పదేండ్లవరకు విదేశాలకు పోవుటకెవ్వరూ సాహసించలేదు. గణేశ్ వచ్చిన వెంటనే అతనితోకలిసి భుజించడానికి కొంతమందిని తయారుచేశాడు వ్రజకిశోర్. భోజనానికి పోవడానికి మా నాన్నగారు తను ఇష్టపడలేదు గాని మా అన్నదమ్ముల నిద్దరిని పంపించడానికి ఒప్పుకున్నాడు.

డాక్టరు గణేశ్ దేశంలో అడుగుపెట్టాడు. బలియాలో విందుకు ఏర్పాటుజరిగింది. వ్రజకిశోర మాటప్రకారం మేమొక ఇరవైమంది ఛప్రానుంచి వెళ్ళాము. మేము యిద్దరన్నదమ్ములము.

జమునా గంగాబాయీలు. మా ఊరు మునసబుగారు యీ జట్టులో ఉన్నాము. డాక్టరు గణేశ్‌ను కలుసుకొన్నాము. బలియాలోని కాయస్థులలో చాలా అలజడి పుట్టింది. మేముకూడా కాయస్థులమే - పూర్వాచార పరాయణులము. పురోహితులువచ్చి వేదోక్తక్రతువులన్నీ చేయిస్తూ ఉంటారు. మా అత్తవారింటి తాలూకు వ్యక్తులు బలియాలో ఉన్నారు. అందులో ఒకడు ప్లీడరు. ఇంకొక డేదో పనిచేస్తున్నాడు. మేము వచ్చినసంగతి ఊరంతా ప్రాకింది. విషయాన్ని దాచిపెట్టడం మాకిష్టంలేదు. మా సగోత్రీకుడొకడు వకీలు - వరుసకు మా కన్న అవుతాడు. అతడు మా దగ్గరకువచ్చి యీ విందులో పాల్గొనకూడదని చెప్పాడు. మేము మా నాన్నగారితో చెప్పకుండా వచ్చామని ఆయన సందేహం. మేము గట్టిగాచెప్పి ఆయన్ని నమ్మించాము. కాని మా అందరితో సంప్రదించకుండా మీ నాన్న ఎట్లా ఒప్పుకున్నా డన్నా డాయన. ఏదోవిధంగా యీ సంగతి మా అత్తవారింట్లో తెలిసింది. వాళ్ళకుకూడా ఇష్టం లేకపోయిందికాని వాళ్ళు మమ్మ అంతగా నిర్బంధించలేదు. రాత్రి విందుజరిగింది. మేమందరము భోజనంచేసి ఇండ్లకు వెళ్ళిపోయాము. డాక్టర్ గణేశబాబు మొదట అలహాబాద్‌లోను, తర్వాత హిందూ విశ్వవిద్యాలయంలోను, పిదప కలకత్తా విశ్వవిద్యాలయం లోను గణితభాగంలో ఉన్నతపదవిలో ఉండి చాలా ఏండ్ల తర్వాత పరమపదించాడు. వారితో మొదటిసారి సమాగమం నేను మరువజాలను. నేనంటే వారికెంతో ప్రేమ.

బలియానుంచి తిరిగి వచ్చేటప్పుడు ఛప్రాకు దగ్గరగా ఉన్న మా అక్కయ్య అత్తవారి వూరు వెళ్ళాను. అక్కడకు వెళ్ళడములో ప్రత్యేకమైన పనేమీ లేదు. చాలా రోజులనుంచి రెండుమూడు రోజులు వచ్చిఉండి వెళ్ళమని మా అక్కయ్య అడుగుతున్నది. ఛప్రానుంచి అక్కడకు వెళ్ళడం. తేలిక అందువలన ఇంటికిపోకుండా అక్కడకు వెళ్ళాను. విందులో పాల్గొన్నవారి పేర్లన్ని పేపరులో పడ్డాయి. ఛప్రా అంతా మారుమ్రోగిపోయింది. వీళ్ళందరిని వెలి వేయటానికి ఏర్పాటులు జరుగుతున్నాయి. సముద్రయాత్ర నిషేధమని చెప్పించడానికి కాశీనుంచి మహా మహోపధ్యాయ శివకుమారశాస్త్రిని పిలిపించారు. పెద్దసభ (కాయస్థులకు మాత్రం) ఏర్పాటుచేశారు. నాకిదంతా తెలియనే తెలియదు. నేను గ్రామంలో మా అక్కయ్య ఇంట్లో ఉన్నాను. ఇంతలో పరీక్ష ఫలితాలు వచ్చాయి. బాబూ వ్రజకిశోర్ గెజెట్ చూచి జీరాదేయికి కబురుచేశాడు. అన్నగారు నాన్నగారు సంగతివిని చాలా సంతోషించారు. సత్యనారాయణవ్రతం చేశారు. బ్రాహ్మణ సంతర్పణ, బీదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదంతా నే లేకుండానే! నేను మా యక్కగారింటి దగ్గరనుంచి బయలుదేరి ఛప్రా వచ్చాను. మా బావకూడ ఛప్రా వచ్చాడు. ఛప్రాలో జరుగుతున్న అల్లరి ఆతనికేమీ తెలియదు. ఆ రాత్రి మాకిదీ తెలియదు, పరీక్షల సంగతీ తెలియదు. తెల్లవారుజామున జీరాదేయీకి రైలు బయలుదేరుతుంది. నేను చీకటితో స్టేషనుకువచ్చాను. బాబూ వ్రజకిశోర్ ఇల్లు స్టేషను దగ్గరే ఉంది. పరీక్షాఫలితాలు వచ్చినాయో లేవో తెలుసుకురమ్మని నేను నౌకరును పంపించాను. ఆయన పరీక్షాఫలితాలు వచ్చినాయనిన్నీ, తన్ను కలుసుకోకుండా వెళ్ళవద్దనీ కబురుపంపాడు. పరీక్షాఫలితాలు తెలుసుకోవాలనే కుతూహలంతో వారింటి కెళ్ళాను. ఆయన నన్ను ఆపివేశాడు. ఆయన ఆఫీసు ప్రొద్దున ఏడుగంటలకు తెరుస్తారు. ఆయనతో నేనుకూడా ఆఫీసుకు వెళ్ళాను.